RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in





07 నవంబర్ 2024 గురువారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:134

# డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం

వార్తా 2 లో





సికింద్రాబాద్ ప్రజాబలం ప్రతినిధి:తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు లిమిటెడ్ (టీజీసీఏబీ) పాలకవర్గం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.1,51,01,116 విరాళం అందించింది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి టీజీకాబ్ పాలకవర్గం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, ఈ మేరకు విరాళం చెక్కును అందజేశారు. టీజీసీఏబీ చైర్మన్ ఎం.రవీందర్ రావు , వైస్ చైర్మన్ కె.సత్తయ్య , పలువురు డైరెక్టర్లు ముఖ్యమంత్రిని కలిసినవారిలో ఉన్నారు.



జూబ్లీహిల్స్ ప్రజాబలం ప్రతినిధి:జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కుటుంబ సమేతంగా కలిశారు. తమ కుమారుడు సాయి రాజేంద్రప్రసాద్ వివాహ వేడుకలో పాల్గొనాల్సిందిగా కాసాని దంపతులు ముఖ్యమంత్రి కి ఆహ్వానం అందించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసిలకు అన్ని పార్టీలు సీట్లు కేటాయించాలి

## బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్

హైదరాబాద్ నవంబర్ 06 పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బిసిలకు సీట్లు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బిసిలకు తగినన్ని సీట్లు ఇవ్వకుండా అన్ని రాజకీయ పార్టీలు అన్యాయం చేశాయన్నారు. ఇప్పుడైనా బీసీలకు ఎమ్మెల్సీ సీట్లు కేటాయించి న్యాయం చేయాలన్నారు. బీసీలు కూడా ఆర్థికంగా బలంగా ఉన్నారని అన్నారు. బీసీ ఉపాధ్యాయులు, విద్యార్థుల నుండి ఒత్తిడి వస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో అన్ని కులలాలకు జనాభా ప్రాతిపదికన అవకాశం కల్పించాలన్నారు. బీసీలు ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తున్నారే తప్ప సీట్లు ఇవ్వడం లేదన్నారు. బీసీలకు ఎవరు సీట్లు ఇస్తే వారినే బీసీ పట్టభద్రులు, ఉపాధ్యాయులు గెలిపించుకుంటారని అన్నారు. బీసీలకు సీట్లు ఇవ్వని పార్టీలను బొంద పెడతామని అన్నారు. పార్లమెంట్ లో బీసీ బిల్లు పెట్టి, చట్ట సభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నానని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీ బిల్లుకు మద్దతు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సీ.రాజేందర్, అనంతయ్య, వేముల రామకృష్ణ, టి.రాజ్ కుమార్, భూపేష్ సాగర్, శ్రీనివాస్, శివ, రాందేవ్, జోషి, భాస్కర్, రాఘవ, కృష్ణమూర్తి, చిక్కుడు బాలయ్య పాల్గొన్నారు.

## "బర్డ్స్ ఆఫ్ తెలంగాణ" పాకెట్ గైడ్ భవిష్యత్ తరాలకు అవగాహన కల్పించేందుకు దోహదం

### తెలంగాణ పక్షుల పాకెట్ గైడ్ ను ఆవిష్కరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



తెలంగాణ లోని పక్షుల గురించి భవిష్యత్ తరాలకు అవగాహన కల్పించేందుకు హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ (%HBP%) సభ్యులచే అనుసంధానం చేయబడిన "బర్డ్స్ ఆఫ్ తెలంగాణ" పాకెట్ గైడ్ ఉపయోగపడుతుందని ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం ప్రజా భవన్ లోహైదరాబాద్ బర్డింగ్ పాల్స్( HBP ) సభ్యులచే అనుసంధానం చేయబడిన "బర్డ్స్ ఆఫ్ తెలంగాణ" పాకెట్ గైడ్ ను డిప్యూటీ సిఎం ఆవిష్కరించారు. ఈ పుస్తకము యొక్క అవసరాన్ని హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ కోర్ కమిటీ సభ్యులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ ) సభ్యులు"బర్డ్స్ ఆఫ్ తెలంగాణ" పాకెట్ గైడ్ ను రూపొందించడానికి వారు చేసిన కృషిని, వారి అవగాహన కార్యక్రమాలను ఉపముఖ్యమంత్రి అభినందించారు. హైదరాబాద్ బర్డింగ్ పాల్స్( HBP ) ప్రెసిడెంట్ శ్రీ ఆడెపు హరికృష్ణ తెలంగాణ పక్షుల గురించిన మొదటి పాకెట్ గైడ్ యొక్క ప్రాముఖ్యతను మరియు ఆవశ్యకతను ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ పుస్తకం తెలంగాణ పక్షుల ఆహారం, వలసలు మరియు పరిరక్షణ స్థితి గురించి తెలుసుకోవటానికి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని చెప్పారు. ఈ పుస్తకం విద్యార్థులు, ప్రకృతి ఔత్సాహికులు, విభిన్న ప్రేక్షకులను ప్రత్యేక జీవ వైవిధ్యంతో కూడుకొన్న తెలంగాణ ప్రకృతితో మమేకం కావటానికి ప్రోత్సహిస్తుంది. మొత్తం 252 ముఖ్యమైన పక్షి జాతులను కలిగి ఉన్న ఈ పాకెట్ గైడ్ తెలంగాణ వ్యాప్తంగా వున్న ప్రభుత్వ పాఠశాలల మరియు ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా అందించబడుతుందని వివరించారు.పట్టణ సరస్సుల పరిరక్షణకు కృషి చేసిన మాజీ డిజిపి శ్రీమతి తేజ్ దీప్ కౌర్ మీనన్ గారు, పక్షుల పరిశీలనను ప్రోత్సహించడంలో ఎదీూ యొక్క ప్రత్యేక పాత్రను కొనియాడుతూ ఈ బృందం ఇతర రాష్ట్రాలకు ఒక ఆదర్శంగా నిలిచింది అని తెలిపారు. ఈ బృందం ఇప్పటివరకు నిర్వహించిన 490ం ఉచిత బర్డ్ వాక్ ల ద్వారా పర్యావరణ పరిరక్షణపై పౌరులకు మరియు విద్యార్థులకు అవగాహన కల్పించడానికి వారు చేస్తున్న కృషిని ఆమె ప్రశంసించారు. ఈ పుస్తకాన్ని రూపొందించడానికి తమ చిత్రాలను అందించిన 30కి పైగా HBP సభ్యులైన వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ ల సహకారం ఎంతో అభినందనీయం అని అన్నారు. ఈ సందర్భంగా యువతలో పక్షుల పరిశీలనను ప్రోత్సహించటానికి మరియు వాటిని సంరక్షించటానికి ప్రభుత్వ మద్దతుకు హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ ( HBP ) బృందం కృతజ్ఞతలు తెలిపారు.

## గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధికి బొగ్గరపు దయానంద్ గుప్తఎమ్ ఎల్ సి సిఫారసు లేఖలు.



ఎల్.బి.నగర్ ప్రజాబలం ప్రతినిధి:బొగ్గరపు దయానంద్ గుప్త ఎమ్ ఎల్ సి గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధికి తమరు సహకరించాలని గోషామహల్ నియోజకవర్గం డెవలప్మెంట్ ఫోరమ్ తరఫున విన్నపించిన వెంటనే సంబంధిత శాఖల మంత్రివర్యులు కి సంబంధించిన శాఖ ల అధికారులకు సిఫారసు లేఖలను ఇవ్వడం జరిగింది అని బద్దం సతీష్ గౌడ్ కన్వీనర్ గోషామహల్ నియోజకవర్గం డెవలప్మెంట్ ఫోరమ్. మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెలియజేశారు, బొగ్గరపు దయానంద్ గుప్త ఎమ్ ఎల్ సి కలిసిన వారిలో అశోక్. లోహిత్. నరేందర్. చెందు గౌడ్. ఇఫతేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాబలం

07 నవంబర్ 2024 గురువారం

# అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం

అమెరికా, నవంబర్ 6(భారత్ సమాచార్) అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించాడు గెలుపునకు అసలు కారణాలు ఇజ్రాయిల్ యుద్ధం ఆ దేశంలో పెరిగిపోయిన ధరలు అవన్నీ కలిసి వచ్చాయి

ట్రంప్ రెండోసారి విజయానికి అనేక అంశాలు దోహదం- గెలుపునకు బాటలు పరిచిన అక్రమ వలసలు, ఆర్థిక వ్యవస్థ బలహీనంగా మారడం, పెరిగిన ధరలు

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విజయదుందుభి మోగించారు. ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ పట్టుదలతో శ్రమించి ఎన్నికల్లో జయకేతనం ఎగురవేశారు. అధ్యక్ష పదవి చేపట్టడానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 270ను దాటేశారు. వచ్చే ఏడాది జనవరి 20వ తేదీన రెండోసారి అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్ వైదొలిగిన తర్వాత కమలా హారిస్ రాకతో ట్రంప్ విజయంపై నీలినీడలు కమ్ముకున్నా, పట్టుదలతో శ్రమించిన ట్రంప్ ఎన్నికల్లో చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నారు.

గ్రోవర్ తర్వాత ట్రంపే

దీంతో అమెరికా చరిత్రలో ఒకసారి అధ్యక్షుడిగా పనిచేసి, కొంత విరామం తర్వాత మళ్లీధ్యక్షుడైన గ్రోవర్ క్లీవ్‌లండ్ తర్వాత రెండో వ్యక్తిగా ట్రంప్ నిలిచారు. గ్రోవర్ 1884, 1892 ఎన్నికల్లో అధ్యక్షుడిగా గెలుపొందారు. ట్రంప్ 2016లో తొలిసారి అధ్యక్షుడిగాపనిచేశారు. పలు కీలక అంశాలు ట్రంప్ విజయానికి దోహదపడ్డాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థ, అక్రమ వలసలు వంటి పలు అంశాల్లో ట్రంప్ వైఖరి ఓటర్లను ఆకర్షించినట్లు తెలుస్తోంది. అంతేకాదు ఈసారి ట్రంప్‌నకు యువ ఓటర్ల భారీగా మద్దతు ఇచ్చినట్లు సమాచారం.

ఆర్థిక వ్యవస్థే ప్రధాన సమస్య

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ ప్రధాన సమస్యగా ఉంది. చాలామంది అమెరికన్లు అధిక ధరలతో సతమతమయ్యారు. నాలుగింట ఒకవంతు అమెరికన్లు మాత్రమే దేశ ప్రస్తుత పరిస్థితులతో సంతృప్తిగా ఉన్నారు. మూడింట రెండొంతుల మంది ఆర్థిక రంగంపై పెదవి విరిచినట్లు ఓ నివేదికలో తేలింది. ఆర్థిక వ్యవస్థ అంశంలో బైడెన్ ప్రభుత్వంపై అమెరికన్లలో కొంత వ్యతిరేకత ఉంది. అధ్యక్షుడు జో బైడెన్ ఆమోదం రేటింగ్ జాతీయ స్థాయిలో పడిపోయింది. 10 మంది ఓటర్లలో నలుగురు మాత్రమే ఆయన పనితీరును ఆమోదించారు. ఇది ట్రంప్‌నకు కొంత అనుకూలంగా మారింది

బలహీనంగా మారిన ఆర్థిక వ్యవస్థను ట్రంప్ గాడిన పెట్టగలరని చాలా మంది ఓటర్లు బలంగా నమ్మారు. ఎన్నికల ప్రచారంలోనూ అమెరికా ఆర్థిక వ్యవస్థలో సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ బైడెన్ ప్రభుత్వంపై ట్రంప్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నాలుగేళ్ల క్రితంతో పోలిస్తే ఇప్పుడు మీరు మెరుగ్గా ఉన్నారా అంటూ ఓటర్లను ట్రంప్ సూటిగా ప్రశ్నించారు. దిగుమతులపై సుంకాల అంశంలో ట్రంప్‌వైపే ఓటర్లు మ్మొగ్గ చూపారు.

వలస విధానం విషయంలో ట్రంప్‌పై సానుకూలత

వలస విధానం విషయంలో ట్రంప్‌పై సానుకూలత ఉంది. ఆయన వలస సమస్యలను సమర్థంగా పరిష్కరించగలరని మెజారిటీ ఓటర్లు బలంగా నమ్మారు. తాను అధికారంలోకి వస్తే అక్రమంగా వలస వచ్చిన వారిని వెనక్కి పంపుతానని ట్రంప్ విస్పష్టంగా ప్రకటనలు చేయడం ఆయనకు సానుకూలంగా మారింది. మొత్తం వలస విధానాన్నే మారుస్తానని ట్రంప్ పలు ప్రచారాల్లో తేల్చి చెప్పడం వల్ల శ్వేత జాతి ఓటర్లలో మద్దతు పెరిగింది.

అక్రమంగా అమెరికాలో నివసిస్తున్న వారికి జన్మించిన పిల్లలకు ఉన్న జనన హక్కు విధానాన్ని సమీక్షిస్తానని ట్రంప్ హామీ ఇచ్చారు. శరణార్థి విధానాలనూ సమీక్షిస్తానని చెప్పడం వంటివి ఓటర్లను ఆకర్షించాయి. ప్రపంచంలోనే అత్యంత భారీ డిపోర్టేషన్ చేపడతానన్న ట్రంప్, వాగ్దానానికి భారీస్థాయిలో మద్దతు వచ్చింది. అటు బైడెన్ హయాంలో సరిహద్దుల్లో అక్రమ వలసలు రికార్డు స్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఈ విషయంలో ఓటర్లు ట్రంప్‌నే ఎక్కువగా విశ్వసిస్తున్నట్లు పోల్స్ కూడా చెప్పాయి.

క్యాపిటల్ అల్లర్లు, వరుస కేసుల్లో నేరారోపణలు, ఓ కేసులో దోషిగా తేలడం వంటి పరిస్థితులు ఎదురైనప్పటికీ ట్రంప్ దూకుడు కనబర్చారు. ప్రజల్లో ఆయనకు మద్దతు ఏడాది పొడవునా 40 శాతం లేదా అంతకంటే ఎక్కువే కొనసాగింది. చాలా మంది రిపబ్లికన్లు ఆయన్ను రాజకీయ కుట్రలకు బాధితుడిగా పరిగణించడం ఓటర్లలో సానుభూతి పెరిగింది. యూనియన్ వర్కర్ల వంటి సంప్రదాయ డెమోక్రటిక్ మద్దతుదారులను రిపబ్లికన్ల దిశగా ఆకట్టుకునేందుకు ట్రంప్ కృషి చేశారు. దిగుమతులపై సుంకాల ద్వారా అమెరికన్ పరిశ్రమ వర్గాలను పరిరక్షిస్తానని హామీ ఇచ్చి వారిని ఆకట్టుకునేందుకు ప్రయత్నించారు.

నిరంకుశ నేతలతో స్నేహం చేయడం ద్వారా ట్రంప్ అమెరికా మిత్రపక్షాలను అణగదొక్కారనే ఆరోపణలు ఉన్నా ఆయన మాత్రం అనూహ్య వైఖరినే తన బలంగా ప్రచారం చేసుకున్నారు. తాను అధికారంలో ఉన్నప్పుడు పెద్ద యుద్ధాలు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. బైడెన్ పాలనలో అమెరికా బలహీనంగా ఉందని, ఉక్రెయిన్, ఇజ్రాయెల్‌లకు భారీగా నిధులు పంపుతోందని ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ట్రంప్‌నకు కలిసొచ్చింది. మెజారిటీ ఓటర్లు హారిస్‌తో పోలిస్తే ట్రంప్‌ను బలమైన నేతగా పరిగణించారు.

అనుకూలంగా మారిన ముస్లిం ఓటర్లలో బైడెన్?పై వ్యతిరేకత!

ఇజ్రాయెల్, హమాస్ యుద్ధంలో బైడెన్ ప్రభుత్వ విధానాల వల్ల అమెరికాలోని ముస్లిం ఓటర్లలో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఇది ట్రంప్‌నకు అనుకూలంగా మారింది. ఇజ్రాయెల్ విషయంలో బైడెన్-హారిస్ ద్వయం విధానాల మూలంగా 40వేల మంది పాలస్తీనీయులు హతమయ్యారని అమెరికాలో స్థిరపడిన అరబ్బులు భావిస్తున్నారు.

సాధారణంగా ప్రవాసులంతా డెమోక్రటిక్ పార్టీకి ఓటు వేసేవారే, కానీ, డెమోక్రట్లు పశ్చిమాసియాలో అనుసరించిన విధానాల కారణంగా ప్రవాస అరబ్బులకు వారిపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఇది ట్రంప్‌నకు లాభం చేకూర్చింది. అమెరికా తలరాతను నిర్ణయించే స్వింగ్ స్టేట్స్‌లో ఒకటైన మిషిగన్‌లో అధికసంఖ్యలో అమెరికన్ ముస్లిం ఓటర్లు ఉన్నారు.

వీరే ఓట్లే మిషిగన్‌లో ట్రంప్‌నకు విజయాన్ని కట్టబెట్టాయి. అరబ్, ఇజ్రాయెల్ పరిణామాలు పెన్సిల్వేనియాలోనూ ప్రభావం చూపాయి. అక్కడ ట్రంప్ వైపే ఓటర్లు మొగ్గుచూపారు.

# నిర్దాక్షిణ్యంగా బలవుతున్న పసితనాలు

అసమాన సమాజంలో అందరి ప్రాణాలకు ఒకే విలువ ఉండదు. కొందరి ప్రాణాలు ఒకరోజు పేపర్‌లో వచ్చే సింగిల్ కాలమ్ వార్త. ఇవాల్టి పేపర్.. రేపటికి చెల్లని కాగితం అయినప్పుడు ఆ ప్రాణాల విలువ ఎంత? అయితే, మారి సెల్వరాజ్ ఆ పేపర్ ముక్కకు విలువ ఇచ్చాడు. ఎవరికీ పట్టని ఆ ప్రాణాల గురించి చర్చించాడు. నిర్దాక్షిణ్య సమాజంలో బలవుతున్న పసి తనాలను కళ్లకు కట్టినట్టు చూపించాడు. స్కూల్‌కు వెళ్లే పిల్లలు ప్రతి రోజు ఇంటి బెల్ కోసం ఎంతగా ఎదురుచూస్తారో.. సెలవు వచ్చిందంటే అంతకంటే ఎక్కువ సంతోషపడతారు. కానీ, 12ఏళ్ల శివనందన్, శేఖర్‌లు సెలవులు వస్తే అరటి తోటల్లో గెలలు మోసే పని చేయాలి. ఇష్టం లేకున్నా..తీసుకున్న అప్పు కోసం.. తల్లికి ఇచ్చిన మాట కోసం చెరువులో ఈత కొట్టడం, చేను, చెలకల్లో తిరగడం, ఆడుకోవడాన్ని ఫణంగా పెట్టాలి. చివరికి అప్పిచ్చిన వ్యాపారి దురాశతో ప్రాణాలూ ఫణంగా పెట్టాలి. పేదరికం దుర్మార్గమైనది. నిష్కర్షగా చావును స్లో మోషన్‌లో చూపిస్తుంది. నిస్సహాయత నిండిన మాన సిక చిత్రవధను మెల్లిగా దేహమంతా ఎక్కిస్తుంది. అమాయకపు పసితనాన్ని, స్వచ్ఛమైన బాల్యాన్ని క్రూరంగా ముక్కలు చేస్తుంది. ఏం సినిమా ఇది!? 'వాళై' చూస్తే ఎవరో బంధించినట్టు మనసు గింజుకుంటుంది. లేదూ? మారి సెల్వరాజ్.. ఈ చేదు ప్రాపంచిక వాస్తవాన్ని కళ్ల ముందు పరిచాడు. అందుకే, కొట్టిపారేయలేని నిజాలను కాదనలేక సినిమా చూస్తూ చలించిపోతాం. 1990ల్లో జరిగిన ఓ యదార్థ ఘటన ఆధారంగా ఈ సినిమా తీశారు. దక్షిణ తమిళనాడులోని ఓ మారు మూల ప్రాంతంలో కథ నడుస్తుంది. పాత్రలతో పాటు అరటితోటలు కూడా సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. పచ్చిక బయళ్లు, నీటి కాలువలు, బురద, పచ్చని తోటలు, కోళ్లు, మేకలు, ఆవులు, పెంకుటి ళ్లు.. పల్లె సహజ సోయగం సినిమాలో క్యాప్చర్ చేశారు. అంతే సహజమైన పల్లె మనసులు, పిల్లల పసితనం ఈ సినిమాలో కనిపిస్తాయి. పల్లెల్లోని బలీయమైన జీవితాలూ దర్శనమిస్తాయి. ఈ సినిమాలో కొన్ని సీన్ల గురించి కచ్చితంగా చెప్పుకోవాలి. సినిమా మొదలైన కొన్ని నిమిషాలకే ఊరిలో ఓ ముసలాయన మరణిస్తాడు. అప్పుడు శివనందన్, శేఖర్‌ల పొట్టి సంభాషణ.. సినిమా మొత్తం ఎలా సాగనుందో స్పష్టం చేస్తుంది. ముసలోడి చావుతో ఈ రోజు గెలలు కోయాల్సిన పని లేదని అంటాడు శివనందన్. కానీ, రేపు వెళ్లాల్సిందేనని గుర్తు చేస్తాడు శేఖర్. రేపు కూడా ఎవరో ఒకరు చస్తే బాగుండేది. నీకోసం రోజూ ఒకరు చస్తారు మరి! సెలవు వచ్చి ఏం లాభం, గెలలు కోయడానికి వెళ్లాలి.. స్కూల్ ఉన్నది కాబట్టే సెలవుల్లో ఇలా వెళ్తున్నాం. సెలవులు లేకుంటే స్కూల్‌కు పంపియ్యకుండా గెలల పనిలోనే ఉండాల్సి వచ్చేది!! అంటూ చెబుతాడు శేఖర్..గెలలు కోయడానికి వెళ్తూ.. క్లాసులోనూ వాటిని మోస్తున్న ఫీలింగ్‌తో ఉండే శివనందన్ టాపర్. పూంగొడి మేడంను ఆరాధిస్తాడు. ఆరాధన సినిమా లో చిరంజీవి టైపు ఇష్టపడుతున్నట్లు ముద్దుగా చెబుతాడు. కొన్ని రోజులు పూంగొడి మేడం కర్చీఫ్ ను వెంటపెట్టుకుని తిరుగుతాడు. శివనందన్ బా ల్యంలో కొంత ఊరట పూంగొడి మేడం ఎపిసోడే.

శివనందన్ నిర్లక్ష్యంతో ఆవు పొలంలో పడిందని బ్రోకర్ ఇంటిమీదికి వచ్చి రభస చేయడంతో తల్లి చెవి పోగులు తీసి అతడి చేతిలో పెడుతుంది. బిడ్డ వేంబును కూడదీసుకుని ఏడుస్తుంటే.. తానెప్పుడూ అలా చేయనని, పరీక్షల తర్వాత సెలవుల్లో రోజూ పనికి వెళ్లుతానని, తల్లి మాట కాదనని శివనందన్ వేడుకుంటాడు. శివ నందన్ తన బాల్యాన్ని, అమాయకత్వాన్ని మెల్లిగా కోల్పోతున్న స్థితి. పూంగొడి టీచర్‌ను అక్కలా.. లేదా తల్లిలా గౌరవిస్తానని ఆ తర్వాత శివనందన్ చెబుతాడు. పసితనపు అమాయకత్వాన్ని కోల్పోవడం ఎంతటి విషాదమో.. మనకు ఎదురైన కఠిన పరిస్థితులు ఆ ఇన్నోసెన్స్‌ను మెల్లగా కిల్ చేస్తాయి. శివనందన్‌పై కౌమారదశలోనే పెద్ద బాధ్యతలు పడతాయి. తన పసితనం గాయపడుతుంటే మనం బాధపడతాం. అట్టడుగు వర్గాలకు చేరువైన ఎర్రజెండా పార్టీ గురించీ సినిమాలో చర్చ ఉంటుంది. శివనందన్ తండ్రి పోరాటాలు అని చెప్పి తిరిగి అర్థంతరంగా తనువు చాలిస్తే కుటుంబ బాధ్యత తల్లి మీద పడుతుంది. తాను కూడా పోతే ఎలా అనే ఆందోళన నుంచే కొడుకును చిన్నప్పటి నుంచే 'ప్రయోజకుడి'ని చేయాలని ఆరాటంతో పనికి పంపిస్తూ ఉంటుంది. పేదరికంపై పేదలే పోరాడటం, వాటి విపరిణామాలు చవిచూడాల్సి రావడం మరో విషాదం. తండ్రి పోరాట స్ఫూర్తిని సుత్తె కొడవలి బొమ్మ రూపంలో కనికి అందిస్తాడు శివనందన్. కూలి పెంచడానికి కూలీలను వేరే వెహికల్‌లో కాకుండా గెలలతో నింపిన లారీ లోడ్ పైనే పంపించాలని వ్యాపారి నిర్ణయిస్తాడు. ఓ రోజు ఓవర్‌లో డ్‌తో వెళ్లుతున్న లారీ బురదలో బోల్తా పడగా.. కార్మికులూ లారీ కింద నలిగిపోతారు. లారీ కింద చిక్కుకున్న వేంబు తన చేతిని బయటికి చాచి సహా యం అర్థిస్తున్నప్పుడు కని తాను ఇష్టపడ్డ వేంబు చేతిని పట్టుకుని పిచ్చోడిలా బయటకు లాగుతున్న దృశ్యాలు.. సీన్ మారినంత సింపుల్‌గా మన కళ్ల నుంచి చెదిరిపోవు. హృదయాన్ని బలంగా తాకే ఇలాంటి సీన్లు 'వాళై' సినిమాలో చాలా ఉన్నాయి.

# మెగా సంస్థను బ్లాక్ లిస్ట్ లో పెట్టాలి

## కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు రద్దు చేయాలి కేటీఆర్



హైదరాబాద్ కేసీఆర్ ప్రపంచంలోనే అతి పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం కట్టారు. పాలమూరు,రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులు కేసీఆర్ హయాంలోనే ప్రారంభం అయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం నాడు అయన తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు.

మెగా ఇంజనీరింగ్ కంపెనీని రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఈస్ట్ ఇండియా కంపెనీ అన్నారు. మెగా కంపెనీ మాఫియా లాగా తయారు అయిందని రేవంత్ రెడ్డి అన్నారు. మెగా మాఫియా అని జగ్గారెడ్డి అన్నారు. మేము ఎన్నడూ ఆ కంపెనీని వ్యక్తిగతంగా దూషించలేదు. సుంకిశాల నుండి హైదరాబాద్ నగరానికి నీళ్లు తీసుకురావడానికి కట్టిన ప్రాజెక్టు ఇన్ టెక్ వెల్ కుంగుబాటుకు గురి అయితే మేము మాట్లాడాం. కాళేశ్వరం పిల్లర్లు కుంగితే మీరు కమిషన్ వేశారు కదా. సుంకిశాల కాంట్రాక్టు సంస్థను బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని విచారణ కమిటీ చెప్పినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని అన్నారు.

ఈస్ట్ ఇండియా కంపెనీ అని రేవంత్ రెడ్డి పిలిచిన కంపెనీని బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని మేము డిమాండ్ చేస్తున్నాం. రేవంత్ రెడ్డి ఈస్ట్ ఇండియా కంపెనీ,రాష్ట్ర మంత్రి పొంగులేటి రాఘవ కంపెనీ కలిసి 4,350 కోట్ల టెండర్లను దక్కించుకున్నాయి. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను రద్దు చేయాలి. అంతర్జాతీయ స్థాయిలో పని చేసిన కంపెనీలను తిరస్కరించి మెగా,రాఘవ కంపెనీలకు పనులు ఇచ్చారు. 4,350 కోట్లలో రేవంత్ రెడ్డికి ముట్టిన వాటా ఎంత...? రాహుల్ గాంధీకి ముట్టిన వాటా ఎంత...? కాళేశ్వరం నీళ్లను 5,560 కోట్లతో మూసీకి తీసుకువస్తామని ప్రభుత్వం అంటోంది. మేము అధికారంలో వున్నప్పుడు కొండ పోచమ్మ సాగర్ నుండి గోదావరి నీళ్లను 1100 కోట్లతో గండిపేటకు తేవాలని క్యాబినెట్ నిర్ణయం జరిగిందని అన్నారు.

కాళేశ్వరం నుండి గోదావరి నీళ్లను మూసీకి తీసుకువచ్చే ప్రాజెక్టును మెగా కంపెనీకి ఇవ్వడానికి రేవంత్ రెడ్డి సిద్దం అయ్యారు. మేము అధికారంలోకి వచ్చాక అన్నింటిపై విచారణ చేస్తాము. ఇంజనీర్లు,అధికారులు జాగ్రత్తగా ఉండండి. ఈస్ట్ ఇండియా కంపెనీ ద్వారా రేవంత్ రెడ్డి మహారాష్ట్ర,ఢిల్లీకి మూటలు పంపారు. అధికారులు చేయకూడని సంతకాలు చేస్తే ఉద్యోగాలు పోతాయి. క్యాబినెట్ లో మంత్రిగా ఉన్న వ్యక్తి కుటుంబానికి వర్క్ వస్తుంది. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ అనే దానిపై బీజేపీకి సోయి ఉందా . రేవంత్ రెడ్డి సహాయ మంత్రి బండి సంజయ్ ఎక్కడ వున్నారు. రేవంత్ రెడ్డి బామ్మర్ధికి అమృత్ టెండర్లు కట్టబెట్టారు. బిఆర్ఎస్ వాళ్ళపైనే ఈడీ,ఐటీ రైడ్స్ అవుతాయా...? పొంగులేటి ఇంటిపై ఈడీ రైడ్స్ అయితే ఇప్పటి వరకు ఎలాంటి నోట్ ఇవ్వలేదు. సుంకిశాల విషయంలో మెగా కంపెనీని బ్లాక్ లిస్ట్ లో పెట్టె వరకు మేము ఫైట్ చేస్తామమని అన్నారు.

మెగా క్ర

29?ష్ణ రెడ్డి,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,రేవంత్ రెడ్డి ముగ్గురు కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు. వాళ్ళు,వీళ్ళు జైలుకు పోతారని పొంగులేటి ఎట్లా చెప్తారు. పొంగులేటి నువ్వు జైలుకు ఎప్పుడు వెళ్తావో తెలుసుకో. ఆర్.ఆర్.ట్యాక్స్ అన్న మోడీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఈడీ రైడ్స్ పై పొంగులేటి ఇప్పటి వరకు నోరు విప్పరు. అదానీతో రేవంత్ రెడ్డి అక్రమ సంబందాలు తెలుసు. రిపోర్టులను తారుమారు చేసే అవకాశం ఉంది. కాలేశ్వరం రిపేర్లు ఇప్పటికీ చేయడం లేదు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అదానీతో ఒప్పందం చేసుకుని ఈడీ రైడ్స్ పై ఎలాంటి చర్యలు లేకుండా చేసుకున్నారని ఆరోపించారు.

# ఇంటింటి సర్వేకు సర్వం సిద్ధం

## - 56 అంశాలు..75 ప్రశ్నలు ,- సర్వేలో ఎన్నో వివరాలు..

పెద్దపల్లి సమగ్ర కుటుంబ సర్వేకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం ప్రారంభమయిన సర్వేలో ప్రతి కుటుంబం వివరాలను సేకరించనున్నారు. సర్వే కోసం 1,979 మంది ఎన్యుమరేటర్లు, 180 మంది సూపర్‌వైజర్లను నియమించారు. ఒక్కో ఎన్యుమరేటర్ 150 నుంచి 175 ఇళ్లను సర్వే చేయాల్సి ఉంటుంది. సూపర్‌వైజర్లు సైతం దాదాపు 10 శాతం కుటుంబాలను ర్యాండమ్‌గా తనఖీ చేసి.. సర్వే సవ్యంగా జరిగిందీ లేనిదీ పరిశీలిస్తారు. తమ పరిధిలోని ఎన్యుమరేట ర్లకు అవసరమైన సూచనలి వ్వడంతో పాటు ఎక్కడైనా ఏమైనా ఇబ్బందులు ఎదురైతే పరిష్కరిస్తారు.

56 అంశాలు..75 ప్రశ్నలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో 56 అంశాలతో పాటు 19 అనుబంధ ప్రశ్నలతో కలిపి మొత్తం 75 ప్రశ్నలతో సమాచారం సేకరించనున్నారు. సర్వే నిమిత్తం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను ఎన్యుమరేటర్లుగా నియమించడంతో విద్యార్థులకు ఉదయం పూట మాత్రమే తరగతులు కొనసాగనున్నాయి. మధ్యాహ్నభోజనం అనంతరం టీచర్లు సర్వేలో పాల్గొంటారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు యథావిధిగా నడుస్తాయి. జిల్లాలో 580 ప్రాథమిక పాఠశాలలు ఉండగా.. 1,117 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులతో పాటు, హెచ్ఎంలు, సీఆర్పీలు, సమగ్రశిక్ష సిబ్బంది, ఇతర ఉద్యోగులు 355 మంది పనిచేస్తున్నారు. వీరిని గణకులుగా నియమించి సర్వేలో పాల్గొనాలని డీఈఓ పేర్కొన్నారు.

గతంలో మాదిరిగా..

సర్వేలో భాగంగా జిల్లావ్యాప్తం గా దాదాపు 10 లక్షల మందికి పైగా ప్రజల వివరాలను సేకరించనున్నారు. 2014లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో 2,20,673 నివాసాలు, 9,21,623 జనాభా ఉన్నట్లు లెక్క తేలింది. ప్రస్తుతం దాదాపు 2.5 లక్షల నివాసాలకు చేరి ఉంటాయని అంచనా. అందుకు అనుగుణంగా ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేశారు. అవసరం మేరకు అదనపు ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల సేవలను వినియోగించుకుంటారు.

రంగంలోకి 1,979 మంది ఎన్యుమరేటర్లు

సర్వేలో ఎన్నో వివరాలు..

సర్వేలో భాగంగా కుటుంబ యజమానితో పటు సభ్యులందరి వివరాలు.. యజమానితో వారికున్న సంబంధం.. సభ్యులందరి విద్యార్హతలు, ఉద్యోగం లేదా ఉపాధి వివరాలు, మాతృభాష, ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఏమైనా సంక్షేమ ఫలాల పొందారా.. అద్దె ఇల్లా..సొంతిల్లా.. ఉంటున్న ఇంటికి ఉచిత విద్యుత్ సదుపాయం పొందుతున్నారా? వంటి వివరాలు సైతం సేకరించనున్నారు. ఇక స్థిరాస్థిలో భాగంగా భూములు, ఇల్లు వంటి వివరాలతో పాటు చరాస్థి వివరాల్లో భాగంగా ద్విచక్ర వాహనాలతో పాటు కంప్యూటర్లు వాడుతుంటే ఆ వివరాలను సైతం సేకరిస్తారు.

# ఆరోగ్యకర శిశువులే రేపటి పౌరులు

అప్పుడే జన్మించిన సుందర, చిరుదరహాస నవజాత శిశువు సంరక్షణ మనందరి అతి పెద్ద బాధ్యత. పుట్టిన బిడ్డ సురక్షితంగా, ఆరోగ్యంగా ఎదగడానికి తల్లితండ్రులు, కుటుంబ సభ్యులు, పౌర సమాజం, ప్రభుత్వాల సమిష్టి బాధ్యత అని నమ్ముకొంటేనే రేపటి ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుంది. శిశు ఆరోగ్య ప్రాధాన్యాన్ని గుర్తించిన అమెరికా, యూరోప్ దేశాలు 1990ల్లో ప్రారంభించిన "శిశు సంరక్షణ దినం లేదా ఇన్ఫాంట్ ప్రొటెక్షన్ డే"ను ప్రతి ఏట 07 నవంబర్‌న ప్రపంచవ్యాప్తంగా పాటించుట ఆనవాయితీగా మారింది. అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లో నేటికీ నవజాత శిశు మరణాల రేటు అధికంగా నమోదు కావడం కలవరపరుస్తున్నది. నవజాత శిశువు శరీరం సున్నితంగా ఉంటుందని గమనించి ఆరోగ్యకర వాతావరణంలో పెంచడానికి ప్రతి ఒక్కరు ప్రాధాన్యం ఇవ్వాలి. శిశువులో రోగనిరోధకశక్తి పెంచడం, సరైన సమయాల్లో టీకాలు ఇప్పించడం, పోషకాహారాన్ని అందించడం, ఇంటి పరిసరాల్లో పారిశుద్ధ్యం పాటించడం, తరుచుగా పిల్లల వైద్యుల సలహాలను తీసుకోవడం, పిల్లల పెంపకం పట్ల తగు అవగాహన కల్పించడం లాంటి లక్ష్యాలతో శిశు సంరక్షణ దినం పాటించడం జరుగుతోంది. ఈ ఏడాది శిశు సంరక్షణ దినం-2024 థీమ్‌గా "మన భవిష్యత్తును రక్షించుకుందాం (ప్రొటెక్టింగ్ అవర్ ఫ్యూచర్)" అనే అంశాన్ని తీసుకున్నారు. శిశు సంరక్షణ దినం వేదికగా పిల్లల భద్రత, క్రమ పద్దతిలో పెంపకం, నవజాత శిశు హక్కులను కాపాడడం, అన్ని రకాలైన టీకాలను సరైన సమయాల్లో అందించడం, సమాజ బాధ్యతగా గుర్తించడం, తల్లితండ్రులకు సరైన అవగాహన కల్పించడం లాంటివి తప్పనిసరిగా అమలు చేయాలి. తల్లితండ్రులు ఆదర్శ జీవన విధానాలను పాటించడం, పిల్లల నిద్రను నియంత్రించడం, సమయానుకూలంగా పాలు పట్టించడం, చిన్నారుల భౌతిక క్రియలకు లేదా ఆటలకు ఆస్కారం ఇవ్వడం, పోషకాహారం అందించడం, వైద్యుల సలహాలను క్రమం తప్పకుండా తీసుకొని పాటించడం లాంటి టిప్స్ పాటిస్తే నేటి శిశువులు రేపటి ఆరోగ్యకర తరంగా మారతారని నమ్మాలి. తల్లి గర్భంలోంచి పేగుబంధాన్ని తెంచుకొని జన్మించిన చిన్నారి అనారోగ్యంతో బాధ పడితే ఏ తల్లితండ్రులు భరించలేరు. ప్రపంచవ్యాప్తంగా ఏటా 50 లక్షల మంది చిన్నారులు మరణిస్తున్నారు. వీరిలో 95 శాతం వరకు అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే నమోదు అవుతున్నాయి. భారత్ లాంటి దేశాల్లో నవజాత శిశువులు ప్రతి ఏటా 2.5 కోట్లు జన్మిస్తుండగా, అందులో 10 లక్షల వరకు మరణించడం కడు విచారకరం. మన దేశంలో నేటికీ అధిక మొత్తంలో శిశు జననాలు ఇంట్లో లేదా సరైన వసతులు లేని ఆసుపత్రుల్లోనే పురుడు పోసుకుంటున్నారు. శిక్షణ పొందిన వైద్య సిబ్బంది లేదా మంత్రసానుల కొరతతో ప్రసవ సమయాల్లోనే మరణించడం గమనిస్తున్నాం. అత్యాధునిక వైద్య ఆరోగ్య పరిజ్ఞానం ఉన్న నేటి డిజిటల్ యుగంలో శిశు మరణాలు ప్రభుత్వాలకే కాకుండా మానవాళికి కూడా సిగ్గు చేటు. నివారించదగిన శిశు మరణాలకు అవగాహన అనే ఔషధంతో పెంచడం తల్లితండ్రుల ప్రధాన కర్తవ్యం. భారత్‌లో శిశు మరణాల రేటు(ప్రతి వెయ్యికి 30 మంది)ను 30 లోపుకు తగ్గించడానికి ప్రభుత్వాలు ప్రణాళికలు అమలు పరుస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం, కుటుంబ ఆరోగ్యం, సంక్షేమ శాఖ, యూనిసెఫ్‌లతో కలిసి "నేషనల్ నియోనాటాలజీ ఫోరమ్" ప్రతి ఏట నవంబర్ 15-21 వరకు వారోత్సవాలను కూడా నిర్వహిస్తున్నారు. తల్లి ఆరోగ్య ప్రభావం పిల్లలపై ప్రత్యక్షంగా పడుతుంది. తల్లులు సరైన పోషకాహారం తీసుకోవడం, రక్తహీనత లేకుండా జాగ్రత్త పడడం, పిల్లల్లో టీకాలతో రోగనిరోధకశక్తిని పెంచడం, శిక్షణ పొందిన మంత్రసానులతో ప్రసవం చేయించడం, నవజాత శిశువును వెచ్చని ప్రదేశంలో ఉంచడం, శిశువు వ్యాధి లక్షణాలను గమనిస్తూ వైద్యం చేయించడం, ముర్రుపాలను తప్పనిసరిగా పట్టించడం, కనీసం తొలి ఏడాది వరకు తల్లిపాలతోనే శిశువును పెంచడం, తల్లిబిడ్డలకు ఇన్‌ఫెక్షన్ కలుగకుండా చూడడం, తల్లితండ్రులకు పిల్లల పెంపకం పట్ల సంపూర్ణ అవగాహన కలిపించడం లాంటి టిప్స్ పాటించే విధంగా "శిశు సంరక్షణ దినం" వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలి. శిశు సంరక్షణ దినం వేదికగా పిల్లల పెంపకం పట్ల అత్యంత జాగ్రత్తలు తీసుకుంటూ రేపటి ప్రపంచ ప్రగతికి పునాదులు ఇవ్వగల సామర్థ్యాలు కలిగిన పౌర సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరం భాగస్వాములమవుదాం, మన చిన్నారుల ఉజ్వల భవితకు అవసర పోషణనిద్దాం.

# శాస్త్ర పరిశోధనలో సి.వి.రామన్ ఘనత

విజ్ఞాన ఆవిష్కరణల్లో భారతీయులకు నోబెల్ రావడం గగన సదృశం. సర్ సివి రామన్ ఆ ఘనత సాధించారు. అంతేకాదు, విజ్ఞాన శాస్త్రంలో ఆఘనత సాధించిన ఏకైక ఆసియా వాసిగానూ ఖ్యాతి గడించారు. సైన్సులో ఎవరూ చేయలేని సాహసాలను అత్యంత సునాయాసంగా చేసి చూపించి, విశ్వ వినువీధిలో భారత కీర్తి పతాకాన్ని రెపరెప లాడించిన మహా జ్ఞాని చంద్రశేఖర్ వెంకటరామన్ (సి వి రామన్). వైజ్ఞానిక రంగంలో ప్రపంచ దేశాలను తలదన్నేలా భారత్‌ను శక్తివంతంగా చూపి, అబ్బుర పరిచే ప్రయోగాలకు నిలువెత్తు వేదికలా నిలిచారు సర్ సివి రామన్. వైజ్ఞానిక రంగంలో తొలి నోబెల్ అందుకున్న విజ్ఞాన ఖని. ఒక్క మాటలో చెప్పాలంటే వైజ్ఞానిక శాస్త్రానికే వైద్యుడిలా మారిన మహోన్నతుడు. ఆధునిక భారత విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనా ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప జేసిన వ్యక్తిల్లో సర్ సీవి రామన్ మొదటివారు. సీవీ రామన్ నవంబర్ 7, 1888 తమిళనాడులోని తిరుచురాపల్లిలో జన్మించారు. తండ్రి చంద్రశేఖర్ అయ్యర్, తల్లి పార్వతి అమ్మాళ్. తండ్రి విశాఖపట్నంలోని ఏవీఎన్ కళాశాలలో లెక్చరర్ గా పని చేయడం వల్ల రామన్ బాల్యం, విద్యాభ్యాసం అక్కడే జరిగింది. అనంతరం మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో చేరి 19 ఏళ్లకు ఫిజిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. ఆ తర్వాత తల్లిదండ్రుల కోరిక మేరకు ఐసిఎస్ పాస్కై కలకత్తా ప్రభుత్వ ఆర్థికశాఖలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్‌గా చేరారు. ఆ సమయం లోనే పరిశోధనలపై ఆసక్తి పెంచుకున్నారు. పరిశోధనల కోసం భారతీయులు విదేశాలకు వెళ్లడమేమిటి?. విదేశీయులే.. పరిశోధనల కోసం ఇక్కడకు రావాలని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి రామన్. రామన్ ముందు వరకూ సైన్స్‌లో నోబెల్ బహుమతులు పాశ్చాత్యులకే దక్కేవి. కానీ, రామన్ అచ్చమైన భారతీయునిగా ఈ గడ్డపైనే చదువుకొని, తలమానికమైన పరిశోధన జరిపి సైన్సులో దేశ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారు. 'నా మతం సైన్సు.. దానినే జీవితాంతం ఆరాధిస్తా..' అని చెప్పి తుదిశ్వాస వరకూ శాస్త్రాన్వేషణ లోనే గడిపిన దార్శనికుడు. "విజ్ఞాన శాస్త్ర సారాంశం, ప్రయోగ శాలల పరికరాలతో వికసించదు. నిరంతర పరిశోధన, స్వంతంత్రంగా ఆలోచించే ప్రవృత్తి ఇవే విజ్ఞాన శాస్త్ర సాగరాన్ని మథించి వేస్తాయి" అంటూ ఆయన చేసిన ప్రసంగం నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. ఉదయాకాశంలోని వెలుగుల్లో చెట్లు ఎంత అందంగా కనబడతాయో మీరు ఎప్పుడైనా గమనించారా? నాకు వీటిని చూస్తూ ఉంటే స్పటిక నిర్మాణం గురించిన ఆలోచనలు వస్తుంటాయి. అందుకే "విజ్ఞానం అత్యుత్తమైన సృజనాత్మక కళారూపం అని రామన్ ఎప్పుడూ చెబుతుండే వారు.

మెర్క్యూరీ ల్యాంప్ నుండి ఏకవర్ణ కాంతి తరంగాలను ఒక పారదర్శక యానకం గుండా ప్రసరింపజేస్తే, యానక ధర్మాలపై ఆధారపడి ఆ కాంతిలో కొంత భాగం వివర్తనం చెంది, తక్కువ తరంగ ధైర్ఘ్యం గల కాంతిగా బహిర్గత మౌతుంది. సముద్ర జలంపై ఇదే ప్రక్రియతో నీలి రంగు కాంతి బహిర్గతమవుతుంది. దీనినే 'రామన్ ఫలితం' (రామన్ ఎఫెక్ట్) అంటారు. రామన్ జీవితంలో మరో మైలురాయి రామన్ ఎఫెక్ట్ సిద్ధాంతం. వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని, దాని వల్లనే అది తన గమనాన్ని మార్చుకుంటుందని తన సిద్ధాంతాల ద్వారా రుజువు చేశారు రామన్. అప్పటికున్న అరకొర సదుపాయాలతోనే మన దేశ విజ్ఞాన కిరణాలను నలుదిశలా ప్రసరింప జేశారు. సూర్యుని నుంచి వెలువడే తెలుపు వర్ణపు కాంతి వాయువులోని అణువులపై పడి, వాటి ప్రయాణ దిశను మార్చు కుంటాయని తన పరిశోధనల ద్వారా తెలుసుకున్న సి.వి. రామన్ ఓ సిద్ధాంతాన్ని సూత్రీకరించాడు. వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని 1928 సంవత్సరం, ఫిబ్రవరి 28న రామన్ మొట్ట మొదటిసారి ప్రకటించారు.పారదర్శకంగా ఉన్న ఘన లేదా ద్రవ లేదా వాయు మాధ్యమం గుండా కాంతిని ప్రసరింప చేసినప్పుడు అది తన స్వభావాన్ని మార్చు కుంటుంది. ఈ విషయాన్ని 1928 మార్చి 16 న బెంగుళూరులో జరిగిన శాస్త్రజ్ఞుల సదస్సులో చూపించాడు. అతను అనుకున్నట్లే 1928 ఫిబ్రవరి 28 న "రామన్ ఎఫెక్టు" ఆవిష్కరించడం జరిగింది. ఈ పరిశోధనను అభినందిస్తూ బ్రిటీష్ ప్రభుత్వం 1929 లో "నైట్ హుడ్" బిరుదుతో సత్కరించింది. ఈ రామన్ ఎఫెక్టు అసామాన్య మైనదని, అందులో 200 రూపాయలు కూడా ధర చేయని పరికరాలతో ఆ విషయ నిరూపణ జరగడం అద్భుతమైనదని ప్రపంచ శాస్త్రజ్ఞులంతా రామన్ ను అభినందించారు.

అఖండ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందిన రామన్ కు ఎన్నో గౌరవ డాక్టరేట్లు లభించాయి. 1924 లో ఇంగ్లండ్ "రాయల్ సొసైటీ" సభ్యుడయ్యాడు. 1928 లో రామన్ కు "సర్" బిరుదు దక్కింది. 1947 లో ప్రతిష్ఠాత్మకమైన "ఫ్రాంక్లిన్ మెడల్" లభించింది. తన అనన్య సామాన్య పరిశోధనా సామర్థ్యంతో ఫిజిక్స్ రంగంలో రామన్ ఎఫెక్ట్ కనుగొని చరిత్ర సృష్టించిన ఫిబ్రవరి 28 నే జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపు కొంటున్నాం. 1987 ఫిబ్రవరి నుండి ప్రతీ సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవంగా భారత ప్రభుత్వం అధికారకంగా జరుపుతోంది.రామన్ నూటికి నూరుపాళ్ళూ భారతీయునిగా ఈ గడ్డపైనే చదువుకొని, పరిశోధనలు జరిపి సైన్సులో శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారాయన. 1913 లో సాహిత్యంలో మనదేశం నుండి నోబెల్ బహుమతి పొందిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అనంతరం సైన్సు రంగంలో విజయ ఢంకా మ్రోగించిన అఖండ ప్రజ్ఞాశాలి రామన్ ఒక్కరే కావడం దేశానికి గర్వకారణం. రామన్ పరిశోధనలు సైన్సులో, పారిశ్రామిక రంగంలోనూ క్రొత్తపుంతలు త్రొక్కడానికి దారితీసింది. శాస్త్ర రంగంలో రామన్ స్పెక్ట్రోస్కోపీ ఆవిర్భావానికి "భారతరత్న", 1957 లో "లెనిన్ శాంతి బహుమతి" లభించాయి. కాంతి ప్రసరణపై జరిపిన పరిశోధనలకు "నోబెల్ బహుమతి" లభించింది. స్వాతంత్ర్యం రాగానే రామన్ కు మొట్టమొదటి నేషనల్ ప్రొఫెసర్ గా ప్రభుత్వం నియమించి గౌరవించింది. 1948 లో బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ గా రిటైరయ్యారు. దృష్టి, కాంతి, ధ్వని, వర్ణాలు, ద్రవాల తలతన్యత, ఖనిజాలు, డైమండ్, క్రిస్టల్ తదితర అంశాలపై పరిశోధనలు జరిపిన సి.వి. రామన్ సుమారు 465 పరిశోధన పత్రాలను వెలువరించాడు. వాటిని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగుళూరు వారు సేకరించి భద్రపరిచారు. 1949 లో బెంగుళూరులో రామన్ రీసెర్చి ఇన్స్టిట్యూట్ స్థాపించి, 1970 నవంబరు 27 న ఆయన మరణించే వరకూ, ఆ సంస్థలో పరిశోధనలు జరిపి, మన దేశంలో సైన్సు అభివృద్ధికి మార్గదర్శకు లయ్యారు. 1971 నవంబర్ 21 న సీ.వీ. రామన్ పోస్టేజి స్టాంపును భారత ప్రభుత్వం వెలువరించి ఆ మహా శాస్త్రజ్ఞుడిని గౌరవించింది.

# రాజకీయ అనుభవశాలి రంగా

గోగినేని రంగనాయకులు... ఈ పేరు అంతగా ప్రాచుర్యం లేనిది. ఈ పేరు చెపితే దేశంలో గుర్తు పట్టే వారు దాదాపు ఉండక పోవచ్చు. ఆయన ఒక నిబద్దత కలిగిన పాతతరం రాజకీయ నాయకులు.ఆయనను భారత రైతాంగ ఉద్యమపితగా భావిస్తారు.సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కిన ప్రజాప్రతినిధి. లోక్‌సభలోనూ, ఇటు రాజ్యసభలోనూ 60 ఏళ్ళు రైతుల పక్షాన పోరాడిన నాయకులు. రాజకీయ అవగాహన కలిగిన వారికి ఇప్పుడు ఆయనెవరో స్ఫురణకు వచ్చి ఉంటుంది. రైతాంగ విధానాలకు మద్దతు నిచ్చిన ఆయనే సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న ఆచార్య ఎన్.జి.రంగా. ఆచార్య రంగా (నవంబరు 7, 1900 – జూన్ 9, 1995) భారత స్వాతంత్ర్య సమర యోధులు, పార్లమెంటు సభ్యులు, రైతు నాయకుడు. 1935లో తొలిసారి కేంద్ర శాసనసభకు సభ్యులై అప్పటి నుంచి మరణించే వరకు నిరంతరం పార్లమెంటేరియన్ గానే కొనసాగారు. రంగా, 1900, నవంబరు 7 న గుంటూరు జిల్లా నిడుబ్రోలులో గోగినేని నాగయ్య, అచ్చమాంబ దంపతులకు జన్మించారు. నిడుబ్రోలులో ప్రాథమిక విద్యను ముగించుకొని, గుంటూరు ఆంధ్రా క్రిష్టియన్ కళాశాల నుండి పట్టభద్రు లైనారు. 1924లో భారతీ దేవితో రంగా వివాహం జరిగింది. 1926 లో ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం నుండి ఆర్థ శాస్త్రములో బి.లిట్ పొంది భారత దేశానికి తిరిగి వచ్చిన తర్వాత మద్రాసు లోని పచ్చయప్ప కళాశాలలో ఆర్థిక శాస్త్ర ఆచార్యునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఆయన ప్రధానంగా హేతువాది. 1930లో మహాత్మా గాంధీ పిలుపుకు స్పందించి రంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. 1933లో రైతు కూలీ ఉద్యమానికి నేతృత్వం వహించారు. కిసాన్ కాంగ్రేస్ పార్టీని స్థాపించారు. రైతుకూలీల పరిస్థితిపై గాంధీతో చారిత్రాత్మక చర్చలు జరిపారు. ఈ చర్చలలోని ముఖ్యాంశాలపై "బాపు దీవెనలు" అన్న పేరుతో రంగా ఒక పుస్తకాన్ని వెలువరించారు.ఆంధ్రలో తొలిసారి రాజకీయ పాఠశాలలను ప్రారంభించిన ఖ్యాతి రంగాదే. నిడుబ్రోలులో రామనీడు పేరుతో రాజకీయ పాఠశాలను ఏర్పాటు చేసారు.1933వ సం.లో రంగా స్థాపించిన రాజకీయ విద్యాలయాన్ని మహాత్మాగాంధీ ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రులు నారా చంద్రబాబు నాయుడు , కొణిజేటి రోశయ్య కూడా రంగా శిష్యులే. ఆ పాఠశాల గత మధుర స్మృతులకు సజీవ సాక్ష్యంగా నేటికి నిడుబ్రోలులో కొనసాగుతుంది. తొలి రాజకీయ పాఠశాలలో పుచ్చలపల్లి సుందరయ్యతో సహా కొందరు కమ్యూనిసులూ పాల్గొన్నారు. రంగా ఆంగ్లంలోను, తెలుగులోను మంచి రచయిత. 'హరిజన నాయకుడు' అనే నవల కూడా రాశారు. ఆంధ్ర రాజకీయాలలో గాంధీ అనుచరుడిగా పట్టాభి సీతారామయ్య ఉండగా, రంగా గాంధీకి సన్నిహితుడు కాలేక పోయారు. అయినా పార్టీ సిద్ధాంత పరంగా గాంధేయుని గానే కొనసాగారు. సుభాస్ చంద్రబోస్ అంటే ఇష్టపడేవారు.1937 నుంచి వాహిని అనే పత్రికను నడిపారు.1938 నాటికే ఇందూలాల్ యాగ్నిక్‌తో కలిసి కిసాన్ సభలు నిర్వహించారు. ప్రకాశం పంతులుతో కలిసి ఆంధ్ర రాజకీయాలలో కీలక పాత్ర వహించిన రంగాకు చాలా మంది శిష్యులు ఉండేవారు.గౌతు లచ్చన్న, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, కందుల ఓబుల రెడ్డి, చేగిరెడ్డి బాలిరెడ్డి, ఎన్.వి. నాయుడు, నీరుకొండ రామారావు, బీశెట్టి అప్పారావు, పి.రాజగోపాల నాయుడు ఇత్యాదులు ఎందరో రంగా పిలుపు నందుకొని రాజకీయాలలో ప్రవేశించారు. స్వాతంత్ర్య పోరాటంలో నిర్విరామంగా పాల్గొన్న రంగా అనేక పర్యాయాలు జైలు పాలయ్యారు. జైళ్ళలోకూడా రాజకీయ ఖైదీలకు పాఠశాలలు నిర్వహించారు. ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసం చేశారు.మద్రాసు లోని పచ్చయప్పాస్ కళాశాలలో ఆర్థిక శాస్త్రాచార్యుడిగా చేరి నాలుగేళ్ళ పాటు ఉన్నప్పుడు రంగాకు విద్యార్థిగా అన్నాదొరై తమిళనాడు ముఖ్యమంత్రి) ఉండేవారు. రంగా, అంతర్జాతీయ వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్య వ్యవస్థాపకులలో ఒకరు. 1946లో కోపెన్ హేగన్‌లో జరిగిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజెషన్ సదస్సులో, 1948లో శాన్ ఫ్రాన్సిస్కోలో జరిగిన అంతర్జాతీయ శ్రామిక సంస్థ సదస్సులోనూ, 1952లో ఒట్టావాలో జరిగిన అంతర్జాతీయ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సులోను, 1954లో న్యూయార్కులో జరిగిన ఇంటర్నెషనల్ పెజెంట్ యూనియన్, 1955లో టోక్యోలో జరిగిన ఆసియన్ కాంగ్రెస్ ఫర్ వరల్డ్ గవర్నమెంటు లోను భారత దేశం తరఫున ప్రతినిధిగా పాల్గొన్నారు. స్వాతంత్ర్యానంతరం తొలి ఎన్నికలు వచ్చేనాటికి ముఠా తగాదాల కారణంగా రంగా కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి కృషీకార్ లోక్ పార్టీ స్థాపించారు. ఆ ఎన్నికలలో చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాల్లో మాత్రమే కృషీకార్ లోక్ పార్టీ అభ్యర్థులు గెలిచారు. తరువాత సహకార రంగ వ్యవసాయానికి బద్ధ వ్యతిరేకి అయిన రాజాజీతో కలిసి స్వతంత్ర పార్టీని స్థాపించారు. రంగా స్వతంత్ర పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులై ఒక దశాబ్దం పాటు నిర్వహించారు. 1962 సార్వత్రిక ఎన్నికలలో పార్టీ 25 స్థానాలలో గెలిచి బలమైన ప్రతి పక్షముగా రూపుదిద్దు కొన్నది. 1972లో రంగా తిరిగి కాంగ్రెస్ (ఐ)లో చేరి, ఇందిరా గాంధీ కి సన్నిహితులై చివరి వరకూ కాంగ్రెస్ లోనే కొనసాగారు. నెహ్రూ నాయకత్వాన్ని, ఆయన ప్రతిపాదించిన సహకార వ్యవసాయాన్ని కాదని దేశ వ్యాప్తంగా స్వతంత్ర పార్టీ ఏర్పడగా, దానికి తొలి అధ్యక్షులుగా ఆచార్య రంగా ఉన్నారు. రాజగోపాలా చారి, మినూ మసానీ, పీలూ మోడీ, రత్నస్వామి, బెజవాడ రామచంద్రా రెడ్డి మొదలైనవారు ఎందరో రంగాతో చేతులు కలిపారు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఏర్పడిన పార్టీలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి కూడా తొలిదశలో ఉన్నారు. క్రమేణా స్వతంత్ర పార్టీకి రంగా దూరం అవుతూ వచ్చారు. జాతీయ నాయకులలో అంబేద్కర్‌తో రంగా సన్నిహితంగా ఉండేవారు. రాజ్యాంగ సభకు అంబేద్కర్ పేరును ప్రతిపాదించడంలో ఆయన కీలకపాత్ర వహించారు. ఆంధ్రలో సంస్కరణ వివాహాలను రంగా ప్రోత్సహించారు. 1952 నుండి 62 వరకు తెనాలి, 62 నుండి 67 వరకు చిత్తూరు, 67 నుండి 70 వరకు శ్రీకాకుళం, 80 నుండి 84, 84 నుండి 89 వరకు, 89 నుండి 91వరకు మూడుసార్లు వరుసగా గుంటూరు లోకసభ నియోజకవర్గ స్థానాలకు ప్రాతినిథ్యం వహించారు. 1946లో కోపెన్ హేగన్‌లో జరిగిన వ్యవసాయ సమాఖ్యలో పాల్గొన్నారు. 1952లో కామన్వెల్త్ పార్లమెంటరీ సమావేశంలో పాల్గొని అటావా నగరంలో ప్రసంగించారు. 1954లో న్యూయార్క్‌లో జరిగిన అంతర్జాతీయ రైతు సమాఖ్యలో ప్రధానోపన్యాసం చేశారు. 1955లో టోక్యోలో జరిగిన 'ఏషియన్ కాంగ్రెస్ ఫర్ వరల్డ్ గవర్నమెంట్' సభలో సుదీర్ఘోపన్యాసం చేశారు.

## బిల్లు కడితేనే మృతదేహం ఇస్తాం
## మెడికవర్ ఆసుపత్రి నిర్వాకం

హైదరాబాద్ హైటెక్ సిటీ మెడికవర్ హాస్పిటల్ లో దారుణం బయటపడింది. అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చిన జూనియర్ డాక్టర్ నాగప్రియ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుటుంబీకులు ఇప్పటి వరకు మూడులక్షలకు పైగా డబ్బు కట్టారు. మిగతా నాలుగు లక్షలు కడితేనే డెడ్ బాడీ ఇస్తానని ఆస్పత్రి వర్గాలు డిమాండ్ చేసినట్లు బాధిత కుటుంబీకులు ఆరోపించారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ చెప్పినా వినడంలేదు. మంగళవారం అర్ధరాత్రి మరో మూడు లక్షలు కట్టాలని లేదంటే వైద్యం ఆపేస్తామంటూ కుటుంబీకులకు ఫోన్ కాల్ వచ్చింది. ఉదయాన్నే లక్ష కట్టిన తరువాత పేషంట్ మృతి చెందింది. మిగతా డబ్బు అంటూ ఆసుపత్రి యాజమాన్యం బేరం పెట్టింది. వైద్యం ఆపేయడం వల్లే నాగప్రియ చనిపోయిందని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మెడికవర్ ఆస్పత్రి వద్ద టెన్షన్ నెలకొంది

## పాదగయా క్షేత్రంలో మహిళా ఆగోరీ

పిఠాపురం పాదగయా క్షేత్రానికి నాగ సాధు మహిళ అఘోరీ వచ్చింది. మొన్నటిదాకా తెలంగాణలో రెండు రోజుల క్రితం ఉత్తరాంధ్రలో పర్యటించిన నాగ సాధు అఘోరి అకస్మాత్తుగా పిఠాపురంలో ప్రత్యక్షమైంది. అన్నవరం శ్రీసత్యనారాయణ స్వామి దర్శనం అనంతరం పిఠాపురం పాదగయ పుణ్యక్షేత్రానికి చేరుకుంది. పిఠాపురం పాదగయా క్షేత్రంలో ఉమా రాజరాజేశ్వరి కుక్కుటేశ్వర స్వామి వారిని, అష్టాదశ శక్తి పీఠాల్లో పదోవ శక్తిపీఠమైన పురుహూతిక అమ్మవారిని, స్వయంభూవుడైన దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకుంది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన నాగసాధు అఘోరి, మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించింది. సనాతన ధర్మం మహిళలు రక్షణ కోసం ఆమె ఇలా పర్యటిస్తున్నట్లు తెలిపింది. పూజల అనంతరం కాకినాడ శ్రీ పీఠం సంస్థానానికి బయలుదేరింది.

# ఉద్యోగుల జీవిత బీమా పథకం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు వారి సర్వీస్‌కు సంబంధించి పలు ప్రయోజనకర ఉత్తర్వులను వెలువరించడం జరిగిం ది. అందులో భాగంగానే ప్రభుత్వ జీవిత బీమా పథకంను ఏర్పాటు చేశారు. ఈ పథకం ముఖ్య ఉద్దేశము ప్రభుత్వ సర్వీసులో ఉండి మరణించిన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రక్షణ, పదవీ విరమణ పొందిన వారికి పెద్ద మొత్తంలో ఆర్థిక వనరుల కల్పించే ఉద్దేశంతో ప్రారంభించబడింది. 1.11. 1956 తర్వాత నియామకం కాబడిన ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఈ పథకంలో సభ్యునిగా చేరాలి. 20 సంవత్సరములు నిండిన 56 సంవత్సరాల లోపు వయసు గలవారికి సభ్యులుగా చేరుటకు అర్హత కలదు. ఉద్యోగులు ఈ పథకంలో చేరడానికి కనీసం సంవత్సరం సర్వీస్ చేసి రెగ్యులర్ స్కేలు పొందుతూ ఉండాలి. నెలసరి మూల వేతనం అనుసరించి ప్రీమియం చెల్లించాలి. నెలసరి ప్రీమియం ను డ్రాయింగ్ అధికారి ఉద్యోగి వేతన బిల్లు నుంచి మినహాయించి నిర్ణీత షెడ్యూల్ బిల్లుతో పాటు ట్రెజరీ అధికారులకు సమర్పించాలి. స్లాబ్ రేటు కంటే మూలవేతనంలో 20% లేదా 20 వేల రూపాయలు మించకుండా ఏది తక్కువ అయితే అది ఇన్సూరెన్స్ డైరెక్టర్ అనుమతితో ప్రీమియం పెంచుకునే అవకాశం ఉంది. ఆదాయం పన్ను లెక్కింపులో సెక్షన్ 80సి కింద సంవత్సర కాలంలో చెల్లించిన మొత్తానికి మినహాయింపు ఉంటుంది. ఆయా స్లాబ్స్ ప్రకారం ప్రీమియం చెల్లించాలి. మొదటి ప్రీమియంను మినహాయించిన తర్వాత, సదరు ప్రీమియం మొత్తం, టోకెన్ నెంబర్, తేదీ, మినహాయించిన నెల మొదలగు వివరాలతో నిర్ణీత దరఖాస్తును సంబంధిత అధికారి ద్వారా జిల్లా ఇన్సూరెన్స్ అధికారికి పాలసీ జారీకై పంపుకోవాలి. అదేవిధంగా మూలవేతంలో పెరుగుదల సంభవించి స్లాబులు మారినప్పుడు కూడా మరల నిర్ణీత దరఖాస్తును రెండవ పాలసీ కేటాయింపునకై పంపాలి.

జీత నష్టపు సెలవులో ఉండి, ఏ ఇతర కారణాల వల్లనైనా ప్రీమియం చెల్లించబడనప్పుడు పాలసీ నిలుపుదల కాదు. విధి నిర్వహణలో చేరిన పిదప, చెల్లించాల్సిన బకాయిలను వడ్డీతో సహా రికవరీ చేయాలి. ఏ ఇతర కారణాలవల్ల పాలసీదారుని జీతం తగ్గింపబడినను తప్పనిసరిగా అమల్లో ఉన్న ప్రీమియంనే చెల్లించాలి. పాలసీదారులు భార్య, భర్త, పిల్లలను, అదే విధంగా చట్టబద్ధమైన వారసులను నామినీలుగా సూచించవచ్చు. జిల్లా ఇన్సూరెన్స్ అధికారి పాలసీలను పదవీ విరమణ తేదీ నాటికి మెచ్యూర్ అగునట్లు జారీ చేస్తారు. పాలసీదారు అనగా ప్రభుత్వ ఉద్యోగి వాలంటరీ రిటైర్మెంట్, మెడికల్ ఇన్వాలిడేషన్, ఇతర కారణాలవల్ల పదవీ విరమణ గావిస్తే ఆ తేదీ వరకు నిబంధనలకు లోబడి పాలసీ సరెండర్ విలువను పొందవచ్చు. పాలసీ మెచ్యూర్ తేదీ వరకు మిగిలిన ప్రీమియం చెల్లిస్తూ మెచ్యూర్ తేదీ నాడు పాలసీ విలువను బోనస్‌తో సహా పొందవచ్చును. సాధారణ ఎల్ఐసీ కానీ ఇతర ప్రైవేటు ఇన్సూ రెన్స్‌ల కంటే ఈ పథకంలో చెల్లించే బోనస్ ఎక్కువ. ప్రతీ 1000 రూపాయలకు 85% బోనస్ చెల్లించబడుతుంది. ప్రతి ఉద్యోగి సర్వీస్ పుస్తకం లో పాలసీ నెంబరు, నామినీ పేరు, చెల్లిస్తున్న నెలసరి ప్రీమియం, మెచ్యూరిటీ తేదీ, మెచ్యూరిటీ విలువ మొదలగు వివరాలను తప్పనిసరిగా నమో దు చేయాలి. ప్రీమియం పెరిగి రెండో పాలసీ మంజూరు కాబడినప్పుడు కూడా సదరు వివరాలు నమోదు చేయాలి. ప్రతి ఆర్థిక సంవత్సరం పూర్తి అయిన పిదప అకౌంట్స్ స్లిప్పులను పొంద వచ్చును. పాలసీలో నిలువ ఉన్న మొత్తంపై 90% వరకు ఆయా కారణాలపై రుణాలను పొందవచ్చును. ఈ రుణాన్ని తిరిగి 12 నుంచి 48 వరకు వాయిదాలు మించకుండా తిరిగి చెల్లించాలి. దురదృష్టవశాత్తు పాలసీదారుడు శాశ్వతంగా అశక్తుడైతే, భవిష్యత్తులో కట్టబడే ప్రీమియంను నుండి గరిష్టంగా నెలకు 500 రూపాయల వరకు రద్దు పరచవచ్చును. డెత్ క్లెయిములకై రిఫండ్ ఫారం నెంబర్ -2 అడ్వాన్స్ రసీదు స్టాంపుతో, పాలసీ బాండ్, డెత్ సర్టిఫికెట్ సమర్పించి సంబంధిత మొత్తాన్ని పొందాలి. ఇతర క్లెయిములకు రిఫండ్ ఫారం, అడ్వాన్స్ రసీదు స్టాంపుతో, పాలసీ బాండ్‌ను అదేవిధంగా పాలసీ జతచేస్తూ పనిచేసిన కార్యాలయం డ్రాయింగ్ అధికారి ద్వారా పంపి క్లెయిమ్ పొందవచ్చును. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 212 ఆర్థిక, ప్రణాళిక శాఖ తేదీ 17.12.97 ద్వారా ఈ పథకాన్ని పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు కూడా 1998 నుండి వర్తింపచేశారు.

# అతిపెద్ద రైల్వేస్టేషన్ గా అమరావతి

అమరావతి, నవంబర్ 6, అమరావతి రైల్వే లైన్‌కు సంబంధించి మరో అప్‌డేట్ వచ్చింది. 160 కిలోమీటర్ల వేగ పరిమితితో కొత్త అమరావతి రైల్వే లైన్ రూపకల్పన జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. అలాగే.. అమరావతి రైల్వే స్టేషన్‌లో కోచింగ్ డిపోల వంటి సౌకర్యాలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. మెయింటెనెన్స్ కోసం మొదట్లో.. 2-3 పిట్ లైన్లు నిర్మించే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రధాన అంశాలు ఇలా ఉన్నాయి.

1.ఎర్రుపాలెం, అమరావతి నుంచి నంబూరు వరకు 57 కిలోమీటర్ల కొత్త సింగిల్ లైన్ వేయనున్నారు.

2.రూ.2,245 కోట్ల అంచనాతో అమరావతి రైలు ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీన్ని నాలుగేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

3.ఈ ప్రాజెక్టులో భాగంగా.. కృష్ణా నదిపై 3.2 కిలోమీటర్ల వంతెన నిర్మించనున్నారు. దాములూరు- వైకుంఠపురం మధ్య వంతెనను నిర్మించనున్నారు.

4.అమరావతి రైల్వే లైన్ ప్రాజెక్టు కోసం భూసేకర ప్రక్రియ ప్రారంభం అయ్యింది. తెలంగాణలోని ఖమ్మం, ఏపీలోని ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో భూసేకరణ చేపట్టాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఈ కొత్త లైన్ ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం వద్ద ప్రారంభమై అమరావతి మీదుగా గుంటూరులోని నంబూరు స్టేషన్ వరకు ఉంటుంది.

5.ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని కొన్ని గ్రామాల రైతులు భూసేకరణకు బదులుగా ల్యాండ్ పూలింగ్‌కు మొగ్గుచూపుతున్నారు. రైల్వే లైను కోసం అవసరమైన భూమిని ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా భూములకు ధరలు పెరుగుతాయని ఆశిస్తున్నారు.

6.ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ఎర్రుపాలెం, కేసిరెడ్డిపల్లె గ్రామాల్లో సుమారు 60 ఎకరాల భూమిని సేకరించాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. రైతులు తమ అభ్యంతరాలను 30 రోజుల్లోగా తెలియజేయాలని భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌కు నోటిఫికేషన్ విడుదల చేశారు.

7.ఈ ప్రాజెక్టుకు అవసరమైన దాదాపు 80 శాతం భూమి రాజధాని ప్రాంత అభివృద్ధి అథారిటీ (సీఆర్డీఏ) వద్ద అందుబాటులో ఉంది. అలైన్‌మెంట్‌ను ఖరారు చేసిన తర్వాత రైల్వేకు భూమిని ఇచ్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే సుముఖత వ్యక్తం చేసింది. ఎన్టీఆర్ జిల్లాలో కొద్దిపాటి భూమి మాత్రమే అవసరమని, దానిని కూడా భూసేకరణ చట్టం ద్వారా సేకరించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

8.ఈ ప్రాజెక్టును నాలుగేళ్లలో పూర్తి చేయాలని కేంద్రం భావిస్తుండగా.. మూడేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రాన్ని కోరారు.

9.ప్రతిపాదిత రైల్వే లైన్‌లో ఎర్రుపాలెం - నంబూరు జంక్షన్‌ల మధ్య తొమ్మిది స్టేషన్లు ఉంటాయి. ఎన్టీఆర్ జిల్లాలోని పరిటాల వద్ద మల్టీ మోడల్ కార్గో స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. విజయవాడ- హైదరాబాద్ మధ్య ఉన్న రైల్వే లైన్‌లో ఎర్రుపాలెం ఉండగా, కొత్త లైన్ చివరి స్టేషన్ నంబూరు.. విజయవాడ- గుంటూరు మధ్య ఉంది.

10.అమరావతి రైల్వే స్టేషన్‌ను దేశంలోనే అతిపెద్ద రైల్వే స్టేషన్‌గా, మోడల్‌గా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం రైల్వే మంత్రిత్వ శాఖను కోరింది. అమరావతి స్టేషన్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 1,500 ఎకరాల భూమిని ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది.

# పవన్ గ్రౌండ్ లోకి ఎంటర్ అయినట్టేనా



అమరావతి, నవంబర్ 6,జనసేన అధినేత పవన్ కల్యాణ్ మళ్లీ ఎన్నికలకు ముందు తరహా రాజకీయాలను ప్రారంభించినట్లే కనపడుతుంది. ఫుల్లు ఎఫెన్స్ లో కనపడుతున్నారు. నిన్నటి వరకూ తన పని ఏదో తాను చూసుకుంటూ పవన్ కల్యాణ్ పెద్దగా బయటకు కనిపించలేదు. ఆయన తనకు కేటాయించిన శాఖలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీశాఖలను ఆయన పూర్తిగా అధ్యయనం చేశారు. అధికారులతో సమీక్షలు, ఉత్తర్వులకే పరిమితమైన పవన్ కల్యాణ్ నేడు గ్రౌండ్ లోకి ఎంటర్ అయ్యారు. వచ్చీ రావడంతోనే ఇటు కూటమి ప్రభుత్వంపైనా, అటు విపక్షంపైనా విరుచుకుపడుతూ వెళ్లడం దేనికి సంకేతం అన్న చర్చ జరుగుతుంది. పిఠాపురం నియోజకవర్గంలో కూటమిలో ఉంటున్న టీడీపీ నేత చేతిలో ఉన్న హోంశాఖపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హోంశాఖను సరిగా నిర్వహించడంలేదంటూ మండిపడ్డారు. వంగలపూడి అనిత నుంచి తాను హోంశాఖను తీసుకుంటే పరిస్థితులు వేరుగా ఉంటాయని హెచ్చరికలు కూడా జారీ చేశారు. పోలీసు ఉన్నతాధికారుల నుంచి కూటమి పార్టీల నేతల వరకూ పిఠాపురంలో పవన్ కల్యాణ్ ఏకిపారేశారు. నిజానికి పవన్ కల్యాణ్ కు రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యపై అసంతృప్తి ఉంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో నేరుగా చెప్పవచ్చు. లేదంటే మంత్రివర్గ సమావేశంలో ప్రస్తావించవచ్చు. కానీ పవన్ అలా చేయలేదు. జనం సమక్షంలో హాట్ కామెంట్స్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. అసలు కూటమిలో ఏదో జరుగుతుందన్న అనుమానాలను లేవనెత్తారు. ఇక పిఠాపురం నియోజకవర్గంలో రెండు రోజుల పాటు పర్యటించాల్సి ఉన్నప్పటికీ మరుసటి రోజు పల్నాడు ప్రాంతానికి పవన్ కల్యాణ్ చేరుకున్నారు. అక్కడ వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు సంబంధించిన సరస్వతీ పవర్ భూములను సందర్శించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. అన్యాక్రాంతమైన భూముల విషయాలను పవన్ ప్రస్తావించారు. పేదల భూములను జగన్ బలంవంతంగా సొంతం చేసుకున్నారంటూ మండిపడ్డారు. జగన్ సీఎం అయిన తర్వాత ఈ కంపెనీకి భూముల లీజును యాభై ఏళ్ల పాటు పొడిగించుకున్నారన్నారు. కోడెల శివప్రసాద్ ను ఫర్నిచర్ కోసం వేధించి నాటి ప్రభుత్వం చంపేసిందంటూ పల్నాడు పర్యటనలో వ్యాఖ్యానించారు. భూములు లాక్కున్న వారికి సరస్వతీ పవర్స్ లో ఉద్యోగాలు ఇవ్వాల్సిందేనంటూ రైతుల వద్ద ఆయన డిమాండ్ చేశారు. డిప్యూటీ చీఫ్ మినిస్టర్ గా ఉన్న పవన్ కల్యాణ్ ఇలా ఆవేశంగా మాట్లాడటం.. తన, తరతమ బేధల్లేకుండా మాట్లాడుతుండటం రాజకీయంగా చర్చకు దారితీసింది. అసలు పవన్ కల్యాణ్ మనస్సులో ఏముందన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. 2027 నాటికి తాను కీలకంగా మారాలని పవన్ భావిస్తున్నారా? అన్న అనుమానం మాత్రం కూటమి పార్టీల్లోనూ బయలుదేరింది. ఢిల్లీ నుంచి ఏదైనా సిగ్నల్స్ అందాయా? అన్న చర్చకూడా ఏపీ పాలిటిక్స్ లో జరుగుతుంది. పవన్ కల్యాణ్ ఇన్నాళ్లు మౌనంగా ఉండి, చంద్రబాబు నాయుడుపై ప్రశంసలు కురిపించి కొంచెం ఇమేజ్ తగ్గడంతో తిరిగి దానిని పొందేందుకు ప్రయత్నిస్తున్నారా? అన్న అనుమానం కూడా లేకపోలేదు. మొత్తం మీద గత రెండు రోజులుగా పవన్ కల్యాణ్ చేస్తున్న కామెంట్స్, పర్యటిస్తున్న తీరు అనేక అంశాలకు చర్చనీయాంశంగా మారింది.

డిఫెన్స్ లో అనిత

హోంమంత్రి పదవి అంటే నిజంగా కత్తిమీద సాము వంటిది. ఎవరికైనా అంతే. ఆపదవిలో ఉన్నవారికి ఏ పార్టీలో అధికారంలో ఉన్నప్పటికీ పెద్దగా పవర్స్ ఉండవు. హోంమంత్రి అంటే కేవలం విమర్శలు చేయించుకోవడానికే ఆ పదవి చేపట్టాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రితో పాటు కీలక నేతలు హోంశాఖను హ్యాండిల్ చేస్తారు. గతంలో వైసీపీ అధికారంలో ఉండగా కూడా ఇద్దరు మహిళ హోంమంత్రులు పనిచేశారు. మేకతోటి సుచరిత కొన్నాళ్ల పాటు హోంమంత్రిగా పనిచేయగా, తానేటి వనిత ఇంకొన్నాళ్లు పనిచేశారు. కానీ ఇద్దరు కేవలం సంతకం చేయడానికి మాత్రమే ఆ సీట్లో కూర్చునే వారు. ముఖ్య నిర్ణయాలన్నీ నాటి సీఎంవో నుంచి వచ్చేవంటారు. నిజానికి వంగలపూడి అనిత హోం మంత్రిగా బాధ్యతలను చేపట్టిన తర్వాత కొంత వరకూ యాక్టివ్ గానే ఉన్నారు. అనితకు పూర్తి స్థాయి అధికారాలు ఉండవని అందరికీ తెలుసు. పవన్ కల్యాణ్ కు కూడా తెలియంది కాదు. ప్రధానమైన పోస్టింగ్ ల విషయంలో హోంమంత్రి ప్రమేయం తక్కువగానే ఉంటుంది. సాంకేతికంగానే ఎవరున్నా పదవిలో ఉంటారు తప్పించి..ఆ శాఖలో ముఖ్యమైన నిర్ణయాలన్నీ ముఖ్యమంత్రి తీసుకుంటుంటారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ ప్రధానమైనది కనుక ముఖ్యమంత్రి నిరంత పర్యవేక్షణలోనే హోంశాఖ ఉంటుంది. డీజీపీ స్థాయి అధికారులు కూడా ఏదైనా నిర్ణయాన్ని ముఖ్యమంత్రి ఆమోదించిన తర్వాతనే తీసుకుంటారన్నది కాదనలేని వాస్తవం.కానీ విమర్శలకు వచ్చేసరికి హోంమంత్రి బలయిపోతుంటారు. ఇప్పుడు వంగలపూడి అనిత కూడా. నిజానికి గత కొద్దిరోజుల నుంచి ఏపీలో శాంతిభద్రతల సమస్యకు ఎలాంటి ఇబ్బంది లేకున్నా, కొన్ని చోట్ల మహిళలపై అత్యాచారాలు జరిగాయి. పిఠాపురంలోనూ ఒక యువతిపై అత్యాచారం జరిగింది. ఆ కేసులో నిందితుడిపై సరైన చర్యలు తీసుకోలేదన్నది పవన్ కల్యాణ్ ఆగ్రహంగా తెలుస్తోంది. దానికి హోంశాఖను బాధ్యులను చేస్తూ ఆయన మాట్లాడారు. హోంమంత్రి పనితీరును తప్పుపట్టే విధంగా ఆయన వ్యాఖ్యానించారు. కానీ హోం మంత్రి ఏ విషయంలోనూ ఏ నిర్ణయంలోనూ పెద్దగా ప్రమేయం ఉండదన్న విషయం పవన్ కల్యాణ్ కు తెలియంది కాదు. . పవన్ కల్యాణ్ వంగలపూడి అనితపై ఆయన నేరుగా వ్యాఖ్యలు చేశారు. అందువల్ల ఆమెకు వెనువెంటనే పదవీ గండం అనేది ఏమీ ఉండదు. ఎందుకంటే టీడీపీ నుంచి ఆమె గెలిచి చంద్రబాబు ఇచ్చిన పదవి కావడంతో ముఖ్యమంత్రికి అన్ని విషయాలు తెలుసు. వంగలపూడి అనిత తప్పు ఏమీ లేదని కూడా తెలుసు. అందుకే అనిత పదవికి వచ్చిన ఢోకా ఏమీ లేకపోయినా.. ఆమె తనపై విపక్షాలు చేస్తున్న విమర్శలకు మాత్రం సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది. విపక్ష నేతలకు కూడా హోం మంత్రిత్వ శాఖపై పూర్తి స్థాయి అవగాహన ఉన్నప్పటికీ చివరకు ప్రభుత్వంపై బురద జల్లాలంటే ఈ శాఖ ఒక్కటే కనిపిస్తుంది. అందుకే హోంశాఖ ఎంత వపర్ ఫుల్ అయినదో.. అంత చికాకు తెప్పించే శాఖ అని అనితకు ఇప్పుడు అర్థమయి ఉండాలి.

# అమరావతిలో లగ్జరీ విల్లాలకు డిమాండ్

గుంటూరు, నవంబర్ 6, ఏపీ రాజధాని అమరావతిలో రియల్ ఎస్టేట్ బూమ్ క్రమంగా పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిపై ఫోకస్ పెట్టడంతో.. భూముల ధరలు పెరుగుతున్నాయని అంటున్నారు. ఎక్కువ మంది లగ్జరీ విల్లాలపై పెట్టుబడి పెడుతున్నారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో రియల్ ఎస్టేట్‌కు మళ్లీ మంచి రోజులు వచ్చాయనే టాక్ వినిపిస్తోంది. అందుకు కారణం.. అమరావతిలో మళ్లీ పనులు ప్రారంభం కావడమేనని చెబుతున్నారు. గతంలో అమరావతి ప్రాంతంలో భూముల ధరలు పడిపోయాయి. ఎక్కువ రియల్ ఎస్టేట్ వ్యాపారం జరగలేదు. కానీ.. గడిచిన రెండు నెలలుగా భూ క్రయవిక్రయాలు క్రమంగా పెరుగుతున్నాయి.అమరావతి ప్రాంతంలో భూమి లేని వారు కొత్తగా కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. కేవలం ఏపీ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి భూమిని కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా విజయవాడ- గుంటూరు మధ్యలో భూములు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. అలాగే కృష్ణా నది తీరం వెంట భూముల ధరలు అమాంతం పెరిగాయి. గతంలో ఎకరం రూ.30 లక్షలు ఉంటే.. ఇప్పుడు మూడింతలు పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.ఇక్కడ భూములు ఉన్నవారు ఇప్పుడు ఎక్కువగా లగ్జరీ విల్లాలపై ఫోకస్ పెడుతున్నారు. లగ్జరీ విల్లాలు నిర్మించి విక్రయించాలని ప్లాన్ చేస్తున్నారు. ఇప్పుడు ఎక్కువమంది లగ్జరీ విల్లాలపై పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నారు. రియల్టర్లతో అగ్రిమెంట్ చేసుకొని.. విల్లాల నిర్మాణానికి ప్లాన్ చేస్తున్నారు. భవిష్యత్తులో వీటికి డిమాండ్ ఎక్కువ ఉంటుందని ఆశిస్తున్నారు.అమరావతికి సమీపంలో ఆకర్షణీయమైన ప్రదేశాలు ఉన్నాయి. అలాగే ప్రభుత్వం కూడా అమరావతిపై ఫుల్ ఫోకస్ పెట్టింది. మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించింది. ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభం అయ్యాయి. దీంతో ఆయా పరిసరాల్లో ఇళ్ల ప్లాట్ల ధరలు కూడా పెరిగిపోయాయి. 2024 అసెంబ్లీ ఎన్నికలకు ముందు సెంటున్నర స్థలం రూ.13 లక్షలు చెప్పిన వారు.. ఇప్పుడు రూ.20 లక్షల పైనే చెబుతున్నారు.అమరావతి ప్రాంతంలోని 22 మండలాలు, 87 గ్రామాల మీదుగా ఓఆర్ఆర్ నిర్మాణం కానుందని తెలుస్తోంది. దీంతో ఆయా గ్రామాల్లో భూములకు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భూముల ధరలకు రెక్కలు రానున్నాయి. విజయవాడ చుట్టుపక్కల ఉన్న మైలవరం, గన్నవరం, నూజివీడు, గుడివాడ, మంగళగిరి, తాడికొండ, పొన్నూరు, పెదన, మచిలీపట్నం, దెందూలూరు నియోజకవర్గాల్లోని భూముల ధరలు పెరిగే అవకాశం ఉంది. దీంతో ఈ ప్రాంతాల్లోనూ కొనుగోళ్లు ఊపందుకున్నాయి.అమరావతి రైల్వే లైన్‌కు కేంద్ర కేబినెట్ ఇటీవలే ఆమోదం తెలిపింది. కృష్ణా నదిపై 3.2 కి.మీ. మేర రైల్వే వంతెన నిర్మాణం జరగనుంది. రూ.2,245 కోట్లతో 57 కి.మీ. రైల్వేలైన్ నిర్మాణం చేపట్టనున్నారు. ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా.. నంబూరు వరకు కొత్త రైల్వే లైన్‌కు ఆమోదం లభించింది. దీని కారణంగా కూడా భూములకు ధరలు పెరిగాయి. ఆర్థికంగా ఇబ్బందిలేని రైతులు కాంప్లెక్స్‌లు నిర్మించేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు.ఇవే కాకుండా రాజధానిలో వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలను నిర్మించే అవకాశం ఉంది. అటు ప్రైవేట్ సంస్థలు కూడా నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంది. దీంతో రైతుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో భూములు కొన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములు చదును చేసి.. మళ్లీ వ్యాపారం మొదలుపెట్టారు.

## ఫ్లైఓవర్ల కింద ప్లే గ్రౌండ్స్

హైదరాబాద్, నవంబర్ 6, హైదరాబాద్.. ఇరుకైన రోడ్లు, గంటల తరబడి ట్రాఫిక్ జామ్. నిత్యం ప్రయాణికులకు నరకం కనిపిస్తుంది. రద్దీని తగ్గించడానికి ఫ్లైఓవర్ల నిర్మాణం చేశారు. అయితే.. వాటి కింద ఖాళీ స్థలాన్ని వినియోగించుకోవడానికి జీహెచ్ఎంసీ ఇప్పుడు కొత్త ఆలోచన చేసింది. ఫ్లైఓవర్ల కింద ప్లే గ్రౌండ్‌లను నిర్మిస్తోంది. హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ వినూత్న ఆలోచన చేసింది. కేపీహెచ్‌బీ ఫ్లైఓవర్ కింద.. నగరంలో మొట్టమొదటి సారిగా క్రీడా రంగాన్ని ఏర్పాటు చేసింది. 12,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో.. బాస్కెట్‌బాల్, స్కేటింగ్, బ్యాడ్మింటన్, క్రికెట్‌తో సహా వివిధ క్రీడలు ఆడేలా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తోంది.ఈ బహుళార్ధసాధక క్రీడా ప్రాంగణాన్ని.. రూ.78 లక్షల వ్యయంతో ఫ్లైఓవర్ కింద నిర్మిస్తున్నారు. ఇదే కాదు.. త్వరలో ఇలాంటి మరిన్ని ప్రాంగణాల నిర్మాణాలకు ప్లాన్ చేస్తున్నారు. హైటెక్ సిటీ, ఖైత్లాపూర్, బాలానగర్ ఫ్లైఓవర్‌ల కింద కూడా ఇలాంటి ఇలాంటివి ఏర్పాటు చేయడానికి అడుగులు పడుతున్నాయి.అయితే.. ఫ్లైఓవర్ల కింద ఇలాంటి నిర్మాణాలను నిపుణులు వ్యతిరేకిస్తున్నారు. రద్దీగా ఉండే రోడ్లలో ఇలాంటివి ఏర్పాటు చేస్తే.. ప్రజలు ఆ ప్రాంతంలో గుమిగూడతారని అంటున్నారు. ఫలితంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని చెబుతున్నారు.రోడ్ల మధ్యలో ఇలాంటివి ఉంటే.. వాహనదారులు ఇంట్రెస్ట్ డైవర్ట్ అవుతుందని.. దీంతో ప్రమాదాలు జరుగుతాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫ్లైఓవర్‌లను ప్రజల ప్రాణాలకు హాని కలిగించని కార్యకలాపాలకు వినియోగించాలని అర్బన్ ప్లానర్లు చెబుతున్నారు.

## తెలుగు రాజకీయాల్లోకి నటి కస్తూరి...

తిరుపతి, నవంబర్ 6,తమిళనాడులో అధికార డీఎంకే నేతల టార్చర్ భరించలేకపోతున్నానని, తనకు హైదరాబాద్ అభయం ఇచ్చిందన్నారు. ఇప్పటివరకూ తమిళ రాజకీయాలపై మాట్లాడాను, కానీ ఇప్పుడు చెబుతున్నా.. తెలుగు రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తానని ప్రకటించారు. తనను ఎంతగానో ఆదరించిన తెలుగు వారికి తనను దూరం చేయాలన్న ప్రయత్నం జరుగుతుందన్నారు. తెలుగు ప్రజలకు తాను రుణపడి ఉంటున్నానని, ఇక్కడి రాజకీయాల్లోకి వచ్చి వారి కోసం పాటుపడతా అన్నారు. తమిళంలో తాను చేసిన వ్యాఖ్యలపై వివరణ అడగకుండా తిట్టారని, తెలుగు ప్రజలు మాత్రం మీరు ఇలా అన్నారా, కామెంట్లు చేశారా వివరణ కోరారని.. దటీజ్ తెలుగు ప్రజలు అన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తాను అభిమానినని, ఆయన దారిలో నడుస్తానని నటి కస్తూర్తి సంచలన ప్రకటన చేశారు. నేను ఈరోజు ట్రెండింగ్ లో ఉన్నాను, కానీ మంచి విషయంలో కాదంటూ నటి కస్తూరి ఆవేదన వ్యక్తం చేశారు. తమిళంలో తాను చేసిన వ్యాఖ్యల్ని తెలుగులో తప్పుగా అనువాదం చేశారని తన ఇంటివద్ద తెలుగు మీడియాతో అన్నారు. సర్వ సామాజిక సమావేశంలో డీఎంకే చేసే అన్యాయాలు, నేరాలను విమర్శించడం, ఎత్తి చూపడంతో వారు తనపై దుష్ప్రచారం చేశారని కస్తూరి పేర్కొన్నారు. డీఎంకే సిద్ధాంతం తెలుగువాళ్లు తెలుసుకోవాలి. దేవుడు లేడని డీఎంకే నేతలు అంటారు. ముఖ్యంగా హిందూ దేవతలు, దేవుళ్ల లేరు. సనాతన ధర్మాన్ని విశ్వసించేవాళ్ల తెలివి తక్కువ వాళ్లు అని డీఎంకే వాళ్లు భావిస్తారు. బ్రాహ్మణులు అనేవారు స్థానికులు కాదు, పరదేశీయులు అని వాళ్లు దుష్ప్రచారం చేస్తున్నారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలనేది కూడా డీఎంకే సిద్ధాంతం. ఈ విషయాలను ఎత్తిచూపానన్న కారణంగా నాపై ఎన్నో వదంతులు ప్రచారం చేశారు. తాగుబోతు అన్నారు. ఎవరెవరితోనే అక్రమ సంబంధాలు ఉన్నాయని ప్రచారం చేసినా వాటిని అంతగా పట్టించుకోలేదు.తెలుగు ప్రజలను కస్తూరి కించపరిచిందంటూ తనపై డీఎంకే నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేను మాట్లాడిన ఆ వేదిక మీద తెలుగువాళ్లు కూడా ఉన్నారు. నా మెట్టినిల్లు తెలుగు ప్రాంతం. నా పిల్లల రక్తంలో తెలుగుదనం ఉంది. ఎవరు వచ్చినా తెలుగువాళ్లు ప్రేమ చూపిస్తారు. వేరే వాళ్లను అయినా ప్రోత్సహించేతత్వం వారిది. ఒక నేత ఫ్యామిలీని ఉద్దేశించి మాట్లాడా. ఓపెన్ గా దీని గురించి నిజాలు చెప్పినా ఇది మరో రగడ, కేసు అవుతుంది. రాజకీయాల్లో నేను లేకుండా చేయాలన్నది డీఎంకే నేతల ఉద్దేశం. అందుకు నన్ను టార్గెట్ చేసుకుని, నా వ్యాఖ్యల్ని దుష్ప్రచారం చేస్తున్నారు. తిరుమల లడ్డూ కల్తీ వివాదం సమయంలో తెలుగు వారు ఎంతో బాధపడ్డారు. ఈ విషయంపై డీఎంకే వాళ్లు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీరు రోజూ బీఫ్ కొవ్వు తిన్నారు కదా, బాగుందా, రోజూ అలాగే తినండంటూ డీఎంకే నేతలు తెలుగు వారిని అపహాస్యం చేశారు. కేవలం తెలుగు ప్రాంతం నుంచి తమిళనాడుకు వలస వచ్చిన వారిని ఉద్దేశించి మాట్లాడా. ఎక్కడినుంచి వచ్చినా వారి సొంతమని చెప్పలేకపోతున్నారు. తమిళనాడులో 5 మంది తమిళ మంత్రులు ఉన్నారు.

# విజయనగరం బరిలో టీడీపీ నిలిచేనా

విజయనగరం, నవంబర్ 6 విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ వచ్చింది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయింది. వైసీపీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై అనర్హతా వేటు వేయడంతో ఈ ఉపఎన్నిక వచ్చింది. తనపై అనర్హతా వేటు వేయడాన్ని రఘురాజు హైకోర్టులో సవాల్ చేశారు. కోర్టులో విచారణ జరగాల్సి ఉన్నప్పటికీ ఎన్నికల సంఘం షెడ్యూల్ ఇచ్చేసింది. ఈ కారణంగా కోర్టు జోక్యం చేసుకునే అవకాశాలు కూడా తక్కువేనని భావిస్తున్నారు. నామినేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభమైనందున కొనసాగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఉపఎన్నికకు పదకొండో తేదీ వరకూ నామినేషన్ల గడువు ఉంది. 28వ తేదీన పోలింగ్ జరుగుతుంది. విజయనగరం ఎమ్మెల్సీగా ఉన్న ఇందుకూరి రఘురాజు కుటుంబసభ్యులు ఎన్నికల సమయంలో టీడీపీలో చేరారు. ఆయన చేరలేదు. అయితే టీడీపీ ప్రచారంలో పాల్గొంటున్నారని చెప్పిఆయనపై రాత్రికి రాత్రి అనర్హతా వేటు వేశారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగినప్పుడు టీడీపీ బాయ్ కాట్ చేసింది. దీంతో సహజంగానే వైసీపీకి పార్టీకి మెజార్టీ ఉంది. విశాఖలో ఉపఎన్నిక జరిగితే బొత్సకు బాధ్యత ఇచ్చారు. ఆయననే అభ్యర్థిగా ఖరారు చేశారు. ఇప్పుడు కూడా ఆయన కుటుంబానికే జగన్ టిక్కెట్ ఆఫర్ చేస్తారని గెలిపించుకోవాల్సిన బాధ్యత ఆయన మీదనే పెడతారు. బొత్స కుటుంబంలోని అభ్యర్థి అయితేనే బలమైన అభ్యర్థిగా ఉంటారన్న అంచనాలు ఉన్నాయి. విజయనగరం స్థానిక సంస్థల్లో మొత్తం ఓటర్లు 753 మంది ఉన్నారు. వీరిలో వైసీపీకి 548 మంది, టీడీపీకి 156, జనసేనకు 13 మంది ఉన్నారు. స్వతంత్రులు 14 మంది ఉండగా ఇండిపెండెంట్లుగా గెలిచిన వారు 22 మంది ఉన్నారు. ఎలా చూసినా వైసీపీకి పూర్తి మెజార్టీ ఉంది. కానీ ఎన్నికల ఫలితాల తర్వాత చాలా మంది టీడీపీలో చేరిపోయారు. బొత్స కూడా అంటీ ముట్టనట్లుగా ఉంటున్నారు. ఆయన మేనల్లుడు మజ్జి శ్రీనివాసే అంతా చూసుకుంటున్నారు. ఉత్తరాంధ్ర ఇంచార్జ్ పదవిని మళ్లీ విజయసాయిరెడ్డికి ఇచ్చారు. ఆయన ఇంకా ఉపఎన్నికపై దృష్టి పెట్టలేదు. మరో వైపు బొత్స సత్యనారాయణ అమెరికా పర్యటనలో ఉన్నారు. ఈ ఉపఎన్నిక కోసం ఆయన తిరిగి వస్తారా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. వైసీపీ తరపున ఎవరు పోటీ చేసినా అది బొత్స కు టుంబం నుంచే ఉంటుందని అంటున్నారు. ఇప్పటికీ వైసీపీ కూడా అభ్యర్థిపై ఎలాంటి కసరత్తులు చేయలేకపోయింది. విజయనగరం జిల్లా కాబట్టి బొత్స మాటే నెగ్గుతుంది. టీడీపీ ఎన్నికల్లో పోటీ చేస్తుందా లేదా అన్నదానిపై ఇంకా స్పష్టత లేదు. విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంగా టీడీపీ ఉంది. శాఖ స్థానిక సంస్థల విషయంలో టీడీపీ నేతలు మెజార్టీ ఓటర్లు ఉన్నారని భరోసా ఇవ్వలేకపోవడంతో బొత్సకు వాకోవర్ లభించింది. విజయనగరం జిల్లా నేతలు ఏం చేస్తారన్నదానిపై చర్చ నడుస్తోంది. ఒక వేళ పోటీ పెట్టాలనుకుంటే అనర్హతా వేటు పడిన ఇందుకూరి రఘురాజుకే టీడీపీ చాన్స ఇవ్వాలన్న సూచనలు ఉన్నాయి. గత ఎన్నికల తరవాత వైసీపీ క్యాడర్ టీడీపీ, జనసేనల్లో చేరిపోయారు. రఘురాజు వర్గం ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిపోయింది. వైసీపీ, టీడీపీ ఇద్దరూ పోటీ చేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో రసవత్తరమైన పోటీ జరుగుతుంది. ఎవరైనా వెనక్కి తగ్గితే మాత్రం.. ఏకగ్రీవం అవుతుంది.

# రగిలిపోతున్న వేమిరెడ్డి...



నెల్లూరు, జనవరి 6 ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి.. నెల్లూరు జిల్లా రాజకీయాల్లో గత దశాబ్దకాలంగా చక్రం తిప్పుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చేందుకు 2019లో జరిగిన ఎన్నికల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. అప్పటినుంచి వైసీపీలో కొనసాగుతూ పార్టీకి అండదండ జిల్లాలో తానే అన్నట్లు వ్యవహరిస్తూ వచ్చారు. ఫ్యాన్ పార్టీ అధికారంలో ఉండగా.. పార్టీ కార్యక్రమాలు అన్నిటికీ తనవంతు సహకారం అందించి ఆర్థికమగా అండగా నిలిచారు. అటువంటి నేతను పట్టించుకోలేదన్న విమర్శలు 2024 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికమయ్యాయి. వాటిని నిజం చేస్తూ.. ఆయన చెప్పిన వారికి కాదని నెల్లూరు నగర ఎమ్మెల్యే టికెట్ ని.. జగన్ మరొకరికి కట్టబెట్టారు.

దీంతో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తీవ్ర మనస్థాపానికి గురై.. పార్టీకి రాజీనామా చేసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.ఆర్థికంగా వెన్నుదన్ను ఉన్న వేమిరెడ్డి లాంటి నేత పార్టీలో చేరడంతో.. తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపింది. ఆయన చేరికతో మాజీ ఎమ్మెల్యేలు నేతలు ఆయన ఇంటికి క్యూ కట్టారు. ఘనంగా పార్టీలోకి ఆహ్వానించి కండువాలు కప్పి శుభాకాంక్షలు చెప్పారు. ఆ తర్వాత పరిస్థితుల్లో కొద్ది కొద్దిగా మార్పు వచ్చింది. పార్టీ అధికారంలోకి రాగానే కొద్దిరోజుల పాటు ఆనందంతో శుభాకాంక్షలు చెప్పిన నేతలు ఆ తర్వాత క్రమేపి ఆయనను కలవడం ఆపేశారట. తనకు కేటాయించిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి.. పార్టీని అధికారంలోకి తీసుకురావడమే.. తన వంతు భావించిన ఆయన.. ఇప్పుడు వ్యాపారాలలో కాస్త బిజీ అయ్యారట. అయితే ఇప్పుడు నేతల తీరులో కూడా మార్పు వచ్చిందని.. వేమిరెడ్డిని పట్టించుకునే నేతలే కరువయ్యారని జోరుగా చర్చ జరుగుతుందట.రీసెంట్ గా జరిగిన నెల్లూరు డీఆర్సీ సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ఘోర అవమానం జరిగింది. మండలి సమావేశంలో ఇంచార్జిగా వ్యవహరించిన రూరల్ ఆర్డీవో అనూష.. అక్కడికి వచ్చిన వారి పేర్లన్నీ చదివి ఎంపీ వేమిరెడ్డి పేరును మాత్రం విస్మరించారట. పేరు పిలవకపోవడమే కాకుండా, బొకే కూడా ఇవ్వలేదని వేమిరెడ్డి అలిగారు. దీంతో ఆయన తన భార్య, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిని తీసుకుని వేదికపై నుంచి వెళ్లిపోయారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, మంత్రి నారాయణ కూడా అదే వేదికపై ఉన్నారు. వేమిరెడ్డి హఠాత్తుగా లేచి వెళ్లిపోతుండటంతో ఆయన కారు వరకు వెళ్లి మంత్రి ఆనం సముదాయించేందుకు ప్రయత్నించారు. అయినా ఫలితం లేకుండా పోయింది.ఆ తర్వాత తన వెంట వచ్చిన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని.. సమావేశంలో పాల్గొనాలని చెప్పడంతో ఆమె మీటింగ్ లో పాల్గొన్నారు. నేను మటుకు ఇక రాను అని వేమిరెడ్డి సీరియస్ గా అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే మంత్రులకు పూల బొకేలు అందించి స్వాగతాలు పలికిన అధికారులు.. ఎంపీ వేమిరెడ్డిని ఎందుకు విస్మరించారో ఇప్పటికీ అంతుపట్టని పరిస్థితి నేతల్లో నెలకొంది.ఈ వ్యవహారం చూస్తే పార్టీ అధికారంలోకి వచ్చేందుకు.. వేమిరెడ్డిని వాడుకున్న నేతలు ఇప్పుడు ఆయనను దూరం పెడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. నాడు వైసీపీలో చక్రం తిప్పిన నేత.. ప్రస్తుతం ఉన్న పార్టీ నేతలకు రుచించలేదా అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే ఇంత మార్పు వచ్చి అవమానపడేలా నేతలు, అధికారులు ఎందుకు వ్యవహరిస్తున్నారు.. అసలు ఆయన వెనుక ఏం జరుగుతుంది అన్న విషయంపై జిల్లాలో జోరుగా చర్చ జరుగుతుంది.

తెలుగుదేశం పార్టీకి ఆర్థిక పరిపుష్టిని ఇచ్చిన వేమిరెడ్డి లాంటి సీనియర్ నేత పార్టీలో కొనసాగే పరిస్థితి ఉంటుందా అని కూడా పొలిటికల్ వర్గాల్లో చరచర జరుగుతోంది.ఎన్నికల ముందు తన భార్య ప్రశాంతి రెడ్డికి టికెట్ అడిగితే జగన్ ఏవేవో సాకులు చెప్పి పట్టించుకోలేదట. అంతే కాకుండా వేమిరెడ్డిని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించినా.. ఆయన పరిధిలో ఉండే నెల్లూరు సిటీ స్థానంలో ఓ జూనియర్ నేతకు టికెట్ ఇచ్చేశారు. దీంతో అలిగిన వేమిరెడ్డి వైసీపీని వీడి టీడీపీలోకి వెళ్లి అదే నెల్లూరు ఎంపీగా గెలవడంతో పాటు తన భార్యను కోవూరులో గెలిపించుకున్నారు. దీంతో వేమిరెడ్డి అలక, చరిత్ర తెలిసిన వారెవరూ ఆయనతో పెట్టుకోరని ఆయన అభిమానులు చెబుతున్నారట.ఏదేమైనా ఎంపీ వేమిరెడ్డి ఎన్నికలకు వైసీపీలో అవమానాలను ఎదుర్కొన్న వేమిరెడ్డి.. ఇప్పుడు టీడీపీలో కూడా అవమానాలకు గురవుతున్నారని చర్చ జరుగుతోంది. ఈ ఊహాగణాలకు పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు ఎలా చెక్ పెడతారు ? అవమానాలతోనే వేమిరెడ్డి పార్టీలో కొనసాగుతారా ? వేమిరెడ్డి భవిష్యత్తు కార్యాచరణ ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# అనంత టీడీపీలో ఫ్యామిలీ వార్



అనంతపురం, నవంబర్ 6,ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెనుగొండ నియోజకవర్గం టీడీపీకి అత్యంత పట్టు ఉన్న నియోజకవర్గం. టీడిపి నుంచి పరిటాల రవి వరుసగా ఇక్కడి నుంచే గెలుపొందారు. పరిటాల రవి పోటీ చేసినప్పటి నుంచి కేవలం ఒక్కసారి మాత్రమే అక్కడ ఓడిపోయింది టీడీపి. అలాంటి నియోజకవర్గంలో ఇప్పుడు మామాకోడళ్ల మధ్య పొలిటికల్ రచ్చ టీడీపీని కలవరపెడుతోంది.

ఎమ్మెల్యే టికెట్ విషయంలో ఇరువురి మధ్య నడిచిన కోల్డ్ వార్.. ఇప్పుడు మరింత ముదురుతోందని అంటున్నారు. రాష్ట్ర మంత్రి సవితమ్మ, ఎంపీ బీకే పార్థ సారధి మధ్య ఇప్పటికీ విభేదాలు.. కొనసాగుతూనే ఉండడంతో మధ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, నలిగిపోతుండడం చర్చనీయాంశంగా మారుతోంది.ఉమ్మడి ఆనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షులుగా, జిల్లా పరిషత్ చైర్మన్ గా, రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఎంపీగా కీలక పదవులు అధిరోహించారు బి.కె. పార్థసారధి. పెనుకొండ కేంద్రంగా చక్రం తిప్పుతూ వస్తున్నారు. దశాబ్దాలుగా ఒంటి చేత్తో రాజకీయాలు నడిపిన పార్థసారధికి.. మంత్రి సవితమ్మ రూపంలో.. సొంత పార్టీలో ప్రస్తుతం ఎదురుగాలి వీస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికలలో పెనుకొండ అసెంబ్లీ టికెట్ కోసం ఆయన గట్టిగా ప్రయత్నించారు. చివరకు సవితమ్మను టికెట్ వరించడంతో ఆ సమయంలో బికే మద్దతుదారులు నిరసన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఆ తర్వాత బికె. పార్థసారథికి హిందూపురం లోక్ సభ టికెట్ రావడం భారీ మెజార్టీతో గెలవడం జరిగిందిఇదే సమయంలో ఎవరు ఊహించని విధంగా పెనుకొండ ఎమ్మెల్యేగా గెలిచిన సవితమ్మకు మంత్రి వర్గంలో స్థానం దక్కింది. ఈ నేపథ్యంలో పెనుకొండ నియోజకవర్గంలో పూర్తిగా పార్టీ కార్యకర్తలు రెండు వర్గాలుగా విడిపోయారు. సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్ల ముందే ప్రారంభమైన ఈ వర్గపోరు ప్రస్తుతం ముదిరి పాకాన పడుతోంది. పెనుకొండ నియోజకవర్గంలో అన్నింటా ఆధిపత్యం చాటుకోవాలని మంత్రి ప్రయత్నిస్తుండగా.. పట్టు నిలుబెట్టుకోవాలని బీకే వ్యూహాలు పన్నుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ కేడర్ రెండు వర్గాలుగా విడిపోయి బాహాబాహీకి దిగే పరిస్థితులు కనబడుతుండడం నేతలను కలవరపెడుతుందట.ప్రస్తుతం నియోజకవర్గంలో తన వర్గాన్ని బలోపేతం చేసుకునే పనిలో మంత్రి సవితమ్మ నిమగ్నమయ్యారట. చౌక దుకాణాల డీలర్ షాపులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు.. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు, సహా వివిధ పనులకు సంబంధించిన కాంట్రాక్టులు, పోలీసుస్టేషన్లో పంచాయితీలు.. ఇలా ప్రతి దాంట్లోనూ తన వర్గీయులకే పెద్దపీట వేస్తున్నారని చర్చ జరుగుతోంది. చివరకు ఉద్యోగుల బదిలీల్లోనూ తన మాటే నెగ్గేలా చూసుకున్నారని బీకే వర్గీయులు ఆరోపిస్తున్నారట. అన్నింటా తన పెత్తనమే సాగేలా మంత్రి సవిత వ్యవహరిస్తున్న తీరుపై.. ఎంపీ బీకేతో పాటు ఆయన వర్గీయులు రగిలిపోతున్నారట.హిందూపురం ఎంపీగా గెలిచినప్పటికీ సొంత ఇలాకా పెనుకొండలో తన మార్కు రాజకీయం కొనసాగించడానికి బీకే పార్థసారథి పూర్తి స్థాయిలో కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం ఎంపీ ల్యాడ్స్ నిధులనే కాకుండా కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా నిధులు తీసుకువచ్చి పనులు చేపట్టాలన్న ఆలోచనలో ఉన్నట్లు ఆయన వర్గీయులు చెబుతున్నారు. అలాగే బలమైన సామాజిక వర్గాల వారికి అవసరమైన పనులు చేసిపెట్టి.. వారి అండ కోసమూ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.మరోవైపు టీడీపీలో దశాబ్దాలుగా క్రియాశీలక కార్యకర్తలుగా ఉన్న కొందరు మంత్రిని కలసి తమకు కాంట్రాక్ట్ పనులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారట. అందుకు స్పందించిన మంత్రి.. మామ పార్థసారథితో ఫోన్ చేయించండి అని చెప్పినట్లు సమాచారం. దాంతో ఇప్పుడున్న పరిస్థితుల్లో బీకే చెప్పేది ఉండదు.. మంత్రి చేసేది ఉండదు..

అనుకోని నేతలు ఏం చేయాలో తెలియక అయోమయంలో ఉన్నారట. ఇద్దరు ముఖ్య నేతల మధ్య ఉన్న అంతర్గత విభేదాలతో.. కిందిస్థాయి కార్యకర్తలు, నాయకులు నలిగిపోతున్నారని వాపోతున్నారట. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చి. నేతలంతా మంచి జోష్ లో ఉన్న తరుణంలో.. తమ నియోజకవర్గంలో మాత్రం పార్టీలో అధికారం ఉందనే ఆనందం పొందలేకపోతున్నామని కొందరు కార్యకర్తలు చెబుతున్నారట.కోల్డ్ వార్ నడుస్తున్న తరుణంలోనే రీసెంట్ గా.. మరో వివాదంతో ఇద్దరి మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనేలా తయారయిందట పరిస్థితి. మంత్రి సవిత రొద్దం మండల కేంద్రంలో ఔఖీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని భావించారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఎన్టీఆర్ విగ్రహం భూమిపూజ సాక్షిగానే ఇరువర్గాలు గొడవకు దిగారు. ఎంపీ బీకే పార్థసారథిని ఎందుకు ఆహ్వానించలేదంటూ ఆయన వర్గీయుల నిరసనకు దిగారు.

ఈ వ్యవహారంలో ఎంపీ పార్థసారథి వర్గీయులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాంతో వీరిద్దరి మధ్య వార్ మరింత పీక్స్ కి చేరిందని చర్చించుకుంటున్నారు.

పెనుకొండలో ఇంత జరుగుతున్నా కానీ పార్టీ అధిష్టానం.. నోరు మెదపకపోవడం పట్ల నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారట. అయితే.. ఇక్కడి పరిణామాలపై సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. తగిన సమయంలో ఇరువురూ నాయకులకు క్లాస్ తీసుకోవచ్చని ప్రచారం నడుస్తోంది. మరి ఈ మామకోడళ్ల కోల్డ్ వార్ కి ఎప్పుడు బ్రేక్ పడుతోంది అని క్యాడర్ ఎదురుచూస్తుంది.

# 1931 జనాభా లెక్కలేనా....

దేశంలో సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించాలన్నా.. వెనుకబడిన వర్గాలు ముందుకు వెళ్లాలన్నా.. కులగణన ఒకటే మందు అని చాలా మంది నమ్ముతున్నారు. జమానా లెక్కలు కాకుండా లేటెస్ట్ సెన్సెస్ తోనే అసలైన పేదల గుర్తింపు సాధ్యమవుతుందన్నారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం చేయబోతున్న సర్వే దేశానికే రోల్ మోడల్ గా ఉంటుందంటున్నారుబీసీలకు రిజర్వేషన్లు, వారి జనగణన ఇష్యూ దేశవ్యాప్తంగా మరోసారి హాట్ టాపిక్ అవుతోంది. దేశంలో బీసీల జనాభా లెక్కలు తీయాలన్న డిమాండ్లు ఈనాటివి కావు. అయితే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మాత్రం ఈ లెక్కలు తీసేందుకు ముందుకు రావడం లేదంటున్నాయి విపక్షాలు. అసలు బీసీల్లో ఏయే కులాల్లో ఎంత మంది ఉన్నారన్న విషయం తెలిస్తే వారి సమగ్ర సంక్షేమానికి వీలవుతుందని బీసీ సంఘాల ఆలోచన. అందుకోసం బీసీ జనగణన ఒక్కటే మార్గమంటున్నారు.దేశ జనాభాలో ఎక్కువ శాతం బీసీలే ఉన్నారు. బీసీల సంఖ్య 70 కోట్ల ఉన్నట్లు ఓ అంచనా ఉంది. ఆ లెక్కన ఇది 56 శాతం. 90 ఏళ్ల నాటి డేటా ఆధారంగానే ఇప్పటికీ బీసీ రిజర్వేషన్లు కొనసాగుతున్నాయంటున్నారు. పదేళ్లకోసారి దేశంలో జనాభాను లెక్కిస్తున్నా.. అందులో దళితులు, గిరిజనుల సంఖ్యపై మాత్రమే స్పష్టమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. అయితే జనాభాలో ఓబీసీతో పాటు ఏ ఏ కులాల వారు ఎంతమంది ఉన్నారన్న సమగ్ర సమాచారం సేకరించడం లేదు. దేశంలో 1931లో చేసిన జనాభా లెక్కలే సంపూర్ణంగా కులగణనలతో చేసిన సమగ్ర లెక్కలుగా ఉన్నాయంటున్నారు.ఇప్పటికీ అవే ఆధారంగా మారాయి. 1979లో బీపీ మండల్ నేతృత్వంలో రెండో బీసీ కమిషన్ ను ఏర్పాటు చేశారు. ఈ కమిషన్ బీసీల జనాభాను 52 శాతంగా లెక్కగట్టి వీరికి విద్య, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని 1980లో రిపోర్ట్ ఇచ్చింది. ఈ సిఫార్సులు 1992 నుంచి అమల్లోకి వచ్చాయి. దేశంలో 3,743 కులాలను బీసీలుగా మండల్ కమిషన్ తేల్చింది. అయితే కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ లిస్టులో 2,479 కులాలు మాత్రమే ఉన్నాయి. సర్వే చేస్తేనే బీసీల్లో ఉన్న కులాల లెక్క తేలే ఛాన్స్ ఉందంటున్నారు.2017లో జస్టిస్ రోహిణి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ను నియమించింది. ఓబీసీ జాబితాను వర్గీకరించడం ఈ కమిషన్ పని. ఇప్పటికి ఈ కమిషన్ గడువును 13సార్లు పొడగించారు. ప్రస్తుతం బీసీల జనగణనపై కాంగ్రెస్, జేడీయూ, సమాజ్ వాదీ సహా మరికొన్ని పార్టీలు అగ్రెసివ్ గా వెళ్తున్నాయి. వీలైన ప్రతిసారీ మోడీ సర్కార్ పై ఒత్తిడి పెంచుతున్నాయి. బీసీ కుల గణనతో చాలా లాభాలు ఉన్నాయని బీసీ సంఘాలు, విపక్షాలు అంటున్నాయి. వెనుకబడిన మెజార్టీ ప్రజలకు ప్రభుత్వ పథకాలు సమర్థంగా అమలు చేయడం, జనాభాకు తగ్గట్లుగా విద్యా, ఉద్యోగాల్లో తగినంత ప్రాతినిధ్యం దొరకడం, బీసీల్లోని పేదలకు రిలీఫ్ లభిస్తుందని అంటున్నారు.సీన్ కట్ చేస్తే బీసీల లెక్కలు తీసేందుకు మోడీ ప్రభుత్వం ఎందుకు వెనకడుగు వేస్తోందన్న ప్రశ్నలు వస్తున్నాయి. కులగణనపై సుప్రీంకోర్టు అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం కులాల వారీగా వెనుకబడిన తరగతుల జనగణన చేపట్టడం పాలనాపరంగా కష్టమని తెలిపింది. అయితే దీన్ని విపక్షాలు, బీసీ సంఘాలు తప్పు బట్టాయి. బీసీ కులాల వారీ లెక్కలు తీస్తే అందరికీ రిజర్వేషన్లు కల్పించడం కష్టమన్న ఆలోచనతో ఉన్నారా అన్న డౌట్లు వస్తున్నాయి. ఇప్పటికే రిజర్వేషన్ల కోటా 50 శాతం దాటొద్దని సుప్రీం తీర్పు ఉంది. ఆ లెక్కన చూసినా ఈ సబ్జెక్ట్ ముట్టుకుంటే మొదటికే ఇబ్బంది వస్తుందన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం ఉందా అన్నది కీలకంగా మారింది.నిజానికి 2010లో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు.. ఇదే బీజేపీ నాయకులు.. బీసీ కులాల వారిగా లెక్కలు తీయాలని పార్లమెంటులో డిమాండ్ చేశారు. ఇప్పుడు అదే బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. అటు బీసీల కులాల వారీ జనాభా లెక్కలు తీయడంతో పాటే పార్లమెంట్ లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఆర్.కృష్ణయ్య వంటి నేతలు డిమాండ్ చేస్తున్నారు. లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తేలాలంటే, బీసీల లెక్కలు తప్పనిసరిగా ఉండాలని గతంలో సుప్రీం ఆదేశించింది. లేకపోతే రిజర్వేషన్లు లేకుండానే ఎన్నికలు జరపాలని గతంలో తీర్పు ఇచ్చింది. దీంతో చాలా రాష్ట్రాల్లో కన్ఫ్యూజన్ మొదలైంది. కొన్ని రాష్ట్రాలు సొంతంగా బీసీల లెక్కలు తీసే పనిలో పడ్డాయి. ఇక తెలంగాణలో ప్రతి ఇంటిలోని కుటుంబ సభ్యులను సర్వే చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఆయా ప్రాంతాలలోని జనాభాను బట్టి అక్కడ సిబ్బందిని నియమించారు. ఎన్యూమరేటర్ రోజువారీగా తనకిచ్చిన షెడ్యూల్ ప్రకారం సర్వే పూర్తయ్యే వరకు పనిచేస్తారు. నేటి నుంచి జరిగే ఈ సర్వేలో ప్రతి కుటుంబ యజమానిని నేరుగా ఎన్యుమరేటర్ కలిసి వివరాలు సేకరిస్తారు. యజమాని లేకుంటే తగిన ఆధారాలు చెప్పే ఏ కుటుంబ సభ్యుడున్నా సరిపోతుంది. ఇలా సేకరించిన సమాచారం మొత్తం ఈ నెల చివరి నాటికి ఆన్‌లైన్‌లో అప్లోడ్చేస్తారు. సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల, విద్య, ఉపాధి వంటి అంశాలను సేకరించనున్నారు.

వివరాల సేకరణ అనంతరం సంబంధిత ఇళ్లకు స్టిక్కర్లు అంటించనున్నారు. ఏ రోజు.. ఏ గ్రామంలో.. ఏ వార్డులో.. ఏ సమయంలో.. సర్వే చేయపట్టనున్నారనే సమాచారాన్ని ముందే ఆయా ప్రాంతాల్లోని వారికి చాటింపు, మైకుల్లో ప్రచారం ద్వారా తెలియజేస్తారు. సర్వేలో భాగంగా ఎలాంటి ఫొటోలు, గుర్తింపు పత్రాలు స్వీకరించరు.

## ఇక సినిమా చూపించబోతున్న హైడ్రా

హైదరాబాద్, నవంబర్ 6 అక్రమణలపై ఉక్కుపాదం మోపిన హైడ్రా.. కాస్త విరామం ఇచ్చింది. అతి త్వరలో అంతకుమించి అనేలా యాక్షన్ షురూ చేయబోతున్నట్టు తెలుస్తోంది. ఇందులోభాగంగా మియాపూర్ స్టాలిన్‌నగర్‌లోని సర్వే నంబర్ 100, 101లపై దృష్టి సారించింది. ఈ సర్వే నంబర్లలో దాదాపు 550 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో వంద ఎకరాలకు పైగా భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఇప్పుడా భూములపైనే ఆరాతీస్తోంది హైడ్రా.ఉమ్మడి రాష్ట్రంలో మియాపూర్ భూముల్ని వేలం వేసేందుకు అప్పటి ప్రభుత్వాలు ప్రతిపాదించాయి. అయితే సుప్రీంకోర్టులో కేసులు ఉండటంతో ఏమీ చేయలేకపోయారు. ఈ క్రమంలో అధికారులు చర్యలు తీసుకుంటే బాగానే ఉండేది. కానీ అంతులేని నిర్లక్ష్యం వహించడంతో కబ్జాకోరులు పేట్రేగిపోయారు. పక్కా సర్వే నంబర్లు, బై నంబర్లతో పెద్ద సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరిగాయి.ఇక మియాపూర్ భూములు తమకు ఇవ్వాలంటూ వేలాది మంది మహిళలు ఆక్రమించుకునేందుకు ప్రయత్నించడం అప్పట్లో హెచ్ఎండీఏను ఉలిక్కిపడేలా చేసింది. మొదట్లో గుడిసెలు వేసుకునేందుకు ప్రయత్నించారు వాళ్లంతా. ఆ తర్వాత గుడి నిర్మాణానికి సిద్ధమయ్యారు. వారిని సముదాయించేందుకు పోలీసులు అన్ని రకాల ప్రయత్నాలు చేశారు. 144 సెక్షన్ విధించినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో చివరకు లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చిందిపేదల దండయాత్రతో హెచ్ఎండీఏ అధికారుల్లో కదలిక వచ్చింది. ముందుగా భూముల లెక్క తీశారు. రికార్డుల్లో 105 ఎకరాలు మాయమై.. 445 ఎకరాలు ఉన్నట్టు గుర్తించారు. ఉన్న భూమిలో రెండు కోట్ల 65లక్షల రూపాయలతో ఫెన్సింగ్ వేయాలని టెండర్లు పిలిచారు. కానీ ఆ పనులు కూడా పట్టాలెక్కలేదు. చూస్తుండగానే వందెకరాలకు పైగా సర్కారు భూమి.. అక్రమార్కుల పాలయింది. ఎకరాకి కనీసం 30కోట్ల వరకు ఉంటుందని అంచనా. అంటే హెచ్ఎండీఏ అధికారుల నిర్లక్ష్యంతో 3వేల కోట్లకు పైగా విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయి. లేటెస్ట్‌గా ఈ కబ్జాకాండపై గురిపెట్టింది హైడ్రా. ప్రభుత్వ భూమి ఎంత.. కబ్జాకి గురైందన్న వివరాలు సేకరిస్తోంది.సర్వే నంబర్ 100, 101లో ఉన్న భూమి ఎంత? ఎన్ని ఎకరాల్లో నిర్మాణాలు వెలిశాయి? నిర్మాణాలు చేపట్టిన వాళ్లకు రిజిస్ట్రేషన్ చేసిందెవరు? ఏయే స్థాయి అధికారులు సహకరించారన్న కోణంలో హైడ్రా ఆరాతీస్తోంది. కూల్చివేతల మొదలయ్యాక ఎవరైనా కోర్టుకెళ్లినా.. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చాలా పకడ్బందీగా వ్యవహరిస్తోంది హైడ్రా. ఈ సారి కూల్చివేతలు మొదలెడితే.. ఎవరొడ్డొచ్చినా ఆగేదేలే అన్నట్టుగా ముందుకెళ్లాలని భావిస్తోంది హైడ్రా..

## శ్రీవారిని దర్శించుకున్న అల్లు అర్జున్ సతీమణి

తిరుమల ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ సతీమణి స్నేహ రెడ్డి సన్నిహితులతో కలిసి బుధవారం వేకువజామున సుప్రభాత సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆమెకు రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ అధికారులు పట్టు వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల భక్తులు అభిమానులు సెల్ఫీలు దిగారు.

# కేంద్రంలో 9. 7 లక్షల ఖాళీ

న్యూఢిల్లీ, నవంబర్ 6, కేంద్ర ప్రభుత్వం సిబ్బంది కొరతను ఎదుర్కొంటోంది. ఇందుక్కారణం పెద్ద సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉండడమే. ప్రతి 4 పోస్టులకు 1 ఖాళీగా ఉందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వేతనాలు, భత్యాలు అంశంపై కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం 2023 మార్చి 1 నాటికి కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో 24% పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే మంజూరైన పోస్టుల సంఖ్య కూడా క్రమేణా తగ్గిపోతుందని నివేదిక పేర్కొంది. నివేదిక ప్రకారం కేంద్ర పాలిత ప్రాంతాలను కలుపుకుని కేంద్ర ప్రభుత్వంలో మొత్తం 40 లక్షల సాధారణ ఉద్యోగాలు ఉన్నాయి. అంటే ఇవి కేంద్ర హోంశాఖ, రక్షణ శాఖ పరిధిలో ఉన్న సాయుధ బలగాల పోస్టులతో సంబంధం లేనివి. వీటిలో 9.7 లక్షల పోస్టులు ఖాళీగా పడి ఉన్నాయి. అంటే మొత్తం పోస్టులు 40 లక్షలతో పోల్చితే దాదాపుగా నాలుగో వంతు.ఈ ఖాళీల్లో అత్యధికంగా గ్రూప్-అ (నాన్ గెజిటెడ్) కేటగిరీలో 33 శాతానికి పైగా ఖాళీలు ఉండగా, గ్రూప్-ః (గెజిటెడ్)లో 16% వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంత పెద్ద సంఖ్యలో ఖాళీలు ఏర్పడడానికి కారణాలను నివేదికలో ప్రస్తావించినప్పటికీ.. నియామక ప్రక్రియలో జాప్యమే ఖాళీల సంఖ్య పెరగడానికి ముఖ్య కారణమని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. పదవీ విరమణల కారణంగా ఏర్పడుతున్న ఖాళీలను ఆ మేరకు భర్తీ చేయకుండా, ఆ పని చేసేందుకు వివిధ ఏజెన్సీలకు ఔట్ సోర్సింగ్ ఇవ్వడం కూడా ఒక కారణమని ఆరోపిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్ట్ పద్ధతిలో కొందరిని, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కొందరిని తీసుకుంటున్నాయి. ఈ విధానం ప్రభుత్వాలపై ఆర్థిక భారాన్ని చాలా వరకు తగ్గిస్తున్నాయి. మరోవైపు రోజువారీ ప్రభుత్వ కార్యాకలాపాలు ఎలాంటి ఆటంకం లేకుండా సాగిపోతున్నాయి. దీంతో ప్రభుత్వాలు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాలకే ఎక్కువగా మొగ్గుచూపుతున్నాయి.ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని ఖాళీలను భర్తీ చేసే ప్రక్రియను కూడా కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. 'పీఎం రోజ్‌గార్ మేళా' పేరుతో వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఖాళీలను భర్తీ చేస్తోంది. అలా నియమించినవారికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నియామక పత్రాలను అందించారు. ఇలా ఇప్పటి వరకు 13 రోజ్‌గార్ మేళాలను నిర్వహించగా.. చివరి మేళాలో 51,000 మందికి నియామక పత్రాలను కేంద్ర ప్రభుత్వం అందజేసింది.కేంద్ర ప్రభుత్వంలో సాయుధ బలగాలను మినహాయించి సాధారణ ప్రభుత్వ ఉద్యోగాల్లో అత్యధిక సంఖ్యలో సిబ్బందిని కలిగిన శాఖలు 5 ఉన్నాయి. వాటిలో మొదటి స్థానం రైల్వేదే. ఆ తర్వాత రక్షణ శాఖ (సివిల్), హోంశాఖ, పోస్టల్, రెవెన్యూ విభాగాలున్నాయి. ఈ 5 విభాగాలు కలిపి మొత్తం సిబ్బంది సంఖ్యాబలంలో 92% ఉన్నాయంటే ఇవి ఎంత పెద్ద విభాగాలో అర్థం చేసుకోవచ్చు.ప్రతి 10 కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో దాదాపు 4 ఉద్యోగాలు రైల్వే రైల్వే ఒక్కటే అందిస్తుంది. గణాంకాల ప్రకారం రైల్వే శాఖలో మొత్తం 14.89 లక్షలకు పైగా పోస్టులు ఉండగా.. ప్రస్తుతం ఉన్న సిబ్బంది 11.73 లక్షలు మాత్రమే. అంటే ఒక్క రైల్వే శాఖలోనే 3 లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ నివేదిక స్పష్టం చేస్తోంది. మరోవైపు హోం మంత్రిత్వ శాఖలో 11.12 లక్షల పోస్టులు ఉండగా.. ప్రస్తుత సంఖ్య 9.84 లక్షల వరకు ఉంది. ఈ లెక్కన ఈ శాఖలో దాదాపు 1.28 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.రక్షణశాఖలో ఉన్న సివిలియన్ పోస్టులు 5.77 లక్షలు ఉండగా.. వీటిలో 2.44 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇదే మాదిరిగా పోస్టల్, రెవెన్యూ విభాగాల్లోనూ ఖాళీలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి.కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో జీతం మరియు భత్యం (బోనస్, తాత్కాలిక బోనస్, గౌరవ వేతనం, సంపాదించిన సెలవులు మరియు ట్రావెలింగ్ అలవెన్స్‌లు మినహా) మొత్తం వ్యయం 7 శాతానికి పైగా పెరిగిందని నివేదిక పేర్కొంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ. 2.56 లక్షల కోట్ల మేర కేంద్ర ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పడగా.. ఇప్పుడు అది రూ. 2.75 లక్షల కోట్లకు చేరుకుంది. వీటిలో 80% మేర నాలుగు మంత్రిత్వ శాఖలు ? రైల్వేలు, రక్షణ (సివిల్), హోం వ్యవహారాలు మరియు పోస్టల్ విభాగాలకు ఖర్చు చేయాల్సి వస్తోంది.ఇదిలా ఉంటే.. విద్యావ్యవస్థలో ఖాళీలపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖలో.. ముఖ్యంగా దేశంలోని 46 సెంట్రల్ యూనివర్సిటీల్లో 27 శాతం అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. వీటిలో అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వంటి రిజర్వుడు వర్గాల పోస్టులే ఖాళీగా ఉన్నాయని విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బదులిస్తూ.. 2014 నాటికి సెంట్రల్ యూనివర్సిటీల్లో మొత్తం 37 శాతం పోస్టులు ఖాళీలు ఉన్నాయని, అది ఇప్పుడు 26.8% కు చేరుకుందని తెలిపారు.

అంటే యూపీఏ హయాంలోనే ఎక్కువ ఖాళీలు ఉండగా.. తాము వాటిని భర్తీ చేస్తూ ఖాళీల సంఖ్యను గణనీయంగా తగ్గించామని వివరించారు. మొత్తంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

# బయటకొచ్చిన విజయమ్మ,,,



విజయవాడ, నవంబర్ 6, గత కొద్దిరోజులుగా తన వాహనం పాడైపోయిన ఘటనకు సంబంధించి జరుగుతున్న ప్రచారానికి చెక్ పెట్టేందుకు విజయమ్మ నేరుగా రంగంలోకి దిగారు. మీడియాకు ఒక వీడియోను పంపించారు. అందులో విజయమ్మ అనేక విషయాలపై స్పష్టత ఇచ్చారు.

ఆమె లేఖ రాసిన విధానాన్ని సాక్షి తప్పు పట్టింది. జగన్మోహన్ రెడ్డి బెయిల్ రద్దుకు జరుగుతున్న కుట్రలో విజయమ్మకు కూడా పాత్ర ఉందని ఆరోపించింది. వాస్తవానికి ఆ పరిణామం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో సంచలనంగా మారింది. దీనిని ఓవర్గం మీడియా విపరీతంగా ప్రచారం చేసింది. ఇదే క్రమంలో ఆమధ్య విజయమ్మ వాహనం పాడైపోతే.. దాని వెనుక రకరకాల కథనాలు అల్లింది. ఇక సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం తారాస్థాయికి వెళ్ళింది. ఒక పార్టీ అయితే విజయమ్మ కారు పాడైన ఘటనను మరో విధంగా చిత్రీకరించింది. ఆ పార్టీ అనుకూల సోషల్ మీడియా విభాగం నాయకులైతే మరింత విష ప్రచారానికి దిగారు. ఇది జగన్మోహన్ రెడ్డికి మరింత వ్యతిరేకంగా మారింది. దీనిపై ఏ ఒక్క వైసీపీ నాయకుడు స్పందించలేదు. ఇదే అదునుగా ఓ పార్టీ నాయకులు మరింత రెచ్చిపోయారు. సరికొత్త ఆధారాలతో సోషల్ మీడియాలో రకరకాల ప్రచారాలు చేయడం మొదలుపెట్టారు. అంతేకాదు విజయమ్మ విదేశాలకు వెళ్లడం వెనుక కూడా సంచలన కారణాలు ఉన్నాయని రకరకాల వ్యాఖ్యానాలు చేశారు. అయితే దీనిపై నిన్నటి వరకు ఎవరూ స్పందించలేదు. అయితే ఇప్పుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి మాతృమూర్తి విజయమ్మ స్పందించారు. స్వయంగా ఒక వీడియో కూడా విడుదల చేశారు. అది ఇప్పుడు మీడియాలో సంచలనంగా మారింది.కొద్దిరోజులుగా తన వాహనం పాడైపోయిన ఘటనకు సంబంధించి జరుగుతున్న ప్రచారానికి చెక్ పెట్టేందుకు విజయమ్మ నేరుగా రంగంలోకి దిగారు. మీడియాకు ఒక వీడియోను పంపించారు. అందులో విజయమ్మ అనేక విషయాలపై స్పష్టత ఇచ్చారు.." నా వాహనం పాడైతే.. దానిని ఏదో ఘటనకు ముడిపెట్టారు. నేను నా మనవడి దగ్గరికి వెళ్తే మరో విధంగా ప్రచారం చేస్తున్నారు.. ఏ ఇంట్లో అయినా అభిప్రాయ భేదాలు ఉంటాయి. వ్యక్తుల మధ్య భిన్న అభిప్రాయాలు ఉంటాయి. దానిని గౌరవించాలి. ఆస్తుల విషయంలో షర్మిల, జగన్ మధ్య విభేదాలు ఉన్నది వాస్తవం.. అవి మీ కుటుంబాలలో జరగడం లేదా? అలాంటివి మీ కుటుంబాలలో చోటు చేసుకోవడం లేదా? దీనిని భూతద్దంలో పెట్టి ఎందుకు చూస్తారు.. వ్యక్తిత్వ హననానికి ఎందుకు పాల్పడతారు? మీడియా వార్తలు రాస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఎలాంటి వార్తలు రాస్తున్నామో ఒకసారి చెక్ చేసుకోవాలి. ఇష్టానుసారంగా ఎదుటి వ్యక్తుల జీవితాలను నాశనం చేయొద్దు. వారి జీవితాలను ప్రభావితం చేసే విధంగా వార్తలను రాయకూడదు. ఇటీవల నా వాహనం పాడైపోయిన ఘటనకు సంబంధించి రకరకాల వార్తల వినిపిస్తున్నప్పుడు నేనే లేఖ రాశాను. ఆ లేఖ ఫోర్జరీ కాదు. అందులో ఉన్న సంతకం కూడా నాదే. దీనిపై కూడా రకరకాల వక్రీకరణలు చేస్తున్నారు. ఇది సరైన చర్య కాదని" విజయమ్మ ఆ వీడియోలో వ్యాఖ్యానించారు.విజయమ్మ వీడియో ద్వారా ఎన్ని రోజులపాటు రకరకాల ప్రచారాలు చేసిన వారికి చెంపపెట్టు లాంటి సమాధానం లభించినట్లు అయిందని వైసీపీ నాయకులంటున్నారు. ఇన్ని రోజులపాటు జగన్మోహన్ రెడ్డిని అకారణంగా విమర్శించారని.. ఇప్పుడు నేరుగా వారి అమ్మే స్పష్టత ఇచ్చిందని.. ఇంకా వీటికి ఎలాంటి రుజువులు కావాలని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలుకుతున్నారు.. త్వరలోనే జగన్, షర్మిల మధ్య ఆస్తుల వివాదం ముగుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఆశా వర్కర్ ను వేధిస్తున్న ఏఎన్ఎం పై చర్యలు తీసుకోవాలి

## ఆశా వర్కర్స్ నేత ఏ కమల డిమాండ్




నందిగామ మండలం లింగాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో లింగాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.కమల మాట్లాడుతూ లింగాలపాడు పీహెచ్సీ పరిధిలో అంబారుపేట వెల్నెడ్ సెంటర్లో వనజ నాగమణి అనే ఆశ వర్కర్లు గత 16 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని ఐదు సంవత్సరాల నుండి అంబారుపేట ఏఎన్ఎం ఎస్ విజయ్ కుమారి ఆశా వర్కర్లను వేధిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ సమస్యపై అనేకసార్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ దృష్టికి జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లారని అయినా సమస్య పరిష్కారం కాలేదని ప్రాథమిక విచారణ జరిపి చేతులు దులుపుకోవడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా కమిటీ వెంటనే ఎంక్వైరీ కమిటీ ఏర్పాటు చేసి పూర్తి విచారణ జరిపి సంబంధిత ఏఎన్ఎం గారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. లేనిపక్షంలో అక్టోబర్ 18 వ తేదీ తర్వాత ఏ రోజు నిండు అయినా లింగాలపాడు పీపీసీ పరిధిలోని ఆశలు తమ విధులను బహిష్కరించి ఆందోళన చేస్తారని డిమాండ్ చేశారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రాతపూర్వక హామీల్లో భాగంగా ఆశ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని. రిటైర్మెంట్ బెనిఫిట్స్ మెడికల్ మేటర్నిటీ సెలవులు సాధారణ సెలవులు రికార్డులు నాణ్యమైన ఫోన్లు సిములు ఇవ్వాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని. వయోపరిమితి పెంచాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం. నవంబర్ 18 వ తారీఖున రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల దగ్గర ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని. ఈ ధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆశ వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కటారపు గోపాల్ మరియు సిఐటియు నాయకులు కరి వెంకటేశ్వరరావు ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు వనజ, తిరుమల దేవి, నాగమణి,కవిత, తదితరులు పాల్గొన్నారు.

# 100 కోట్ల స్ట్రాటజీ లెక్కలు చెప్పిన పీకే..



న్యూఢిల్లీ, నవంబర్ 6, (న్యూస్ పల్స్)దేశవ్యాప్తంగా కీలక రాష్ట్రాల్లో గెలుపు కోసం పనిచేసిన ఆయన.. 2023లో కీలక నిర్ణయం తీసుకున్నారు. తన ఐ-ప్యాక్ వ్యూహకర్త బాధ్యతల నుంచి తప్పుకున్నారు. తానే స్వయంగా ఓ పార్టీని ప్రకటించారు. జన సూరజ్ పేరిట కొత్తగా పార్టీని పెట్టారు. ఈ మేరకు బిహార్ రాష్ట్రంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఆయన పాదయాత్ర సైతం చేశారు. సక్సెస్‌ఫుల్ ఎన్నికల స్ట్రాటజిస్ట్‌గా ప్రశాంత్ కిషోర్‌కు మంచి పేరుంది. ఆయన ఏ రాష్ట్రంలో ఏ పార్టీ తరఫున పనిచేసినా.. అక్కడ ఆ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్న భరోసా ఉంది. అలా దేశవ్యాప్తంగా ఆయన పలు కీలక పార్టీలకు సలహాదారుగా పనిచేశారు. అంతేకాకుండా 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలో రావడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. బీజేపీకి సలహాదారుగా పనిచేసి.. కేంద్రంలో అధికారంలోకి రావడానికి ఎంతగానో దోహదపడ్డారు. అలాగే.. 2019 ఎన్నికల్లో ఏపీలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సలహాదారుగా పనిచేశారు. ఆ సమయంలోనూ జగన్ అధికారంలోకి వచ్చారు. ఆ తరువాత ఎన్నికల్లో పీకే చంద్రబాబు వెంట నడిచారు. ఆయన సలహాదారుగా పనిచేయడంతో పోయిన ఎన్నికల్లో చంద్రబాబు అధికారాన్ని కైవసం చేసుకున్నారు. ఇక 2015లో బిహార్ ఎన్నికల్లో జేడీయూ-ఆర్జేడీల మహాఘట్ బంధన్‌కు వ్యూహకర్తగా పనిచేశారు. 2017లో పంజాబ్ ఎన్నికల్లో కాంగ్రెస్ కోసం పనిచేశారు. ఇక.. 2020 ఎన్నికల్లో ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీకి వ్యూహకర్తగా పనిచేసి ఆ పార్టీ ఘన విజయానికి కారణం అయ్యారు. అలాగే.. 2021లో తమిళనాడులో డీఎంకే, పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ గెలుపు కోసం కృషి చేశారు.దేశవ్యాప్తంగా కీలక రాష్ట్రాల్లో గెలుపు కోసం పనిచేసిన ఆయన.. 2023లో కీలక నిర్ణయం తీసుకున్నారు. తన ఐ-ప్యాక్ వ్యూహకర్త బాధ్యతల నుంచి తప్పుకున్నారు. తానే స్వయంగా ఓ పార్టీని ప్రకటించారు. జన సూరజ్ పేరిట కొత్తగా పార్టీని పెట్టారు. ఈ మేరకు బిహార్ రాష్ట్రంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఆయన పాదయాత్ర సైతం చేశారు. ఇప్పుడు అక్కడ పలు స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇటీవల బిహార్‌లోని బెలాగంజ్‌లో పీకే మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన ఏదైనా పార్టీకి వ్యూహకర్తగా పనిచేస్తే ఎంత తీసుకుంటారనే దానిపై రకరకాల ప్రచారాలు వినిపించాయి. కానీ.. తాను తీసుకునే రెమ్యునరేషన్‌పై పీకే ఒక్కసారిగా నోరుజారారు.తాను ఏ పార్టీకి వ్యూహకర్తగా పనిచేసినా అందుకు ఫీజు కింద రూ.100 కోట్లు వసూలు చేస్తానని పీకే ఆ ప్రచారంలో భాగంగా చెప్పారు. కొన్ని పార్టీల వద్ద అంతకన్న ఎక్కువే తీసుకుంటానని వ్యాఖ్యలుచేశారు. దేశంలో పది ప్రభుత్వాలు తన వ్యూహాలతోనే అధికారంలో కొనసాగుతున్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక పార్టీకి ఎన్నికలకు వ్యూహకర్తగా పనిచేస్తే.. తన పార్టీని రెండేళ్ల పాటు నడిపించవచ్చని అన్నారు. అయితే.. పీకే వ్యాఖ్యలతో ఇప్పుడు ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న.. గతంలో అధికారంలో కొనసాగిన పార్టీలు గందరగోళంలో పడ్డాయి. పీకేకు ఇవ్వడానికి ఆ పార్టీల దగ్గర రూ.100 కోట్లు ఎక్కడివి..? దేని ద్వారా వాటిని సేకరించారు..? పీకేకు చెల్లించిన మొత్తాన్ని ఎన్నికల ఖర్చుల్లో చూపించారా..? అన్న ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. ఒకవేళ చూపించనట్లయితే ముందు ముందు ఎన్నికల కమిషన్ ఆయా పార్టీల పట్ల ఏమైనా చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయా..? అన్న సందేహాలూ వినిపిస్తున్నాయి. అటు పార్టీలు సైతం రూ.100 కోట్ల అంశంపై ఎలా స్పందిస్తాయో చూడాలి మరి. మొత్తానికి పీకే వ్యాఖ్యలు ఆయా పార్టీలు తప్పనిసరిగా సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితిని తెచ్చాయని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# తెలంగాణ డబ్బులతో మహారాష్ట్ర, జార్ఖాండ్ లో యాడ్స్

హైదరాబాద్, నవంబర్ 6, తెలంగాణ ప్రజల సొమ్ముతో మహారాష్ట్రలో యాడ్స్.. ఏంటి రేవంతన్నా ఇదీ!తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలైంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే కొన్ని అమలవుతున్నాయి తెలంగాణాలో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇందుకు కారణం ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఒక కారణమైతే.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోవడం.. కేసీఆర్ అహంకార పూరిత పాలనపై ఆగ్రహంగా ఉండడం కూడా కాంగ్రెస్ గెలుపునకు దోహందం చేశాయి. ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ.. రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో ఎన్నికల హామీలు నెరవేర్చడంపై రేవంత్ సర్కార్ దృష్టిపెట్టింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఇటీవలే రైతుల పంట రుణాలు మాఫీ చేశారు. అయితే పూర్తిస్థాయిలో జరగలేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇక ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ల పెంపు, రేషన్ కార్డుపై సన్నబియ్యం, విద్యార్థులకు స్కూటీలు ఇవ్వలేదు. ఖరీఫ్‌లో రైతులకు పెట్టుబడి సాయం చెల్లించలేదు. వీటిపై విపక్ష బీఆర్ఎస్, బీజేపీ ఆందోళనలు చేస్తున్నాయి. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని, ఇప్పుడు సన్న వడ్లకు ఇస్తామని మాట మార్చారు. ఇలాంటి పరిస్థితిలో మన పొరుగు రాష్ట్రం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. నవంబర్ 13న ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో తెలంగాణ కాంగ్రెస్ నేతలు మహారాష్ట్రతోపాటు జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు.ఇదిలా ఉంటే.. తెలంగాణ నేతలు ప్రచారానికి పరిమితం కాకుండా.. తెలంగాణ ప్రజల సొమ్ముతో మహారాష్ట్ర పత్రికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాలు, గొప్పలు, తెలంగాణలో అమలవుతున్న పథకాల గురించి ప్రకటనలు ఇస్తున్నారు. మరాఠా ఓటర్లను ఆకట్టుకునే ప్రనయత్నం చేస్తున్నారు. దీనిపై ప్రజలు మండిపడుతున్నారు. విపక్ష బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మహారాష్ట్రలో ఏం చేస్తారో చెప్పకుండా.. తెలంగాణలో అది చేశాం.. ఇది చేశాం అని గొప్పలు చెప్పడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇందుకు తెలంగాణ ప్రజల సొమ్ము వినియోగించడంపై మండిపడుతున్నారు.తెలంగాణ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఇంకా అమలు కాలేదు. అనేక హామీలు హామీలుగానే ఉన్నాయి. ఈ క్రమంలో రేవంత్ సర్కార్ మహారాష్ట్రలో తెలంగాణలో అన్నీ చేశామని ప్రచారం చేసుకోవడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. తప్పుడు ప్రచారంతో మహారాష్ట్ర ప్రజలను మోసం చేయాలని చూస్తోందని విమర్శించారు. అబద్ధాలు చెప్పడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌ను మించిపోయిందని పేర్కొన్నారు. మాజీ సర్పంచుల కోసం బీఆర్ఎస్ ఆందోళన చేయడంపై మండిపడ్డారు. గతంలో బిల్లులు పెండింగ్‌లో పెట్టిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని తెలిపారు. చంపినోడే సంతాప సభ పెట్టిన్లు బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని మండిపడ్డారుఇక రేవంత్‌సర్కార్ తలపెట్టిన మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు ఓ కాంగ్రెస్ నేత అల్లు కోసమే అని బండి సంజయ్ ఆరోపించారు. రూ.15 వేల కోట్లు ఖర్చు చేయాల్సిన దానికి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు పెడతామని అంటున్నారని తెలిపారు. శంషాబాద్ ఆంజనేయస్వామి ఆలయంపై దాడిని కండించారు. హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువులంతా రెడ్డెక్కే పరిస్థితి తెచ్చుకోవద్దని హెచ్చరించారు.

## ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం

## ఇతర ఆసుపత్రులకు రోగుల తరలింపు



నంద్యాల పట్టణం శ్రీనివాస్ నగర్ లోని మోర్ సూపర్ మార్కెట్ పైన విజైబాబు ఆసుపత్రిలో బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. అగ్ని మాపక దళ సిబ్బంది, పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు. ఆసుపత్రిలోని రోగులను ఇతర ప్రయివేటు ఆసుపత్రులకు అంబులెన్సుల ద్వారా తరలించారు. నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి నంద్యాలలోని డాక్టర్ విజైబాబును ఫోన్ లో పరమార్శించి రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

# ఇంటి స్థలం ఉన్నవారికి ప్రాధాన్యం , ఇందిరమ్మ ఇళ్ల మార్గదర్శకాలు

హైదరాబాద్, నవంబర్ 6, తెలంగాణలో ఇప్పటి వరకు ప్రభుత్వ పథకాలు అమలు ఒక ఎత్తు అయితే ఇప్పుడు అమలు చేయబోయే ఇందిరమ్మ ఇళ్ల పథకం మరో ఎత్తు. ఎక్కువ మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. అందుకే నిబంధనల్లో కాస్త సడలింపులు ఇస్తోంది. రేషన్ కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడానికి సిద్ధమవుతున్న మంత్రి ప్రకటించారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో మాట్లాడిన గృహ నిర్మాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ గుడ్ న్యూస్ చెప్పారు. రేషన్ కార్డు లేకపోయిన పేదలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. అయితే మొదటి విడతకు మాత్రమే ఇది పరిమితం అవుతుందని తెలిపారు మంత్రి. ప్రస్తుతం జరుగుతున్న కుటుంబ సర్వే పూర్తి అయిన తర్వాత అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చేస్తామని మంత్రి తెలిపారు. ప్రస్తుతానికి అందరికీ రేషన్ కార్డులు లేనందున ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో దీన్ని చేర్చడం లేదన్నారు. తర్వాత విడుత నుంచి మాత్రం రేషన్ కార్డు కంపల్సరీ చేయబోతున్నట్టు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ఎప్పుడే ప్రారంభించిన ప్రభుత్వం తొలి విడతలో ఇంటి స్థలం ఉండి గృహాలు లేని వారిపై ఫోకస్ పెట్టింది. వీళ్లకు ఇళ్లు కట్టించే ఇచ్చే బాధ్యత భుజాన వేసుకుంది. రెండో విడతలో స్థలం కూడా లేని వారికి ఇళ్లు కట్టించి ఇస్తారు. నవంబర్ ఆరు నుంచి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రారంభమవుతుంది. దీని కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. ఒకసారి సమాచారం సేకరించిన తర్వాత దాని ఆధారంగా గ్రామసభలు ఏర్పాటు చేసి అర్హులను నిర్ణయిస్తారు. నవంబర్ 15వ తేదీ నుంచి 20 మధ్య ఈ గ్రామసభలు జరగనున్నాయి. గ్రామస్థలు సమక్షంలో అర్హులు ఖరారైన తర్వాత వారికి స్థలం కేటాయిస్తారు. కేంద్రం చెప్పిన నిబంధనల ప్రకారం 80 గంజాల వరకు స్థలం ఇస్తారు. ఆయా గ్రామాల్లో స్థలం అందుబాటులో ఉంటే సరేసరి లేకుంటే కొనుగోలు చేసి లబ్ధిదారులకు ఇస్తారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అక్రమాలకు అవకాశం లేకుండా ఉండేందుకు జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో పర్యవేక్షణకు అధికారులను ప్రభుత్వం నియమించనుంది. ఈ నిర్మాణాలకు ఉచితంగా ఇసుక, రాయితీపై మిగతా నిర్మాణ సామగ్రి సప్లై చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. నియోజకవర్గానికి తొలి దశలో 3,500 ఇళ్లు కేటాయించి అవి నిర్మాణాల పూర్తి అయిన తర్వాత రెండో విడత లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఇలా ఐదేళ్లలో తెలంగాణ వ్యాప్తంగా 20 లక్షల ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# రెండో రాజధాని అడుగులు

వరంగల్, నవంబర్ 6 తెలంగాణలో రెండో రాజధాని ఏదంటే, ఎవరైనా వెంటనే వరంగల్ అని చెప్పేస్తారు. హైదరాబాద్, సికింద్రాబాద్ మాదిరిగా వరంగల్, హన్మకొండ కలిసిపోయి విస్తరిస్తున్నాయి. పైగా, కాకతీయులు ఏలిన చారిత్రక నగరం కావడంతో భౌగోళికంగా కూడా వరంగల్ ఎంతో స్పెషల్. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ పెట్టింది. ఇప్పటికే సీఎం దీనిపై అధికారులకు ఆదేశాలు కూడా ఇచ్చారు. హెరిటేజ్ సిటీగా తీర్చిదిద్దేందుకు అన్ని ప్రణాళికలు రచించాలని చెప్పారు. ఈ క్రమంలోనే వడివడిగా అడుగులు పడుతున్నాయి. చారిత్రక నేపథ్యం ఉన్న వరంగల్ నగర అభివృద్ధికి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విజన్ 2050తో ముందుకెళ్తోంది ప్రభుత్వం. అప్పటి జనాభాను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన మాస్టర్ ప్లాన్ కూడా తుది దశకు చేరుకుంది. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మాస్టర్ ప్లాన్‌ను విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించి వరంగల్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక సమావేశం నిర్వహించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్డీలో వరంగల్, హన్మకొండ జిల్లాల అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన మాస్టర్ ప్లాన్, వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్, భద్రకాళి టెంపుల్ అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, మెగా టెక్స్‌టైల్ పార్క్, మామునూరు ఎయిర్ పోర్ట్, ఎకో టూరిజం తదితర అంశాలపై ప్రధానంగా చర్చించారు. హైదరాబాద్ నగరానికి ధీటుగా వరంగల్‌ను అభివృద్ధి పరచాలన్న కృతనిశ్చయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు పొంగులేటి. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న వరంగల్ మాస్టర్ ప్లాన్‌ను తమ ప్రభుత్వం కొలిక్కి తీసుకువచ్చిందని చెప్పారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్‌కు అవసరమైన భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 41 కిలోమీటర్ల పరిధి ఉన్న వరంగల్ ఔటర్ రింగ్ రోడ్డును మూడు దశల్లో చేపట్టాలని మొదటి దశలో 20 కిలో మీటర్లు, రెండవ దశలో 11 కిలోమీటర్లు, మూడవ దశలో 9 కిలోమీటర్లు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. హైదరాబాద్ మినహా రాష్ట్రంలో మరెక్కడా సరైన ఎయిర్‌పోర్ట్ లేదు. అయితే, వరంగల్ జిల్లాలో రాబోతోందని, వీలైనంత త్వరగా పనులను ప్రారంభించి ఏడాదిలోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు పొంగులేటి. 382 ఎకరాల పరిధిలో ఉన్న చారిత్రాత్మకమైన భద్రకాళి చెరువులో పేరుకుపోయిన పూడికను తీయాలని, ఇందుకు సంబంధించిన పనులను వెంటనే మొదలు పెట్టాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చెరువును ఖాళీ చేయాలని అధికారులకు సూచించారు. ఈ చెరువు 40 శాతం గుర్రపుడెక్కతో నిండిపోయిందన్నారు. మెగా టెక్స్ టైల్ పార్క్ లో ఏర్పాటు చేసిన కంపెనీలు తప్పనిసరిగా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

## ఎమ్మెల్యేలకు ఎదురు తిరిగిన ద్వితీయ శ్రేణి నాయకులు





నల్గొండ, నవంబర్ 6, సమగ్ర కుటుంబ సర్వేపై పార్టీ కార్యకర్తల్లో అవగాహన కల్పించి గ్రామాల్లో ప్రజలకు వివరించేందుకు అధికార కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాల వారీగా కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశాలను నిర్వహించింది. ఈ సమావేశాలకు ఆయా జిల్లాల పరిధిలోని ఎమ్మెల్యేలు కూడా హాజరయ్యారు. మూడు రోజుల కిందట నల్గొండ జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం నల్గొండ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ నాయక్ హాజరయ్యారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి (నల్గొండ ఎమ్మెల్యే), మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఈ సమావేశానికి గైర్హాజర్ అయ్యారు. సమగ్ర కుటుంబ సర్వే, కుల గణనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజలకు ఏ విధంగా అవగాహన కల్పించాలన్న అంశాలపై ముఖ్య కార్యకర్తల కోసం నిర్వహించిన సమావేశంలో కేడర్ అంతా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తీరుపై, హామీల విస్మరణపై భగ్గు మంది. ఎమ్మెల్యేలను నిలదీస్తూ ముఖ్య కార్యకర్తలు మాట్లాడిన వీడియో ఒకటి మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బీఆర్ఎస్ సోషల్ మీడియా వింగ్ ఈ వీడియోను వైరల్ చేస్తోంది. పార్టీ పరిస్థితిపై మాట్లాడేందుకు అవకాశం వచ్చిన జిల్లా కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నాయకత్వం ప్రభుత్వ పాలనపై విరుచుకు పడింది. నల్గొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రధాన అనుచర నాయకుడు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గుమ్మల మోహన్ రెడ్డి ముందుగా ఈ అంశాలను లేవనెత్తారు. ఆయనను మరికొందరు నాయకులు కూడా అనుసరించి తమ గోడును వెళ్లబోసుకున్నారు. అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పది నెలల పాలనా కాలం ముగిసినా అమలు చేయకపోవడాన్ని నిరసించారు. పెన్షన్లు ఎందుకు పెంచలేదు..? గ్యాస్ డబ్బులు ఎందుకు రావడం లేదు..? ఉచిత కరెంటు ఇంకా అందరికి అందడం లేదు. ఆరు గ్యారంటీలేమయ్యాయి..? అంటూ వారు ఎమ్మెల్యేలను నిలదీశారు. " కేడర్ అంతా ఊరూరూ.. పల్లె పల్లెకు తిరిగి పనిచేస్తేనే మీరు ఎమ్మెల్యేలుగా గెలిచారు. కానీ, పార్టీ ఇచ్చిన హామీలు ఏవీ అమలు కావడం లేదు. ఊళ్లలో ప్రజల ముందు తలెత్తుకోలేక పోతున్నాం.." అంటూ ముఖ్య కేడర్ అసంతృప్తి వ్యక్తం చేసింది. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ వరి ధాన్యం దిగుబడులు వచ్చాయి. కొనుగోలు కేంద్రాల్లో ఇరవై రోజులుగా రైతులు పడిగాపులు గాస్తున్నారు. ఎందుకు త్వర త్వరగా ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించడం లేదంటూ రైతులు వేస్తున్న ప్రశ్నలకు సమాధం చెప్పలేక పోతున్నామని వాపోయారు. ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచే పౌరసరఫరాల శాఖా మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నా లాభం లేకుండా పోయిందని విరుచుకుపడ్డారు. సన్నాలకు ఇస్తామన్న రూ. 500 బోనస్ సంగతి కూడా మర్చిపోయారని, నిత్యం భారీగా కురుస్తున్న వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లోని కళ్లాల్లో ధాన్యం తడిచిపోయిన రైతులను చూస్తుంటే వారిని ఎలా సమాధాన పరచాలో తెలియడం లేదని .. ఈ అంశాలన్నింటినీ ఎమ్మెల్యేలు మంత్రులు, సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేయడం విశేషం. వచ్చే ఏడాది (2025) సాంతం స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. తొలుత గ్రామ పంచాయతీలు, ఆ తర్వాత మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు, ఆ వెంటనే మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ప్రభుత్వంపై గ్రామీణ ప్రజల్లో ముఖ్యంగా రైతుల్లో అసంతృప్తి పెరిగిపోతోందని, ఇప్పటికైనా జాగ్రత్త పడకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో తిరిగి ఓట్లు వేయించాలేమని కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యేల ఎదుట కుండబద్దలు కొట్టారు. మొత్తంగా ఈ మీటింగ్ సారాంశంపై భిన్నాభిప్రాయం వ్యక్తం అవుతోంది. పాలన సజావుగా సాగడం లేదన్న ఆవేదన కార్యకర్తల్లో గూడు కట్టుకుని ఉందన్న విషయం స్పష్టమైందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఒకే వేదిక మీద ఉన్న నలుగురు ఎమ్మెల్యేలు కేడర్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేదు. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళతారా..? కార్యకర్తల్లో పెరిగిపోతున్న ఈ అసంతృప్తికి బ్రేక్ వేసి కొత్త ఉత్సాహంతో ప్రజల్లోకి పంపుతారా లేదా వేచి చూడాల్సి ఉంది. అదే మాదిరిగా, ప్రభుత్వ పాలన తీరుపై ప్రజల్లో పెరిగిపోతున్న అసంతృప్తిని ఎలా కంట్రోల్ చేస్తారు..? 6 గ్యారంటీ హామీలను పూర్తి స్థాయిలో ఎపుడు అమలు చేస్తారు అన్న ప్రశ్నలకు సమాధానం దొరకాల్సి ఉంది.

# ఏలేటీ..ఒంటరైపోయారా... హీరో అవ్వాలనకుంటున్నారా...

హైదరాబాద్, నవంబర్ 6, బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటీ మహేశ్వర్ రెడ్డి హాట్ టాపిక్ గా మారారు. నాడు కాంగ్రెస్ పార్టీలో ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ గా వ్యవహరించిన ఏలేటి.. ఆ తర్వాత కమలం తీర్థం పుచ్చుకోవడం.. ఎమ్మెల్యేగా గెలుపొందడం.. ఫ్లోర్ లీడర్ కావడం చకచకా జరిపోయాయి. అయితే కాంగ్రెస్ నుంచి బయటకు వెళ్లడానికి కారకులెవరు..? అయన బీజేపీలో ఎందుకు చేరాల్సి వచ్చింది..? కాంగ్రెస్సే ఏలేటిని వదిలేసుకుందా..? లేక కాంగ్రెస్ తో ప్రయాణం చాలనుకున్నారా అనేది అటుంచుతే.. గత కొన్నాళ్ల నుంచి ఏలేటీ వ్యవహారిస్తున్న తీరు బీజేపీలో చర్చానీయంశంగా మారుతోంది. తరుచూ చిట్ చాట్ల పేరుతో ఆయన చేస్తున్న ఆరోపణలు బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి తల వంపులు తెస్తోందనే టాక్ ఆ పార్టీలోనే బలంగా వినిపిస్తోంది..నిత్యం ఏదో రకంగా సంచలన వాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలుస్తూ.. మీడియాను తన వైపునకు తిప్పే ప్రయత్నం చేస్తున్న బండి సంజయ్ ను.. ఓవర్ టెక్ చేయాలనే ఆలోచనలో ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఉన్నారా అనే సందేహాలు.. కమలం నేతల్లో వినిపిస్తున్నాయి. పార్టీలో ఇమేజ్ కోసమో ఏమో కానీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి అధికార పార్టీని టార్గెట్ చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారనే చర్చ సొంత పార్టీలోనే జరుగుతోంది. మరోవైపు ఏలేటి టార్గెట్ చేస్తూ మాట్లాడుతున్న వ్యాఖ్యలు ఇప్పుడు ఏలేటి వర్గాల్లోనూ, బీజేపీలోనూ, ఇటు కాంగ్రెస్ లోనూ రచ్చ రేపుతున్నాయి. వచ్చే ఏడాది జూన్ తర్వాత సీఎం రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పిస్తారని.. కొత్త ముఖ్యమంత్రి రాష్ట్రానికి రాబోతున్నారని ఏలేటి వ్యాఖ్యానించడం పట్ల బీజేపీ నేతలే షాక్ అవుతున్నారు. సీఎం రేవంత్ ఏడు సార్లు ఢిల్లీకి వెళ్తే రాహుల్ అపాయింట్ మెంట్ ఇవ్వలేదని.. ప్రియాంక నామినేషన్ కు వెళ్లినా కూడా రాహుల్ దర్శన భాగ్యం దక్కలేదని.. ఏలేటి చేసిన వాఖ్యలు ఇప్పుడు దుమారం లేపడం కాకుండా.. నవ్వుల పాలవుతున్నాయి. నిజానికి అది ఏలేటి మహేశ్వర్ రెడ్డి తప్పు కాదని.. ఆయనకి స్క్రిప్ట్ ఇచ్చిన వారిదని ఓపెన్ గానే కామెంట్స్ చేస్తున్నారట. ఏది తప్పు ఒప్పు అని తెలిసి ఉంటే ఏలేటి బీజేపీలో ఎందుకుంటారని కౌంటర్లు ఇస్తున్నారట. వయనాడ్ లో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇద్దరు కలిసి ప్రియాంక గాంధీ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న విషయం పాపం ఏలేటికి తెలియకపోయినా.. స్క్రిప్ట్ ఇచ్చిన వారికి అయినా తెలియకపోవడం విడ్డూరంగా ఉందంటూ జోక్స్ వేస్తున్నారట. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎక్కువ కాలం ఉండదని.. ఎన్నికలు ఎప్పుడొచ్చిన బీజేపీ అధికారంలోకి వస్తోందంటూ బీజేపీ చెబుతూ వస్తోంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని కూల్చడంలో బీజేపీ కుయుక్తులు మొయినాబాద్ ఫామ్ హౌస్ లో బయటపడ్డాయి. అవే కుయుక్తులు, అవే కుట్రలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు వేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఆ స్కెచ్ లో భాగంగానే ఏలేటి ప్రభుత్వంపై.. ప్రజా పాలనపై ఇష్టం వచ్చినట్టు నోరు పారేసుకుంటున్నారనే టాక్ వినిపిస్తోంది. బీజేపీని లేపేందుకు ఏలేటి చేస్తున్న విశ్వ ప్రయత్నాలు ఫలిస్తాయా లేదా అనేది అటుంచుతే.. మరోవైపు పదేపదే ఉత్తమ్ కుమార్ రెడ్డిని తలుస్తున్న ఏలేటికి ఉత్తమ్ కు మధ్య ఏమైనా నడుస్తున్నాయా.. అనే కూడా పొలిటికల్ వర్గాల్లో చర్చించుకుంటున్నారు. ఏలేటీతో మాట్లాడించేది ఉత్తమ్ కుమార్ రెడ్డేనా..? అనే అనుమానాలు కూడా పలువురు బయటపెడుతున్నారట. గతంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏలేటి మహేశ్వర్ రెడ్డి మధ్య అవినాభావ సంబంధాలు ఉండేవని.. వారిద్దరూ కలిసి బీజేపీలోకి వెళు_న్నారనే టాక్ బలంగా వినిపించింది. కానీ ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ లోనే ఉండడం.. ఏలేటి మహేశ్వర్ రెడ్డి పార్టీ మారడంతో.. ఇప్పుడు వారిద్దరూ కలిసి ఏమైనా ప్లాన్ చేశారా అని కూడా పొలిటికల్ గా డిస్కషన్ నడుస్తుందట. సీఎంను మారుస్తున్నారనే ప్రచారం చేయించడం వెనక ఎవరున్నారు..? ఏలేటితో స్క్రిప్ట్ చదివించిందేవరు..? కాంగ్రెస్ ను పడగొట్టేందుకు, ప్రజా పాలనను విచ్ఛిన్నం చేసేందుకు.. బీజేపీ కుట్రలు పన్నుతుందా ? ముల్లును ముల్లుతోనే తీయాలనే నానుడిని పక్కగా ప్లాన్ ప్రకారం ఏలేటితో చేయిస్తున్నారా అనే టాక్ ఇప్పుడు హాట్ హాట్ గా కొనసాగుతోంది. అయితే ఏలేటి మహేశ్వర్ రెడ్డి లాంటి వారిని కాంగ్రెస్ పార్టీ చాలా మందినే చూసిందని పార్టీ శ్రేణులు విమర్శలు గుప్పిస్తున్నారు. సోర్స్ ఇచ్చేంత నెట్ వర్క్ ఏలేటికి ఏఐసీసీ లో ఉందా..? సారు పదేపదే అధిష్టానం నుంచే సోర్స్ వస్తోందనే చెప్పడం వెనక డొల్ల తనం స్పష్టంగా కనిపిస్తోందని కుంటార్లు ఇస్తున్నారట. డబ్బు కట్టలతో ఫ్లోర్ లీడర్ పదవిని కొన్న ఏలేటిని.. బీజేపీ సంఘ్ పరివారులు ఎప్పుడు ఒక ఎర గానే చూస్తారని.. ఆ ఎరకు ఏ చేపలు పడవని తెలుసుకునే సమయానికి.. ఏలేటి జీరోగా మిగులుతారనే టాక్ కాంగ్రెస్ వర్గాల్లో వినిపిస్తోంది. పార్టీ ఎజెండా పక్కన పడేసి సొంత ఎజెండాతో వెళ్తున్న.. ఏలేటి తీరు సొంత పార్టీ నేతలే తప్పు బడుతున్న పరిస్థితి ఉందని జోరుగా వాదనలు వినిపిస్తున్నాయి. అందుకే ఆయన సొంత ఎజెండాకు పార్టీ ఆఫీసుల్లో స్థానం ఉండదని బీజేపీ రాష్ట్ర నాయకత్వం తేల్చిందని.. అందులో భాగంగానే పార్టీ ఆఫీసులో ఏలేటి మీడియా సమావేశానికి అనుమతి నిరాకరించడంతో.. తన ఇంటినే పార్టీ ఆఫీస్ గా మార్చుకొని కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని అంటున్నారు. మొత్తానికి ఏలేటి వ్యవహారిస్తున్న తీరు ఎక్కడి దాకా వెళ్తోందని పొలిటికల్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# ఆర్మూర్ గులాబీలో కలకలం

నిజామాబాద్, నవంబర్ 6, నిజామాబాద్ జిల్లాలో మాజీ ఎమ్మెల్యేల తీరుపై.. గులాబీ క్యాడర్ గుస్సాగా ఉన్నారట. పార్టీ కష్టకాలంలో ఉంటే.. నేతలు నియోజకవర్గానికి ముఖం చాటేస్తుండటం పట్ల కార్యకర్తలు గుర్రుగా ఉన్నారట. పార్టీ సీనియర్ మహిళా శాసన సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిపై.. సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిస్తే.. జిల్లాలో సగానికి పైగా నియోజకవర్గాల్లో నిరసన కార్యక్రమాలు జరగలేదంటే అక్కడి పరిస్థితి ఎలా ఉందో తేటతెల్లమవుతోందని జోరుగా చర్చించుకుంటున్నారట. బాల్కొండ, కామారెడ్డిలో సీఎం దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తే.. బాన్సువాడ, ఆర్మూర్ లో మొక్కుబడిగా కార్యక్రమం జరిగినట్టు చెబుతున్నారు. ఇక నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గ నేతలు.. కేటీఆర్ ఆదేశాలను లైట్ తీసుకున్నారట. కార్యక్రమాలు చేసేందుకు క్యాడర్ కు సైతం దిశానిర్దేశం చేయలేదట. దీంతో గులాబీ శ్రేణులు తమ నేతల తీరుపై.. చిటపటలాడుతున్నారట. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో పార్టీ దాదాపుగా ఖాళీ అయ్యిందని పొలిటికల్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. త్వరలో మేయర్ సైతం పార్టీ మారేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారట. మాజీ ఎమ్మెల్యే బిగాల సైతం వలసలను అడ్డుకోలేకపోతున్నారట. దాంతో అడపాదడపా నియోజకవర్గానికి వస్తూ.. పార్టీ కార్యక్రమాలు మొక్కుబడిగా జరిపిస్తున్నారట. రూరల్ లో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి అనంతరం.. నియోజకవర్గానికి ఎక్కువగా రావడం లేదట. నేతలె పక్కదారి చూస్తుండడంతో.. క్యాడర్ సైతం హస్తం గూటికి క్యూ కట్టారట. ఇక బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి ఇంకా తేరుకోలేకపోతున్నారట. ఇప్పటి వరకు నియోజకవర్గంలో అడుగు పెట్టలేదట. ఈ క్రమంలోనే నియోజకవర్గంలో ఇంచార్జీ బాధ్యతల నుంచి షకీల్ ను తప్పించాలని క్యాడర్ కోరుతున్నారట. ఆర్మూర్ లో మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షునిగా ఉన్న జీవన్‌రెడ్డి.. హైదరాబాద్ కు పరిమితం అయ్యారట. ఇప్పటికే ఆర్మూర్ లోనూ ద్వితీయ శ్రేణి నేతలు హస్తం గూటికి చేరారట. అలానే ఎల్లారెడ్డి, జుక్కల్ మాజీ ఎమ్మెల్యేలు చాలా రోజులుగా నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారట. క్యాడర్ కు అందుబాటులో ఉండకుండా.. నియోజకవర్గానికి ముఖం చాటేశారట. జిల్లాల్లోని నేతలంతా పార్టీకి దూరంగా ఉండడం వెనుక ఏదైనా వ్యూహం ఉందా అనే టాక్ నడుస్తోందట. నేతలంతా పార్టీ మారాలనే ఆలోచనలో ఉన్నారా ? అన్న చర్చజరుగుతోందట. ఇంచార్జీలుగా ఉన్నా లేనట్లు కాకుండా.. పార్టీ పటిష్టత కోసం అందుబాటులో ఉండాలని క్యాడర్ కోరుతున్నారట. ఒక వైపు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఘోర పరాజయాలు.. ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫాం హౌస్ కే పరిమితమవుతున్నారని విమర్శను మూటగట్టుకుంటున్నారు. పార్టీ కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎక్కడ కనిపించక పోవడం ఆ వాదనలను మరింత బలపరుస్తున్నాయి. ఇక వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆరే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అయితే వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ విఫలం అయ్యారని విమర్శలు వస్తున్నాయి. రీసెంట్ గా కేటీఆర్ బావమరిది పాకాల రాజు ఫామ్ హౌస్ పార్టీ ఇష్యూ ఫుల్ హాట్ టాపిక్ అయ్యింది. దీంతో మూలిగే నక్క మీద తాటి పండు పడినట్లుగా.. మాజీలు సైతం ఒక్కొక్కరుగా సైడ్ అవుతుండడం పార్టీ కార్యకర్తలని కలవరపెడుతుందట. ఇప్పటికే వరుస ఓటములతో సతమవుతున్న గులాబీ పార్టీకి.. ఈ వ్యవహారం మరింత తలనొప్పులు తెస్తుందని అభిప్రాయపడుతున్నారట.

## కులగణనపై గులాబీలో మధనం

హైదరాబాద్, నవంబర్ 6,తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు కులగణన హాట్ టాపిక్ అయింది. రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా కులగణన ప్రారంభం కాబోతోంది. ప్రభుత్వం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించబోతున్నారు. ఇప్పటికే ఎన్యుమరేటర్లకు శిక్షణ సైతం పూర్తిచేశారు. మొత్తం 75 ప్రశ్నలతో ఈ సర్వే కొనసాగుతోంది. దాదాపు మూడు రోజుల పాటు నిర్వహించే ఈ సర్వే కోసం ప్రభుత్వ యంత్రాంగమే కాకుండా.. కాంగ్రెస్ పార్టీ కూడా అదే స్థాయిలో కష్టపడుతోంది. సుమారు 48 వేల మంది ప్రభుత్వ సిబ్బంది ఇందులో భాగస్వాములు అవుతున్నారు. వారిలో 40వేల మంది ఉపాధ్యాయులే ఉన్నారు. ఈ క్రమంలో కులగణనపై స్టడీ కోసం నేడు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం హైదరాబాద్ నగరానికి వచ్చారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఈ కులగణన చేస్తోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని కులగణన చేపడుతోంది. అయితే.. కులగణనపై బీఆర్ఎస్ స్ట్రాటజీని మాత్రం ఎక్కడా బయటపెట్టడం లేదు. ఒకవిధంగా చెప్పాలంటే ఇప్పుడు కులగణన బీఆర్ఎస్ పార్టీకి కొరకరాని కొయ్యలా తయారైంది. ముందుకు పోతే నుయ్యి.. వెనక్కి పోతే గొయ్యి అన్న చందంగా పరిస్థితి ఉంది. ఇటీవల బీసీ నేత ఆర్ కృష్ణయ్య కులగణనకు బీసీ కమిషన్ ప్రామాణికం కాదని.. ప్రత్యేక కమిషన్ వేయాలంటూ హైకోర్టును ఆదేశించారు. దాంతో హైకోర్టు విచారణ జరిపించి కృష్ణయ్య వాదనను ఏకీభవించింది. ఫలితంగా ప్రభుత్వం కూడా ప్రత్యేక కమిషన్ నియమించింది. అయితే.. మొన్నటివరకు హైకోర్టు వాదననే బీఆర్ఎస్ నేతలు వినిపించారు. ఎట్టకేలకు ప్రభుత్వం కూడా కమిషన్ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో వారి నోళ్లకు మూతలు పడ్డాయి. దాంతో ఇప్పుడు కులగణనపై ఏ ఒక్క గులాబీ నేత కూడా మాట్లాడడం లేదు.

# సినిమా





## సందీప్ వంగను ఏడిపించిన హీరోలెవరు?



సందీప్ రెడ్డి వంగ.. ఇప్పుడు ఇండియాలోనే మోస్ట్ వాంటెడ్ డైరెక్టర్లలో ఒకడు. తనతో సినిమా చేయడానికి టాప్ స్టార్లు ఎంతో ఆసక్తితో ఉన్నారు. ప్రభాస్ లాంటి టాప్ స్టార్ తనతో 'స్పిరిట్' మూవీ చేయబోతున్నాడు.సందీప్ ఇప్పటిదాకా తీసింది మూడు సినిమాలు, అందులో రెండు సినిమాలు ఒకే కథతో వేర్వేరు భాషల్లో తెరకెక్కాయి. అయినా తన క్రేజ్ మామూలుగా లేదు. తన పేరు మీద వందల కోట్ల బిజినెస్ జరుగుతోందిప్పుడు. ఇంత క్రేజ్ సంపాదించుకున్న సందీప్.. తొలి చిత్రం రిలీజవడానికి ముందు ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. 'అర్జున్ రెడ్డి' కథతో అతను చాలా ఏళ్ల పాటు ట్రావెల్ చేసి.. దాన్ని సినిమాగా మలచడానికి పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. వాటి గురించి సందీప్ మరీ ఎక్కువగా చెప్పుకుంది లేదు. ఐతే తాజాగా స్టార్ రైటర్ కోన వెంకట్.. సందీప్‌తో తనతో పంచుకున్న కష్టాల గురించి ఓ పాడ్ కాస్ట్‌లో మాట్లాడాడు. 'అర్జున్ రెడ్డి' కథ మీద సందీప్ ఐదేళ్లు పట్టుబట్టి కూర్చున్నా ఆ సినిమా పట్టాలెక్కలేదని కోన వెంకట్ వెల్లడించాడు. ముందు ఒక హీరోకు ఈ కథ నచ్చి సినిమా చేయడానికి ఆసక్తి చూపించాడని.. తన ఆఫీస్‌లో ఆ కథ మీద వర్క్ చేసే అవకాశం కల్పించాడని కోన తెలిపాడు. ఐతే తనకు పెద్దగా సౌకర్యాలేమీ కల్పించలేదని.. ఒక మూలన ఒక సీట్ ఇచ్చి కథ మీద వర్క్ చేయమన్నాడని.. రోజూ తనకు భోజనం మాత్రం పెట్టేవారని కోన చెప్పాడు. చూద్దాం చేద్దాం అంటూనే ఆ హీరో మూడేళ్లు గడిపేశాడని.. అతడికి సినిమా చేసే ఉద్దేశం లేదని చివరికి అర్థమయ్యాక సందీప్ అక్కడి నుంచి బయటికి వచ్చేశాడని తెలిపాడు.

## చివరి 20 నిమిషాలు

సృజన్ కుమార్ బొజ్జంతో కలిసి లక్కీ మీడియా అధినేత బెక్కెం వేణుగోపాల్ నిర్మించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి విక్రమ్ రెడ్డి దర్శకుడు. ఈనెల 22న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం మీడియాతో నిర్మాత బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ, 'రొమాన్స్, ఎంటర్ టైన్‌మెంట్, ఎమోషన్స్ ఈ చిత్రానికి ప్రధాన బలాలు. మా సినిమా నచ్చి డిస్ట్రిబ్యూటర్స్ కూడా ఫ్యాన్సీ రేట్లు ఇచ్చి తీసుకున్నారు.

## విజయ్ క్రేజ్.. వేరే లెవెల్



తమిళనాట దశాబ్దాల పాటు సూపర్ స్టార్ రజినీకాంతే నంబర్ వన్ హీరోగా ఉండేవారు. ఆయన సినిమాల బడ్జెట్లు, బిజినెస్, కలెక్షన్లు అన్నీ కూడా వేరే స్థాయిలో ఉండేవి. అప్పుడప్పుడూ రజినీకి కూడా డిజాస్టర్లు ఎదురైనా.. సరైన సినిమా పడితే బాక్సాఫీస్ మోత మోగిపోయేది. కానీ గత దశాబ్ద కాలంలో ఆయన ఫాలోయింగ్, మార్కెట్ తగ్గుతూ వచ్చాయి. అదే సమయంలో విజయ్ రైజ్ అయ్యాడు. రజినీని మించి మార్కెట్ సంపాదించాడు. గత కొన్నేళ్లలో అతను పట్టిందల్లా బంగారం అవుతోంది. విజయ్ సినిమాలకు టాక్ ఎలా ఉన్నా.. ఓపెనింగ్స్ అదిరిపోతున్నాయి. నెగెటివ్ టాక్ తెచ్చుకున్న సినిమాలు కూడా బాక్సాఫీస్ దగ్గర సక్సెస్ ఫుల్ అనిపించుకుంటున్నాయి. లియో, ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం అందుకు ఉదాహరణ. టాక్ బాలేకున్నా ఇవి వందల కోట్ల వసూళ్లు సాధించి విజయ్ స్టార్ పవర్ ఏంటో చూపించాయి. ఐతే ఈ క్రేజ్‌ను రాజకీయంగా ఉపయోగించుకోబోతున్న విజయ్.. పూర్తి స్థాయిలో రాజకీయాల్లోకి దిగే ముందు చివరగా ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. హెచ్.వినోద్ దర్శకత్వంలో విజయ్ హీరోగా ఇటీవలే ఓ సినిమా మొదలైంది. పూజా హెగ్డే అందులో కథానాయిక. ఈ సినిమా షూటింగ్ మొదలైందో లేదో ఓవర్సీస్ థియేట్రికల్ డీల్ పూర్తయిందట. ఏకంగా రూ.78 కోట్లకు ఫార్ ఫిలిమ్స్ సంస్థ అన్ని దేశాలకు సంబంధించిన హక్కులను గుంపగుత్తగా కొనేసినట్లు సమాచారం.

## 'కూలీ'లో ఆమిర్ ఉన్నాడా అని అడిగితే?



ఖైదీ, మాస్టర్, విక్రమ్, లియో చిత్రాలతో లోకేష్ కనకరాజ్ ఎంత క్రేజ్ సంపాదించుకున్నాడో తెలిసిందే. అతడి వల్లే సినిమాటిక్ యూనివర్శ్ అనే ట్రెండ్ పాపులర్ అయింది.'లియో' సినిమా రిలీజైనపుడు 'ఎల్‌సీయూ' గురించి ఎంత చర్చ జరిగిందో తెలిసిందే. కానీ ఆ సినిమా అంచనాలను అందుకోలేకపోయింది. ఇప్పుడు లోకేష్ నుంచి 'కూలీ' సినిమా రాబోతోంది. సూపర్ స్టార్ రజినీకాంత్ ఇందులో హీరోగా నటించడంతో సినిమాపై మామూలు అంచనాలు లేవు. పైగా అక్కినేని నాగార్జున, ఉపేంద్ర లాంటి వేరే ఇండస్ట్రీల స్టార్లు ఇందులో ప్రత్యేక పాత్రలు పోషిస్తుండడంతో హైప్ ఇంకా పెరిగింది. వీరికి తోడు ఆమిర్ ఖాన్ సైతం ఈ చిత్రంలో స్పెషల్ రోల్ చేస్తున్నాడని వార్తలు వచ్చాయి. కానీ దీని గురించి ఇంకా అధికారిక ప్రకటన అయితే రాలేదు.ఓ ఇంటర్వ్యూలో లోకేష్ కనకరాజ్‌ను 'కూలీ'లో ఆమిర్ క్యామియో గురించి అడిగితే.. సూటిగా సమాధానం చెప్పలేదు. సినిమాకు సంబంధించి ఏ అప్‌డేట్ అయినా అధికారికంగా ప్రొడక్షన్ హౌస్ నుంచే రావాలని.. తాను రివీల్ చేయలేనని అతను చెప్పాడు. ఐతే వేరే రాష్ట్రం లేదా దేశానికి చెందిన ఒక స్పెషల్ వ్యక్తి ఈ చిత్రంలో నటిస్తుండొచ్చు అంటూ ఆమిర్ క్యామియో గురించి చెప్పకనే చెప్పాడు లోకేష్. ఇక 'కూలీ' సినిమాలో ఇంత మంది పెద్ద నటులు నటించడం గురించి మాట్లాడుతూ.. ఇదేదో స్టార్లందరినీ తీసుకొచ్చి క్యామియోలు చేసి మసిబూసి మారేడుకాయను చేసే టైపు సినిమా కాదని.. ప్రతి ఒక్కరి పాత్రలూ కథకు అనుగుణంగానే ఉంటాయని.. ప్రాపర్ స్టోరీ ఉన్న సినిమా ఇదని లోకేష్ తెలిపాడు.

## నాని 'ప్యారడైజ్' వెనుక అసలు కహాని

దసరా బ్లాక్ బస్టర్‌తో నానికి మొదటి వంద కోట్ల గ్రాసర్ ఇచ్చిన దర్శకుడు శ్రీకాంత్ ఓదెల రెండోసారి న్యాచురల్ స్టార్ తో జట్టు కడుతున్న సంగతి తెలిసిందే. ప్రాజెక్టుని ఇప్పటికే అధికారికంగా లాంచ్ చేయగా హిట్ 3 ది థర్డ్ కేసులో బిజీగా ఉన్న నాని దాన్ని త్వరగా పూర్తి చేసుకుని ఈ సెట్స్ లో చేరబోతున్నాడు. షూటింగుకు ముందే భారీ అంచనాలు నెలకొన్న ఈ ప్యాన్ ఇండియా మూవీకి ప్యారడైజ్ అనే టైటిల్ దాదాపు లాకైనట్టు లేటెస్ట్ అప్డేట్. అనౌన్స్ చేయడానికి ఇంకా టైం ఉంది కాబట్టి అధికారిక ప్రకటన ఇప్పటికిప్పుడు రాకపోవచ్చు కానీ ఈ పేరు వెనుక మాత్రం ఆసక్తికరమైన లీక్ వినిపిస్తోంది.దాని ప్రకారం ఈ సినిమా బ్యాక్ డ్రాప్ మొత్తం సికంద్రాబాద్ లో జరుగుతుంది. ఆ మేరకు భారీ సెట్లు కూడా వేశారు. ఎనభై తొంభై దశకం మధ్య జరిగిన ఒక సంచలనాత్మక సంఘటనను ఆధారంగా చేసుకుని శ్రీకాంత్ ఓదెల ఈ స్క్రిప్ట్ రాసుకున్నాడట. జంట నగరాల్లో కీలకమైన ల్యాండ్ మార్క్ గా చెప్పుకునే ప్యారడైజ్ నేపథ్యంలో కీలకమైన మలుపులు ఉన్నందు వల్లే ఈ టైటిల్ సబబుగా ఉంటుందని భావించి ఆ మేరకు రిజిస్టర్ కూడా చేశారని అంటున్నారు. ఒకవేళ హీరో పేరు ఇదే అయినా ఆశ్చర్యపోనక్కర్లేదని మరో ఇంటరెస్టింగ్ న్యూస్ చక్కర్లు కొడుతోంది. మొత్తానికి ఊహలకు భిన్నంగా నాని ఓదెల ఏదో గట్టిగానే ప్లాన్ చేయబోతున్నారు.



## కీడా కోలా దర్శకుడి 'శాంతి' మంత్రం



పెళ్లి చూపులుతో దర్శకుడిగా పరిచయమై ఈ నగరానికి ఏమైంది ద్వారా యూత్ లో ట్రెండీ ఫాలోయింగ్ తెచ్చుకున్న దర్శకుడు తరుణ్ భాస్కర్ ఆ తర్వాత చాలా గ్యాప్ తీసుకుని కీడా కోలా మాత్రమే డైరెక్ట్ చేశాడు.నటుడిగా బిజీగా మారిపోతూ పలు బ్లాక్ బస్టర్లలో భాగం పంచుకుని ఇప్పుడు ఏకంగా సోలో హీరోగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్నాడు. ఏఆర్ సంజీవ్ దర్శకత్వంలో 35 చిన్న కథ కాదు నిర్మాతలు రూపొందిస్తున్న ఎంటర్ టైనర్ కి ఓం శాంతి శాంతి శాంతిః టైటిల్ లాక్ చేసినట్టు సమాచారం. అధికారికంగా ప్రకటించలేదు కానీ ఖరారైనట్టు తెలిసింది. దీని వెనుక కొన్ని ఆసక్తికరమైన విషయాలున్నాయి. ఇది మలయాళం సూపర్ హిట్ జయ జయ జయ జయహే రీమేక్. పెళ్లయ్యాక కూడా బాగా చదువుకుని ఉన్నత స్థాయికి వెళ్లాలనుకున్న అమ్మాయికి భర్తే అడ్డంకిగా మారతాడు. ముందు ఒప్పుకుని తర్వాత ప్లేట్ ఫిరాయించి భార్య మీద పెత్తనం చేయడం మొదలుపెడతాడు. ఆ తర్వాత ఆసక్తికరమైన సంఘటనలు జరిగి వ్యవహారం చాలా దూరం వెళ్తుంది. ఈగోలు, కోపాలతో ఊగిపోయే జంట మధ్య శాంతి ఎలా ఏర్పడిందనే పాయింట్ తో ఒరిజినల్ వెర్షన్ తీశారు. గోదావరి బ్యాక్ డ్రాప్ ఎంచుకున్న ఈ పల్లెటూరి డ్రామాలో ఈషా రెబ్బ హీరోయిన్ గా నటిస్తోంది. ఇది కనక హిట్ అయితే తరుణ్ భాస్కర్ కు మరో ప్రమోషన్ దక్కినట్టే. ఈ నగరానికి ఏమైంది 2 త్వరలోనే సెట్స్ పైకి తీసుకెళ్ళబోతున్న తరుణ్ భాస్కర్ దీన్ని కూడా ఇదే బ్యానర్ లో చేయబోతున్నట్టు టాక్.

## సంక్రాంతి ఆప్షన్ ఎప్పుడూ లేదు

తండేల్ విడుదల తేదీ సస్పెన్స్ కు చెక్ పెడుతూ ఫిబ్రవరి 7 అఫీషియల్ గా ప్రకటించారు. నిన్నే ఇది లీకైనప్పటికీ అధికారిక ముద్ర కోసం అభిమానులు ఎదురు చూశారు. ఇప్పుడది నెరవేరిపోయింది. ఈ సందర్భంగా అల్లు అరవింద్ ఒక ఆసక్తికరమైన విషయం చెప్పారు. తండేల్ డిసెంబర్ 20 అనుకున్నా కొన్ని కారణాల వల్ల అది సాధ్యపడలేదని, కానీ ఈలోగా సంక్రాంతికి రిలీజవుతుందనే ప్రచారం కొందరు చేయడం ఆశ్చర్యపరిచిందని, అసలు ఎప్పుడూ ఆ ఆప్షనే పెట్టుకోలేదని క్లారిటీ ఇచ్చారు. పలువురు స్నేహితులు పండగ డేట్ సూచించినా కొన్ని క్యాలికులేషన్లకు లోబడి నిర్ణయం తీసుకున్నామని అన్నారు. సో అక్కినేని ఫ్యాన్స్ భావించినట్టు తండేల్ అసలు సంక్రాంతికి రావాలని అనుకోనేలేదనే క్లారిటీ పూర్తిగా వచ్చేసింది. ఒకవేళ అలా చేసి ఉంటే రిస్క్ కూడా. ఎందుకంటే ఓపెనింగ్స్ తో పాటు టోటల్ రెవిన్యూని రామ్ చరణ్, వెంకటేష్, సందీప్ కిషన్, అజిత్ లతో పాటు పంచుకోవాల్సి వచ్చేది. పైగా థియేటర్ల కొరత ఖచ్చితంగా ఎదురయ్యేది. దానికన్నా సేఫ్ గా ఫిబ్రవరిని ఎంచుకోవడం తెలివైన ఎత్తుడని చెప్పాలి. ఉప్పెన, డీజే టిల్లు, టిల్లు స్క్వేర్, నేను లోకల్ లాంటివన్నీ ఈ నెలలో బ్లాక్ బస్టర్స్ అయ్యాయి. సో ఎలా చూసుకున్నా తండేల్ డెసిషన్ సరైనదేనని చెప్పాలి. ఇక మూడు నెలలకు పైగా సమయం ఉంది కాబట్టి పోస్ట్ ప్రొడక్షన్ తో పాటు ప్రమోషన్లకు తగినంత సమయం దొరుకుతుంది. తండేల్ నాగచైతన్య కెరీర్ లోనే అత్యంత భారీ బడ్జెట్ తో రూపొందింది. సాయిపల్లవి కాంబినేషన్ కావడంతో తమిళ, మలయాళం భాషల్లోనూ చాలా క్రేజ్ నెలకొంది.





# క్రీడలు



## ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్.. భారత్ మేనేజ్‌మెంట్ కీలక నిర్ణయం!





న్యూజిలాండ్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌ను భారత్ కోల్పోయిన విషయం తెలిసిందే. సొంతగడ్డపై సిరీస్ కోల్పోవడమే కాకుండా.. వైట్ వాష్ ఇవ్వడంతో భారత జట్టుపై విమర్శల వర్షం కురుస్తోంది.కివీస్ టెస్ట్ సిరీస్ ఘోర వైఫల్యం నేపథ్యంలో టీమిండియా మేనేజ్‌మెంట్ దిద్దుబాటు చర్యలకు దిగింది. ఈ క్రమంలో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి ముందు టీమ్ మేనేజ్‌మెంట్ కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాటర్లు కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్‌లను వారం ముందుగానే కంగారో గడ్డపైకి పంపనుంది. న్యూజిలాండ్ సిరీస్‌లోని మొదటి టెస్టులో ఆడిన కేఎల్ రాహుల్ పూర్తిగా నిరాశపరిచాడు. మొదటి ఇన్నింగ్స్‌లో డకౌట్ కాగా.. రెండో ఇన్నింగ్స్‌లో 12 రన్స్ చేశాడు. గిల్ అందుబాటులోకి రావడం, పేలవ ఫామ్ కారణంగా.. మిగితా రెండు మ్యాచ్‌లకు బెంచ్‌కే పరిమితం అయ్యాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024కి ఎంపికైన రాహుల్.. ప్రాక్టీస్ కోసం ముందుగానే ఆస్ట్రేలియా గడ్డపై అడుగుపెట్టనున్నాడు. నవంబర్ 7 నుంచి ఆస్ట్రేలియా-ఎతో జరగనున్న రెండో టెస్టులో రాహుల్ ఆడే అవకాశాలు ఉన్నాయి. ఆస్ట్రేలియాలో 5 టెస్టులు ఆడిన రాహుల్.. 187 పరుగులు మాత్రమే చేశాడు. ప్రస్తుతం తీవ్ర పోటీ ఉన్న నేపథ్యంలో రాహుల్‌కు తుది జట్టులో చోటు దక్కుతుందో లేదో చూడాలి. యువ వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ తొలిసారి ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనున్నాడు. విదేశీ గడ్డపై ఆడిన అనుభవం జురెల్‌కు లేకపోవడంతో అక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు ముందుగానే ఆస్ట్రేలియాకు పంపిస్తోంది. జురెల్ కూడా ఆస్ట్రేలియా-ఎతో జరగనున్న రెండో టెస్టులో ఆడనున్నాడని తెలుస్తోంది. నవంబర్ 22 నుంచి పెర్త్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా తొలి టెస్టు ఆరంభం కానుంది. ఈ సిరీస్ టీమిండియాకు ఎంతో కీలకం అన్న విషయం తెలిసిందే.

## టీ20 కెప్టెన్‌ని ప్రకటించిన ఆస్ట్రేలియా



జోష్ ఇంగ్లిస్ పాకిస్థాన్‌తో జరగనున్న టి20 సిరీస్‌కు ఆస్ట్రేలియా కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. పెర్త్‌లో జరుగుతున్న ప్రస్తుత సిరీస్‌లో చివరి మ్యాచ్‌లో వన్డే జట్టుకు కూడా నాయకత్వం వహిస్తాడు.దీనికి కారణం బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి సంబంధించిన సన్నాహాలపై కీలక టెస్టు ఆటగాళ్లు దృష్టి సారించారు. దింతో వన్డే, టీ20లకు ఆస్ట్రేలియా కొత్త కెప్టెన్‌ని ప్రకటించింది. వైట్ బాల్ క్రికెట్‌లో జోష్ ఇంగ్లిస్‌కు ఆస్ట్రేలియా బాధ్యతలు అప్పగించారు. కెప్టెన్‌గా, అతను వన్డేలో పాట్ కమిన్స్ ను, అలాగే టి20 ఇంటర్నేషనల్‌లో మిచెల్ మార్ష్‌ను భర్తీ చేస్తాడు. జోష్ ఇంగ్లిస్ ఆస్ట్రేలియాకు వన్డేల్లో 30వ కెప్టెన్‌గా, టీ20లో 14వ కెప్టెన్‌గా నిలవనున్నాడు. పాకిస్తాన్‌తో జరిగే వైట్ బాల్ సిరీస్‌లో జోష్ ఇంగ్లీష్ బాధ్యతలు చేపట్టనున్నారు. జోష్ ఇంగ్లీష్ కెప్టెన్సీకి సంబంధించి, పాకిస్థాన్‌తో జరిగే సిరీస్‌కు మాత్రమే అతన్ని కెప్టెన్‌గా నియమించారని తెలుస్తోంది. దీని వెనుక కారణం ఖచ్చితంగా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ. దీని కోసం నవంబర్ 22 నుండి భారత్- ఆస్ట్రేలియా టెస్ట్ సిరీస్ ప్రారంభమవుతుంది. ఆస్ట్రేలియా రెగ్యులర్ వన్డే కెప్టెన్ పాట్ కమిన్స్, టి20 కెప్టెన్ మిచెల్ మార్ష్ దీని కోసం సన్నద్ధమవుతున్నారు. అందువల్ల పాకిస్తాన్‌తో సిరీస్‌లో వీరు ఆడడం లేదు. పాకిస్థాన్‌తో జరిగే సిరీస్‌లో మూడో వన్డే నుంచి ఆస్ట్రేలియా జట్టుకు జోష్ ఇంగ్లీష్ నాయకత్వం వహిస్తాడు. నవంబర్ 10న ఇరు దేశాల మధ్య మూడో వన్డే జరగనుంది. ఆ తర్వాత నవంబర్ 18 వరకు మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరగనుంది. ప్రస్తుతం జరుగుతున్న పాకిస్థాన్ తో జరిగే రెండో వన్డేలో పాట్ కమిన్స్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపడుతున్నారు. ఆ తర్వాత మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, స్టీవ్ స్మిత్‌లతో పాటు ఈ ఆటగాళ్లంతా వన్డే సిరీస్‌కు దూరమై భారత్‌తో జరిగే టెస్టు సిరీస్‌కు సిద్ధమవుతున్నారు.

## 2036 ఒలింపిక్స్ భారత్‌లో..?



ప్రపంచంలో అత్యున్నత క్రీడావేదిక "ఒలింపిక్స్"ని భారత్ నిర్వహించే అవకాశం కనిపిస్తోంది. భారత ఒలింపిక్స్ అసోసియేషన్(ఐఓఏ) 2036లో భారతదేశంలో ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించేందుకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐఓసీ)కి అధికారికంగా ఒక లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ని పంపింది. ఒలింపిక్స్‌ని నిర్వహించేందుకు ఆసక్తి వ్యక్తం చేసింది. 2036లో పారాలింపిక్స్ క్రీడలు జరుగుతాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2036లో భారత్ ఒలింపిక్స్, పారాలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలనే ప్రధాని నరేంద్రమోడీ కలలకు ఇది అద్దంపడుతోంది. ఒక వేళ ఈ అవకాశం లభిస్తే భారత్‌లో యువత సాధికారత, ఆర్థిక వృద్ధి, సామాజిక పురోగతి పెంపొందించే విషయంలో ప్రయోజనాలను తీసుకురాగలదు. పలు సందర్భాల్లో ఈ క్రీడల నిర్వహణ గురించి ప్రధాని నరేంద్రమోడీ మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పారిస్ ఒలింపిక్స్ అథ్లెట్లతో జరిగిన సంభాషణల్లో 2036 ఒలింపిక్స్ నిర్వహణ గురించి మాట్లాడారు. "భారతదేశం 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధమవుతోంది. ఈ విషయంలో, గత ఒలింపిక్స్‌లో ఆడిన అథ్లెట్ల నుండి ఇన్‌పుట్ చాలా ముఖ్యం. మీరందరూ చాలా విషయాలను గమనించి, అనుభవించి ఉంటారు. మేము దీనిని డాక్యుమెంట్ చేసి ప్రభుత్వంతో పంచుకోవాలనుకుంటున్నాము." ప్రధాని అన్నారు. గతేడాది ముంబైలో జరిగిన 141వ ఐఓసీ సెషన్‌లో, 140 కోట్ల మంది భారతీయులు క్రీడలను నిర్వహించడానికి కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. 2036 ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉందని మోడీ అన్నారు. ఇది 140 కోట్ల మంది భారతీయుల చిరకాల స్వప్నంగా ఆయన అభివర్ణించారు. ఇంటర్నేషనల్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ థామస్ బాచ్ కూడా భారత్ ఆసక్తిని సమర్థించారు. 2036 ఒలింపిక్ క్రీడల్ని నిర్వహించడానికి భారత్‌తో పాటు మరో 10 దేశాలు ఆసక్తి చూపిస్తున్నాయి. మెక్సికో (మెక్సికో సిటీ, గ్వాదలజారా-మాంటెర్రే-టిజువానా), ఇండోనేషియా (నుసంతారా), టర్కీ (ఇస్తాంబుల్), ఇండియా (అహ్మదాబాద్), పోలాండ్ (వార్సా, క్రాకో), ఈజిప్ట్ ( కొత్త అడ్మినిస్ట్రేటివ్ క్యాపిటల్), మరియు దక్షిణ కొరియా (సియోల్-ఇంచియాన్) పోటీలో ఉన్నాయి.

## ఏటీపీ ఫైనల్స్‌కు మాజీ చాంపియన్ దూరం!

ఈ ఏడాది ఆఖర్లో జరుగబోయే ఏటీపీ ఫైనల్స్ కళ తప్పనుంది. ఇటలీలోని టురిన్ వేదికగా నవంబర్ 10 నుంచి జరుగబోయే ఈ టోర్నీకి ఇప్పటికే పలువురు స్టార్లు దూరం కాగా.. ఇప్పుడు మాజీ చాంపియన్ నొవాక్ జకోవిచ్ సైతం ఈ పోటీల్లో పాల్గొనడం లేదు. గాయం నుంచి పూర్తిగా కోలుకోని జకోవిచ్ టోర్నీ నుంచి వైదొలిగాడు. 2023లో ఏటీపీ ఫైనల్స్ చాంపియన్ అయిన జకో చివరగా షాంఘై మాస్టర్స్‌లో ఆడాడు. ఆ టోర్నీ ఫైనల్లో ఇటలీ కెరటం జన్నిక్ సిన్నర్ చేతిలో ఓడిన అతడు మళ్లీ రాకెట్ పట్టలేదు.ప్రతిష్ఠాత్మక ఏటీపీ ఫైనల్స్‌కు దూరమవ్వడం తనకు ఎంతో బాధగా ఉందని జకోవిచ్ అన్నాడు. తన కోసం ఎదురుచూసే అభిమానులకు సారీ చెబుతూ టెన్నిస్ లెజెండ్ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టాడు. 'ఏటీపీ ఫైనల్స్‌కు అర్హత సాధించడం నిజంగా పెద్ద గౌరవం. టురిన్‌లో ఆడేందుకు నేను ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నా. అయితే.. గాయం కారణంగా వచ్చే వారం మొదలయ్యే ఆ టోర్నీలో నేను పాల్గొనడం లేదు అని జకోవిచ్ ఓ ప్రకటనలో వెల్లడించాడు. ఏటీపీ ఫైనల్స్‌లో నన్ను చూడాలని కోరుకుంటున్న అభిమానులు క్షమించండి. ఆ టోర్నీలో ఆడనున్న ప్రతి ఒక్కరికీ ఆల్ ది బెస్ట్. మిమ్మల్ని త్వరలోనే కలుస్తాను' అంటూ జోకర్‌గా పేరొందిన తన పోస్ట్‌లో రాసుకొచ్చాడు. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ సమయంలో జకోవిచ్ మోకాలి కండరాల గాయంతో బాధ పడ్డాడు. ఆ గాయం మళ్లీ తిరగబెట్టడంతో అతడు ఏటీపీ ఫైనల్స్ ఆడకూడదనే నిర్ణయానికి వచ్చాడు.

## ఐపీఎల్ వేలంలోకి 42 ఏళ్ల ఆటగాడు?




ఐపీఎల్ వేలం ఈసారి ఉత్కంఠగా సాగనుంది. చాలా మంది పెద్ద ఆటగాళ్లు వేలంలో భాగం కానున్నారు. గత సీజన్‌లో తమ జట్లకు కెప్టెన్‌గా వ్యవహరించిన చాలా మంది ఆటగాళ్లు ఈసారి విడుదలైన తర్వాత వేలంలో భాగం కానున్నారు. ఈసారి 42 ఏళ్ల వెటరన్ ప్లేయర్ కూడా వేలం కోసం నమోదు చేసుకున్నాడు. ఈ ఆటగాడు 13 ఏళ్ల తర్వాత వేలానికి వచ్చాడు. అయితే ఈ ఆటగాడు అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ కూడా అయ్యాడు.జేమ్స్ ఆండర్సన్ వేలంలో భాగం కానున్నాడు. ఇంగ్లండ్ మాజీ ఫాస్ట్ బౌలర్ జేమ్స్ ఆండర్సన్ ఈసారి మెగా వేలానికి రిజిస్టర్ చేసుకున్నాడు. 42 ఏళ్ల వయస్సులో జేమ్స్ అండర్సన్ ఫ్రాంచైజీ క్రికెట్ ఆడాలని తన కోరికను వ్యక్తం చేశాడు. 22 ఏళ్ల పాటు అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడి జూలైలో రిటైరైన అండర్సన్, తొలిసారిగా ఐపీఎల్‌లో ఆడటం చూడవచ్చు. పదవీ విరమణ చేసిన ఒక నెల తర్వాత అండర్సన్ ఫ్రాంచైజీ క్రికెట్‌ను అనుభవించడాన్ని ఎంచుకోవచ్చని సూచించాడు. 42 ఏళ్ల అండర్సన్ బేస్ ధర రూ.1.25 కోట్లు కాగా.. 13 సీజన్ల సుదీర్ఘ విరామం తర్వాత వేలంలోకి అడుగుపెట్టనున్నాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన మూడో బౌలర్‌ను కలిగి ఉన్న బౌలర్, 2011- 2012 వేలంలో అమ్ముడుపోని తర్వాత ఐపీఎల్‌లో అరంగేట్రం చేయలేదు. అండర్సన్ 2014 నుండి వార్విక్‌షైర్‌తో లాంక్‌షైర్ తరపున ౨20 మ్యాచ్ ఆడినప్పటి నుండి ఎటువంటి ౨20 క్రికెట్ ఆడలేదు. ఇంగ్లండ్‌కు చెందిన ఈ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ 19 టీ20 మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. అందులో అతను చివరి మ్యాచ్ 2009లో ఆడాడు. ఇందులో 18 వికెట్లు తీశాడు.


## రిషబ్ పంత్‌కు కెప్టెన్సీ బాధ్యతలు.. టీమిండియా మాజీ ఆటగాడు కీలక వ్యాఖ్యలు

న్యూజిలాండ్‌తో సిరీస్ తర్వాత టీమిండియా ఇప్పుడు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లాల్సి ఉంది. ఇక్కడ ఆస్ట్రేలియాతో టీమిండియా ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ నవంబర్ 22న జరగనుంది. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ ఆడడం కష్టం కాబట్టి టీమ్ ఇండియా బాధ్యతలు ఎవరు తీసుకుంటారనేది ఈ మ్యాచ్ ముందున్న అతిపెద్ద ప్రశ్న. వ్యక్తిగత కారణాల వల్ల రోహిత్ శర్మ ఈ సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌కు దూరమయ్యే అవకాశం ఉంది. ఆస్ట్రేలియా టూర్‌కు జస్ప్రీత్ బుమ్రా వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఇటువంటి పరిస్థితిలో అతను జట్టుకు నాయకత్వం వహించగలడని నమ్ముతారు. అయితే రిషబ్ పంత్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాలని టీమిండియా మాజీ ఆటగాడు మహ్మద్ కైఫ్ అంటున్నాడు. జట్టు కెప్టెన్సీ గురించి మహ్మద్ కైఫ్ మాట్లాడుతూ.. ప్రస్తుత జట్టులో కెప్టెన్సీకి రిషబ్ పంత్ అతిపెద్ద పోటీదారు అని చెప్పాడు. పంత్ కెప్టెన్‌కు అర్హుడు. పంత్ ఎప్పుడు ఆడినా, అతను ఎల్లప్పుడూ టీమ్ ఇండియాను ఫ్రంట్ ఫుట్‌లో ఉంచుతాడు. అతను ఎప్పుడూ టీమ్ ఇండియాను గెలిపించడానికి ప్రయత్నిస్తాడు. అతను ప్రతి సందర్భంలోనూ పరుగులు చేయగలడు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలో పరుగులు సాధించాడు. భారత్ టర్నింగ్ పిచ్‌పై కూడా పరుగులు సాధించాడు. అతను పూర్తి బ్యాట్స్‌మెన్ అని చెప్పాడు. పంత్‌ను ప్రశంసిస్తూ.. "పంత్ తన చివరి మ్యాచ్ ఆడినప్పుడు అతను లెజెండ్‌గా రిటైర్ అవుతాడు. అతని వికెట్ కీపింగ్ మెరుగుపడింది. అతను న్యూజిలాండ్‌తో క్రీజులో ఉన్న సమయానికి న్యూజిలాండ్ కష్టాలు పెరిగాయి. కాబోయే కెప్టెన్ కోసం టీమ్ ఇండియా వెతుకుతున్నట్లయితే పంత్‌ను మించిన ఆప్షన్ మరొకటి లేదని తెలిపాడు.



# కుల గణన సర్వే మమః






**రాజేంద్ర నగర్ ప్రజా బలం ప్రతినిధి 6 నవంబర్ 2024**తెలంగాణ వ్యాప్తంగా సమగ్ర కుల గణన సర్వేలో ప్రతి 150 ఇళ్లకు ఒక పర్యవేక్షణాధికారి ఉంటారని అట్టి సర్వేలో 56 ప్రధాన 19 అనుబంధ ప్రశ్నలతో మొత్తం 75 ప్రశ్నలు ఉంటాయని, వాటన్నింటికీ ఓపికగా సమాధానాలు చెప్పి విచ్చేసిన అధికారులకు సహకారాన్ని అందించి తోడ్పడాలని ప్రజా ప్రతినిధులు చెవిలో జోరీగ లాగ చెప్పడం తప్పితే వాస్తవానికి జరుగుతున్న నిజ నిర్ధారణ ఏమిటంటే సర్వేలో భాగంలో మణికొండ మునిసిపాలిటీ పరిధిలోని అపార్ట్మెంట్లకు వచ్చిన అధికారులు ఇండ్లలో ఉన్నవారిని కనీసం పలుకరించక పోగా వచ్చినం వెళ్ళినం మమః అన్న చందాన తలుపు ప్రక్కన గోడకు స్టికర్ అంటించి గుడ్డెద్దు చేల్లో పడ్డట్టు పరుగో పరుగు అని ముందుకు సాగుతున్నారని ది సిటిజన్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్య ధోరణికి ఇది ఒక మచ్చుతునక అని ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితిని తెలియ పరచినాడు.

# ముగిసిన కంపెనీ స్థాయి పుట్ బాల్ పోటీలు

## విజేతగా నిలిచిన శ్రీరాంపూర్ ఏరియా జట్టు




**ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 6** :మందమర్రి సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ లో డబ్ల్యూ.పి.ఏ అండ్ జి.ఏ ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు నిర్వహించిన కంపెనీ ఫుట్ బాల్ టోర్నమెంట్ బుధవారం ముగిసాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

అనంతరం రెండు రోజుల పాటు నిర్వహించిన కంపెనీ స్థాయి ఫుట్ బాల్ టోర్నమెంట్ లో పాల్గొన్న క్రీడాకారుల అందరికీ అభినందనలు తెలిపారు. క్రీడాకారులకు గెలుపు ఓటములు సహజమని కంపెనీ స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించిన క్రీడాకారులు ఆటను ప్రదర్శించి కోల్ ఇండియా స్థాయిలో విజయం సాధించాలని అన్నారు. విన్నర్స్ గా నిలిచిన శ్రీరాంపూర్ ఏరియా క్రీడాకారులకు మొదటి బహుమతిని రన్నర్స్ గా నిలిచిన జి.డి.కే - 1 అండ్ 2 ఏరియా క్రీడాకారులు బహుమతులు అందజేశారు. రెండు రోజుల పాటు నిర్వహించిన కంపెనీ స్థాయి ఫుట్బాల్ టోర్నమెంట్ పోటీలకు, క్రీడాకారులకు సౌకర్యాలను ఏర్పాటు చేసిన ఏరియా గౌరవ కార్యదర్శి, కోఆర్డినేటర్, ఆర్గనైజర్స్, స్పోర్ట్స్ సూపర్వైజర్ లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.టి.యూ.సి బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, దాగం మల్లేష్, సిఎంఓఏఐ. అధ్యక్షులు రమేష్, డబ్ల్యూ.పి.ఎస్ అండ్ జి. ఏ గౌరవ కార్యదర్శి కార్తీక్, స్పోర్ట్స్ సూపర్వైజర్ కార్పొరేట్ పాస్నేట్ , స్పోర్ట్స్ సూపర్వైజర్లు జాన్ వెస్లీ, సి.హెచ్. అశోక్, హెచ్. రమేష్, పి. శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఎస్. శివకృష్ణ, జనరల్ కెప్టెన్ సాక శ్రీనివాస్ అన్ని ఏరియాల క్రీడాకారులు, అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



# పట్టణంలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మార్నింగ్ వాక్

## - పరిష్కరించాలని వినతులు



**ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 6** : మందమర్రి పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలో గల 6,7,10 వార్డులు నార్లపూర్, ఊరు రామకృష్ణాపూర్,3 వ జోన్, దొరల బంగ్లా ఏరియాలో బుధవారం చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఉదయం మార్నింగ్ వాక్ చేసారు. ఉదయం అధికారులు, నాయకులు కార్యకర్తలతో కలిసి వార్డుల్లో తిరుగుతూ స్థానికుల నుండి వార్డులో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ మున్సిపల్ అధికారులకు అక్కడికక్కడే ఆదేశించారు. మందమర్రిలో ఆ సంపూర్తిగా ఉన్న లెదర్ పార్కు ను పరిశీలించిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి లెదర్ పార్క్ భూమి మీదుగా సోలార్ ప్లాంట్ కు వెళ్లేందుకు తీసిన దారిని పరిశీలించారు. లెదర్ పార్క్ భూములు ఆక్రమించుకుంటున్నారని సింగరేణిపై దళిత సంఘాల నాయకులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వెంటనే సింగరేణి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వారికి భరోసా కల్పించారు. వీరివెంట ఏ.ఈ అచ్యుత్ పార్టీ నాయకులు సొత్కు సుదర్శన్, నోముల ఉపేందర్ గౌడ్, గుడ్ల రమేష్, మంద తిరుమల్ రెడ్డి, పైడిమల్ల నర్సింగ్, రాయబారపు కిరణ్ ఆయా వార్డులకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



# జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం



**ప్రజాబలం ప్రతినిధి హనుమకొండ జిల్లా నవంబర్ 6:**తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సంస్థ,కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రభుత్వేతర రంగ సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని వివిధ రంగాలలో కృషి చేసిన, సేవలందించిన వారు డిసెంబర్ 25 లోగా జాతీయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని కార్యక్రమ నిర్వహణ కమిటీ ప్రతినిధులు పోలోజు రాజ్ కుమార్,డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్,డాక్టర్ మండలి లక్ష్మణ బాబు,అద్దంకి నాగరాజు లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారలలో భాగంగా స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్అవార్డ్స్,ఉమెన్స్,యూత్,స్పోర్ట్స్,స్ఫూర్తి, కీర్తి,ఇండియన్ అవార్డ్స్ తో పాటు స్వర్ణ కంకణం,తెలుగు వెలుగు నంది,తెలుగు వెలుగు జ్ఞాన బుద్ధ పూర్ణిమ అవార్డులను అందించనున్నట్లు తెలిపారు.ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ,కర్ణాటక, తమిళనాడు,ఒరిస్సా,మహారాష్ట్ర,పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సాహిత్యం,రచన,కవులు, కళాకారులు, సంగీతం, నృత్యం,భరతనాట్యం,కూచిపూడి,కోలాటం,చిత్రలేఖనం, శిల్పి,నాటకం,జానపదం,మిమిక్రీ,అవధానం,విద్య,వైద్య, ఇంద్రజాలం,ముఖాభినయం, హరికథ,ఒగ్గుకథ,బుర్రకథ,రంగస్థలం కళాకారులు,వాస్తు, జ్యోతిష్యం,భక్తి,పురోహితం,యోగా, క్రీడాలు,సామాజిక సేవా,షార్ట్ ఫిలిం,పర్యావరణం పరిరక్షణ,సైన్స్ అండ్ టెక్నాలజీ,డోలక్, హార్మోనియం,భజన, కళలు,వ్యవసాయం, కరాటే,మ్యాజిక్,టీవీ నాటక కళాకారులు,యువజన, మహిళ సంఘాలు ఉపాధ్యాయ,ఉద్యోగ,విద్యార్థి, గ్రామీణాభివృద్ధి తదితర రంగాలలో ప్రతిభావంతులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం తెలంగాణలో 2025 జనవరి 11న హైదరాబాద్ లో,ఆంధ్రప్రదేశ్ లో 2025 జనవరి 19న విజయవాడలో జరుగునని తెలిపారు.మరిన్ని వివరాలకు 9494400158 (తెలంగాణ కార్యక్రమ ఇంచార్జ్), 8897228804 (ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం ఇంచార్జ్) నెంబర్లలో సంప్రదించాలన్నారు.

# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే

## ఖచ్చితమైన కుటుంబాల సంఖ్య రావాలి

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 6:**రాష్ట్ర ప్రభుత్వం ఏంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య,ఉపాధి,రాజకీయ మరియు కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) పూర్తయ్యేనాటికి ఖచ్చితమైన కుటుంబాల సంఖ్య రావాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం అన్నారు.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా బుధవారం కీసర మండలం లోని రాంపల్లి దాయర, గోధుమకుంట, శామీకర్ పేట్ లోని అంతాయిపల్లి లలో నిర్వహిస్తున్న సర్వేను జిల్లా అదనపు కలెక్టరు రాధికా గుప్తాతో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ సర్వే పూర్తయ్యేనాటికి ఖచ్చితమైన కుటుంబాల సంఖ్య రావాలని ఎంపిడిఓ లకు సూచించారు. ఇక్కడ ఇళ్లు ఉండి, ఇతర జిల్లాలలో నివాసముంటున్న వారు స్వచ్ఛంధంగా ఎక్కడైన ఒక చోట మాత్రమే వారి వివరాలు నమోదు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్యుమరేటర్లకు అవసరమైనచో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని నోడల్ అధికారులకు సూచించారు. సర్వేకు సంబంధించిన ప్రొఫార్మలను భద్రపరిచేందుకు అవసరమైన ఫైల్ ఫోల్డర్లను, బ్యాగులను ఎన్యుమరేటర్లకు అందించాలను సూచించారు. కలెక్టరు ఇంటింటికి అతికించిన స్టిక్కర్లను పరిశీలించి, సర్వేకు సంబంధించిన ప్రొఫార్మలను పరిశీలించి ఏ విధంగా నమోదు చేస్తున్నారని, కుటుంబ సభ్యులను ఏమేమి ప్రశ్నలు అడుగుతున్నారని, మీకు ఎన్ని ఇండ్లు కేటాయించారని సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సర్వేలో తదుపరి వివరాలను సేకరించేటప్పుడు కుటుంబయజమానులు వారి వారి ఆధార్, ఓటర్, అవసరమైన కార్డులను ఎన్యుమరేటర్లకు చూపించేలా తెలపాలన్నారు. సూపర్ వైజర్లు, ఎన్యుమరేటర్లు హాజరవుతున్నారా అని ఎంపిడిఓ గ్యాం నాయక్ ను కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. ఈ సర్వేలో ఇంటి యజమానుల వివరాలను కలెక్టరు నేరుగా అడిగి తెలుసుకొని, స్టిక్కర్ అతికించారు.



ఈ పర్యటనలో జిల్లా ఎస్సీ డెవలప్ మెంట్ ఆఫీసర్ వినోద్ కుమార్, కీసర ఎంపిడిఓ గీన్యా నాయక్, నోడల్ ఆఫీసర్ సుకీర్తి, తహసీల్దారు అశోక్ కుమార్, శామీర్ పేట్ తహసీల్దారు యాదగిరిరెడ్డి, తూంకుంట మున్సిపల్ కమీషనర్ వెంకట గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదానికి గురైన సీనియర్ అసిస్టెంట్ మృతి



**ప్రజలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 6:** జె.లలిత్ మెహన్ (సీనియర్ అసిస్టెంట్) డిఇఓ ఆఫీస్ పనిచేస్తూ, గత సెప్టెంబర్ నెలలో రోడ్డు ప్రమాదానికి గురై నిన్న ఉదయం మరణించినారు. వారికి ప్రజావాణి నందు హాల్ ఈ రోజు మధ్యాహ్నంఏ 2:30 గంటలకు నివాళులు అర్పించి, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ లో అతని సేవలను కొనియాడుతూ, రోడ్డు పై ప్రయాణించే క్రమంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, టూ వీలర్ వాహనచోదకులైతే విధిగా హెల్మెట్ ధరించాలని. కారులో ప్రయాణించే వారైతే సీట్ బెల్ట్ తప్పనిసరియని. మొబైల్ మాట్లాడుతూ, డ్రైవింగ్ చేయకూడదని, వేగం కన్నా ప్రాణం మిన్న అని. డ్రైవింగ్ చేసే క్రమంలో ధ్రుష్టినంత రోడ్డు పై కేంద్రికరించి, ప్రశాంతంగా ఉంటూ, వేగాన్ని నియంత్రిస్తూ, నిదానంగా డ్రైవింగ్ చేయాలని, ట్రాఫిక్ నియమాలు ప్రతీ ఒక్కరూ తుచా తప్పకుండ పాటించాలని, సురక్షితంగా మీ మీ గమ్యాస్థానాలకు చేరుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఇఓ, విజయ లక్ష్మి కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎల్. రాంమోహన్ గారు,ఐడిఓసి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



# నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

## పాపన్నపేట ట్రాన్స్కో ఏఈ నర్సింలు

**ప్రజాబలం, పాపన్నపేట**మండల పరిధిలోని లింగాయపల్లిలో ఉన్న 33 కేవీ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా మండల పరిధిలోని రామతీర్థం, లింగాయపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్కో ఏఈ నర్సింలు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇట్టి విషయంలో విద్యుత్తు వినియోగదారులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

# 108 లో ఉద్యోగ నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం




**ప్రజాబలం ప్రతినిధి హనుమకొండ జిల్లా నవంబర్6:** 108 లో EMTఉద్యోగ నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానము

108 వాహనాల్లో (EMT)ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఉద్యోగ నియమకాలకు అసక్తిగల అభ్యర్థులు నేరుగా 07/11/24 నాడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటలవరకు హన్మకొండ మెటర్నటీ హాస్పిటల్ లోని 108 కార్యాలయం నందు నేరుగా దరఖాస్తులు స్వీకరించ పడుతయని ఉమ్మడి వరంగల్ జిల్లాల 108 ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్ తెలియజేసినారు దరఖాస్తుదారులు 30 సంవత్సరాలలోపు వయస్సు మాత్రమే ఉండాలన్నారు విద్యార్హతలు జిఎన్ఎమ్,బీఎస్సీ నర్సింగ్,ఎం.ఎల్.టి,డి.ఎం.ఎల్ టి. కోర్సులు, బీఎస్సీ లైఫ్ సైన్సస్ పూర్తి చేసినవారు అర్హులు. ఉద్యోగనియామకాలు అయిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలోని ఏ జిల్లాలలోనైనా ఉద్యోగాలు చేయుటకు సంసిద్ధంగా ఉండాలి అని తెలిపారు.

# సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని వినతి

## -ఎస్.ఐ రాజశేఖర్ ను కలిసిన కాలనీ వాసులు



**ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 6 :** మందమర్రి పట్టణంలోని ప్రాణహిత కాలనీలో గత కొంత కాలంగా కొంత మంది యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడి కాలనీలో దురుసుగా ప్రవర్తిస్తు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారి ఆగాడాలను అరికట్టేందుకు కాలనీ వాసుల రక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చెయ్యాలని నిర్ణయించుకున్న ప్రాణహిత కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు మంద వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్.ఐ శివనీతి రాజశేఖర్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ అన్ని ప్రాంతాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మీమీ ఏరియాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నట్లైతే సమాజంలో నేరాలు జరగకుండా నివారించవచ్చన్నారు.

# శాస్త్రీయ విద్య,సమానత్వ సమాజ స్థాపనే ధ్యేయంగా ఉద్యమిద్దాం

-పి.డి.ఎస్.యు. తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు

-పి.డి.ఎస్.యు. ఆధ్వర్యంలో విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభ




**ప్రజాబలం ప్రతినిధి హనుమకొండ జిల్లా నవంబర్6:** విద్యార్థి ఉద్యమంలో పనిచేస్తూ,తమ అమూల్యమైన ప్రాణాలు తృణప్రాయంగా అర్పించిన విప్లవ విద్యార్థి అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని,విద్యార్థి వీరుల పోరాట స్ఫూర్తితో నేటి విద్యార్థులంతా శాస్త్రీయ విద్య,సమానత్వ సమాజ స్థాపన కోసం పోరాడాలని పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహరావు పిలుపునిచ్చారు.

బుధవారం హన్మకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పి.డి.ఎస్.యు.ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విప్లవ విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభ అలువాల నరేష్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా బి.నరసింహారావు మాట్లాడుతూ 78 సంవత్సరాల స్వాతంత్ర భారత దేశంలో పాలకులు విద్యార్థులకు ఉచిత,నాణ్యమైన, సమాన విద్యను అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా కాషాయికరించి,భావిభారత పౌరుల మెదళ్లలో కుల,మత విష బీజాలు నాటుతూ,పౌరుల ప్రశ్నించే తత్వాన్ని,ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ,దేశ లౌకిక వ్యవస్థను ధ్వంసం చేస్తూ,విద్యార్థులను కుల, మతోన్మాదులుగా మార్చుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థుల గత మూడు సంవత్సరాల 6,500 కోట్ల రూపాయల పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదలపై నిర్లక్ష్యం వహిస్తూ,దళిత,గిరిజన,బడుగు, బలహీన,ముస్లిం,మైనారిటీ విద్యార్థుల ఉన్నత విద్య అవకాశాలు దూరం చేస్తూన్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు.సభ ప్రారంభానికి ముందు విద్యార్థి ఉద్యమంలో అమరులైన జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ (జె.సి.ఎస్) ,శ్రీపాద శ్రీహరి, కోలా శంకర్,దుస్సా చేరాలు,బొమ్మ సాంబయ్య,రంగవల్లి,మారోజు వీరన్న లను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి, ఘనంగా నివాళులర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. జిల్లా నాయకులు వినయ్,హర్ష, బాలు,వంశీ,శివాజీ,కార్తీక్ లు ప్రసంగించగా నాయకులు మనోహర్, రాఘవ, రాజేష్ ,ప్రకాష్,వినయ్, అజయ్, సాహితి,చందన,వైష్ణవి, నందిత,భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ లో గలాటా సృష్టించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రెస్ క్లబ్ బాధ్యులు



**ప్రజాబలం ప్రతినిధి హనుమకొండ జిల్లా నవంబర్6:** ప్రెస్ క్లబ్ లో గలాటా సృష్టించి,సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రెస్ క్లబ్ బాధ్యులు. మొన్న, నిన్న ప్రెస్ క్లబ్ లో కొందరు జర్నలిస్టులమంటూ ప్రవేశించి ప్రెస్ క్లబ్ బాయ్ ని దుర్భాషలాడటమే కాకుండా అక్కడే ఉన్న కోశాధికారి అమర్ ఇదేంటని అడిగినందుకు ఆయనపై సైతం దురుసుగా ప్రవర్తించి అక్కడ నుండి వెళ్లిపోయిన ఒక వ్యక్తి. నిన్న సాయంత్రం వివిధ సామాజిక మాధ్యమాలలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జర్నలిస్టులను గౌరవించాలని, పద్ధతి మార్చుకోవాలని డీజేఎఫ్ పేరిట తప్పుడు ప్రకటన చేశారు. బుధవారం ఉదయం కొందరిని వెంటవేసుకు వచ్చి క్లబ్ లో హంగామా చేస్తూ అక్కడ ఉన్న క్లబ్ బాధ్యులు,పలువురు జర్నలిస్టులతో దురుసుగా ప్రవర్తించి, దుర్భాషలాడారు.మాకు ఇక్కడకు వచ్చే హక్కుంది.మిమ్మల్ని అడగటానికి మీరెవరంటూ దురుసుగా ప్రవర్తించారు.గౌరవ ప్రదమైన జర్నలిజం వృత్తిపట్ల ప్రజల్లో చులకన భావం కలిగేలా ప్రవర్తించే ఇలాంటి వారిని ఉపేక్షించేది లేదనే నిర్ణయంతో వెంటనే జరిగిన సంఘటనలను గౌరవ పోలీస్ కమిషనర్ కి వివరించి, సుబేదారి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయటం జరిగింది.విచారించి తగిన చర్యలు తీసుకోవాలని సుబేదారి ఇన్స్ పెక్టర్ సత్యనారాయణ రెడ్డిని కోరటం జరిగింది.నకిలీ విలేఖరుల విషయంలో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను తనిఖీలు చేసిన డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ అప్పయ్య





**ప్రజాబలం ప్రతినిధి హనుమకొండ జిల్లా నవంబర్6** బీప్రాథమిక ఆరోగ్య కేంద్రం దామెర పరిధిలోని పిహెచ్సి మరియు పలు ఆరోగ్య ఉపకేంద్రాలను(ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) బుధవారం హనుమకొండ డిఎంహెచ్ఓ అప్పయ్య తనిఖీ చేశారు.నిర్మాణ%శీ% పూర్తి అయిన ఊరుగొండ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనాన్ని పరిశీలించడం జరిగింది.అలాగే ఊరుగొండలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల (ఇమ్యునైజేషన్) కార్యక్రమాన్ని పరిశీలించారు.దామెర పిహెచ్సి లోని మెడికల్ స్టోర్ లో మందుల లభ్యతను,రికార్డులను, ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు.పిహెచ్సి లో హాజరైన పేషెంట్ లతో మాట్లాడి సేవలు ఎలా అందుతున్నాయో అలాగే వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పిహెచ్సి పరిసరాలను ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.లాదేళ్ళ లో నిర్మాణంలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిశీలించి తగు సూచనలు చేయడం జరిగింది.కొగిల్వాయి లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కోసం కేటయించిన స్థలాన్ని పరిశీలించారు.

వ్యాధి నిరోధక టీకాలు డ్యూ లిస్ట్ ప్రకారం అందరికీ తెలియ చేసి 100% పిల్లలకు,గర్భిణీ స్త్రీలకు వ్యాక్సిన్ లు ఇవ్వాలన్నారు.అంగన్వాడీ కార్యకర్తలతో గర్భిణీ స్త్రీల నమోదు, పరీక్షలు,పోషణ,టీకాల కు సంబ%శీ%ధించి సమన్వయంతో పని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పల్లె దవఖాన వైద్యాధికారులు డాక్టర్ వనజా,డాక్టర్ రాధా శాంతి ప్రియ, పిహెచ్ఎన్ లీలా,హెల్త్ సూపర్ వైసర్ శ్రీకాంత్,భాగ్య లక్ష్మి, విప్లవ్ కుమార్ లు పాల్గొన్నారు.

# సన్నరకం ధాన్యం బోనస్ విషయంలో ఆపోహలొద్దు హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య





**ప్రజాబలం ప్రతినిధి హనుమకొండ జిల్లా నవంబర్6:** సన్న రకం ధాన్యానికి సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన బోనస్ విషయంలో ఎలాంటి అపోహలొద్దని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు.బుధవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ గోదాం వద్ద డిఆర్డిఏ ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆరబోసిన ధాన్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. వరి కోతలు, ధాన్యం గురించి స్థానిక రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఆరబోసిన ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి ఇప్పటివరకు వచ్చిన ధాన్యం గురించిన వివరాలతో పాటు సుమారుగా ఎంత ధాన్యం రానుందనే వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సన్న దొడ్డు రకం దాన్యం ఎంత మేరకు వచ్చిందని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వాతావరణ వివరాలను రైతులకు తెలియజేస్తున్నారా అని అధికారులను అడిగి తెలుసు కున్నారు. రైతులు సన్న రకం ధాన్యం బోనస్ అంశాన్ని గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా దానిపై కలెక్టర్ వివరణ ఇచ్చారు.అనంతరం మీడియాతో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఎక్కువ శాతం సన్న రకం దాన్యం వస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకే ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన 8 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించినట్లు తెలిపారు . ఈ ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా కొనుగోలు చేసిన అనంతరం దాన్యాన్ని వెంటనే తరలించేందుకు మిల్లుల ట్యాగింగ్ తో పాటు గోదాంల ట్యాగింగ్ కూడా చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 154 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా వందకు పైగా దాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు చెప్పారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ప్యాడి క్లీనర్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్ద కేంద్రాలలో డ్రయ్యర్లను కొనుగోలు చేసేందుకు ఆదేశాలు ఇచ్చామని, డ్రయ్యర్ల ను ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులోకి తీసుకురావడం వలన నిబంధనల మేరకు మాయిశ్చర్ రావడానికి అవకాశం ఉన్నందున ఈసారి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వీటిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన బోనస్ రూ. 500లు ఓపీఎంఎస్ ట్యాబ్ ఎంట్రీ అయిన వెంటనే సంబంధిత రైతుల ఖాతాల్లో నేరుగా జమ అవుతాయని పేర్కొన్నారు.సన్న రకం ధాన్యానికి సంబంధించిన బోనస్ విషయంలో ఎలాంటి అనుమానాలు, అపోహలకు పోవద్దన్నారు.హనుమకొండ జిల్లాలో కమలాపూర్,ఎల్కతుర్తి,ధర్మసాగర్, వేలేరు మండలాల్లో చాలావరకు వరి కోతలు పూర్తయ్యాయని, ఈ మండలాల నుండే ఎక్కువ ధాన్యం వస్తుందన్నారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.వరి కోతలు పూర్తి చేసుకుని ముమ్మరంగా ధాన్యం రానున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వివరించారు.ఈ సందర్భంగా డిఆర్డిఓ నాగ పద్మజ, తహసిల్దార్ జగత్ సింగ్, వ్యవసాయ, డిఆర్డిఏ అధికారులు పాల్గొన్నారు.

# కంసన్ హైజెన్ కేర్ పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్. పరిశ్రమ దగ్ధం

రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలోని కంసన్ హైజెనిక్ పరిశ్రమలో అర్ధరాత్రి ఒకసారిగా మంటలు చెలరేగాయి. పరిశ్రమలో నూతనంగా ఏర్పాటు చేసిన ఒక షెడ్డులో భారీ మంటలు ఎగిసిపడుతూ అందరూ చూస్తుండగానే క్షణాల్లో పూర్తిగా నేల మట్టం అయిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు తెలపడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమై ఉంటుందని భావిస్తున్నారు.సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. ఐదు ఫైర్ ఇంజన్ లతో మంటలను అదుపు చేసారు. ఘటనలో పరిశ్రమ పూర్తిగా అగ్నికి ఆహతి అయ్యింది.

## వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

### మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల ప్రత్యేక అధికారి కృష్ణాదిత్య




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 06:** ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలలో చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల ప్రత్యేక అధికారి కృష్ణాదిత్య అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లోగల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్లు సభావత్ మోతిలాల్, దీపక్ తివారి,కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా,కుమ్రంభీం ఆసిఫాబాద్ అదనపు ఎస్.పి.ప్రభాకర్ రావు లతో కలిసి 2 జిల్లాల సంబంధాల అధికారులతో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే క్రమంలో తేమ,తప్ప,తాలు ఇతర అంశాలలో పాటించవలసిన జాగ్రత్తలను వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని,వరి కోత సమయంలో హార్వెస్టర్ నిర్వాహకుల సమన్వయంతో పని చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్రాగునీరు,నీడ, గోదాములు, టార్పాలిన్లు,గన్నీ సంచులు,తూకం, తేమ యంత్రాలు, ధాన్యం క్లీనర్లు ఇతర అన్ని సదుపాయాలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు ధాన్యం తరలించే సమయంలో రవాణా, ఎగుమతి-దిగుమతిలో హమాలీల నిర్వహణ ఇతర అంశాలపై పర్యవేక్షించాలని తెలిపారు. రైస్‌మిల్లులలో రిజిస్టర్లను స్పష్టంగా నిర్వహించాలని, రైస్‌మిల్లర్లతో ఒప్పందాల ప్రక్రియ పకడద్బంధీగా ఉండాలని తెలిపారు. సన్నరకం వడ్లకు ప్రభుత్వం 500 రూపాయల బోనస్ అందిస్తుందని, ఈ క్రమంలో సన్నరకం, దొడ్డురకం వడ్ల సేకరణకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లర్లలో ధాన్యం అధికంగా ఉన్న సమయంలో గోదాములలో నిల్వ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని, వర్షాభావ పరిస్థితులలో రైతులు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన 15 రోజులలోగా సంబంధిత రైతుల ఖాతాలలో నగదు జమ చేసే విధంగా బ్యాంకర్లు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ... జిల్లాలో గుర్తించబడిన 326 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను దాదాపు ప్రారంభించడం జరిగిందని,కేంద్రాలకు అవసరమైన యంత్రాలు, పరికరాలు అందుబాటులో ఉంచడం జరిగిందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.ఈ సారి మూడు లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని, తదనుగుణంగా గన్ని సంచులు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.రైస్ మిల్లర్ల కొరకు బ్యాంకు గ్యారంటీ 100 శాతం ప్రక్రియ పూర్తి చేయాలని,జిల్లాలో 13 మిల్లులను గుర్తించడం జరిగిందని,ధాన్యం నిల్వ కొరకు అవసరమైన సామర్థ్యం గల గోదాములు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం బోనస్ చెల్లిస్తున్నందున ఇతర ప్రాంతాల నుండి ధాన్యం రాకుండా అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేసి విస్తృత స్థాయి తనిఖీలు చేపట్టి ధాన్యం అక్రమ రవాణాను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గ్రామీణ బ్యాంకు ముత్యంపేట శాఖ నాబార్డ్ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కార్యక్రమం



**ప్రజాబలం దండేపల్లి మండల రిపోర్టర్ నవంబర్ 06 :** తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ముత్యంపేట శాఖ,నాబార్డ్ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలంలోని వందురు గూడా గ్రామ ప్రజలకు వివిధ రకాల లోన్ ప్రొడక్ట్స్, డిపాజిట్ స్కీమ్స్ మరియు ఇన్సూరెన్స్ స్కీమ్స్ పై అవగాహన కల్పించడం జరిగింది వీటి తో పాటు ఎన్ పీ ఎస్ వాత్సల్య స్కీముల గురించి సామాజిక భద్రత పథకాల గురించి అలాగే డిజిటల్ సేవలు గురించి పొదుపుల గురించి చాలా చక్కగా కళాజాత వారు మాటల ద్వారా పాటల ద్వారా మ్యాజిక్ షో ద్వారా చాలా చక్కగా తెలియజేశారు.

శాఖ మేనేజర్ ఎన్ కిషోర్ కుమార్,జీ నవ్యశ్రీ,జీ సాగర్ పాల్గొన్నారు.సత్య కృష్ణ బృందం వారు వి సత్య కృష్ణ పాల్గొన్నారు.

## వరిగుంతం సీతారాం తండా కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆర్ డి ఓ మైపాల్ రెడ్డి



**ప్రజాబలం కొల్చారం మండలం నవంబర్ (06)** మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం సీతారాం తండా పిఏసిఎస్ కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్డీవో మైపాల్ రెడ్డి అనంతరం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు అందుబాటులో కావలసింది లారీలు ఉన్నాయని లారీల కొరత లేకుండా చూస్తామని దళారులను నమ్మొద్దని రైస్ మిల్లల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్లోడింగ్ చేసుకుంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో డిటిసి సివిల్ సప్లై పానిత ఎమ్మార్వో గపర్మియా ఆర్ ఐ ప్రభాకర్ సొసైటీ నెంబర్ మోహన్ సింగ్ శరత్ నాయక్ రవీందర్ నాయక్ సురేష్ నాయక్ శ్రీకాంత్ గౌడ్ కేవుల నాయక్ వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులు క్షేమంగా ఉన్నారు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 06 :** మంచిర్యాల పట్టణంలోని సాయి కుంట ప్రాంతంలో గల గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపాఋరు. పాఠశాలలోని 10 వ తరగతికి చెందిన 12 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, వీరిని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి ప్రత్యేక వైద్య నిపుణుల సమక్షంలో వైద్య సేవలు అందించడం జరుగుతున్నదని, ప్రస్తుతం అందరి విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.వీరి అనారోగ్యానికి కారణం తెలుసుకునేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులు త్రాగునీరు, ఆహారం నమూనాలను సేకరించడం జరిగిందని, పాఠశాలలో ఇతర విద్యార్థుల ఆరోగ్య పరీక్షల నిమిత్తం ప్రత్యేక వైద్య నిపుణులను పంపించి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ఆర్.ఓ.ప్లాంట్ ద్వారా త్రాగునీటిని అందించడం జరుగుతుందని, విద్యార్థినుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారులు త్రాగునీరు,ఆహారాన్ని మరియు అస్వస్థతకు గురి అయిన విద్యార్థులు తమ ఇంటి వద్ద నుండి తెచ్చుకున్న పచ్చడిని కూడా పరీక్షల నిమిత్తం పంపించడం జరిగిందని తెలిపారు. మీడియా ప్రతినిధులు వాస్తవ సమాచారాన్ని అందించి ప్రజల భయాందోళనలు తొలగించేందుకు సహకరించాలని తెలిపారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా 6 నవంబర్ 2024**

ప్రజాబలం ప్రతినిధిఈనెల నవంబర్ 2 వ తారీఖున పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్ 14 ఇయర్స్ కబడ్డీ బాలురు విభాగంలో సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ సిరిసిల్ల విద్యార్థి బి. నితిన్ ఎంపికై మాదాపూర్ మండలం తుర్కపల్లి జిల్లా యాదాద్రి భువనగిరిలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 7 తారీఖు నుండి 9 వ తారీకు వరకు జరిగే రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడోత్సవాల్లో . పాల్గొంటారని అలాగే గత నెల అక్టోబర్ 27 తేదీన పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్ 17 కబడ్డీ బాలికల విభాగంలో విద్యార్థినిలు కుమారి కే. స్నేహ, బి.శ్రీనిధి ఎంపికై మహబూబ్నగర్ జిల్లాలోని రాచాల గ్రామంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 3 తారీకు నుండి 5వ తారీఖు వరకు జరిగే రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడోత్సవాల్లో పాల్గొంటారని పాఠశాల పి ఈ టి మదన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ నాగుల సంతోష్ గౌడ్,మాట్లాడుతూ మా పాఠశాల నుండి గత సంవత్సరంలో మా విద్యార్థులు కబడ్డీ పోటీలో రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నారు అలాగే ఈ సంవత్సరం మా విద్యార్థులు రాష్ట్ర జాతీయ స్థాయి ఎంపికై పేరు తేవాలని కోరారు

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బిజ్జు. మార్టిన్ లూథర్ , ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని పీఈటిని అభినందించారు

## విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 06 :** గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మంచిర్యాల పట్టణంలోని సాయి కుంట గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో అస్వస్థతకు గురై జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 10వ తరగతి చదువుతున్న 12 మంది విద్యార్థులను మంచిర్యాల ఏ సి పి ప్రకాష్,ఆర్ ఎం ఓ శ్రీధర్ లతో కలిసి పరామర్శించారు. విద్యార్థుల అనారోగ్యానికి కారణం తెలుసుకునేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులతో త్రాగునీరు,ఆహారం నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించడం జరిగిందని,పాఠశాలలో ఇతర విద్యార్థుల ఆరోగ్య పరీక్షల నిమిత్తం ప్రత్యేక వైద్య నిపుణులను పంపించి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని,విద్యార్థులు తమ ఇంటి వద్ద నుండి తెచ్చుకున్న పచ్చడిని తినడం వల్ల అస్వస్థతకు గురయ్యారని నిర్ధారించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని,ఎలాంటి ఆందోళన అవసరం లేదని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో సీఎం మార్పు ప్రచారం ఎందుకు

హైదరాబాద్, నవంబర్ 6,రాజకీయాల్లో కాంగ్రెస్ రాజకీయాలు డిఫరెంట్‌గా ఉంటాయి. అంతర్గత ప్రజాస్వామ్యం కాస్త ఎక్కువగా ఉండే కాంగ్రెస్‌లో నేతల తీరు, మాటలు భిన్నంగా ఉంటాయి. దీని వల్ల ఎప్పటికప్పుడు కొత్త చర్చలు పుట్టుకొస్తుంటాయి. ప్రత్యర్థులు కూడా కాంగ్రెస్‌లోని ఈ పరిస్థితిని క్యాష్ చేసుకుని వారిని ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తుంటారు. అలా తెలంగాణ కాంగ్రెస్‌ను ఇరుకునపెట్టేందుకు రాష్ట్రంలో సీఎంను దించేందుకు కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తున్నారని ఒకరు.. సీఎం మార్పు ఖాయమని మరొకరు.. వరుసగా బీజేపీ నేతలు కామెంట్ చేయడం సరికొత్త పొలిటికల్ చర్చకు దారి తీసింది. రేవంత్ రెడ్డిని సీఎం పదవి నుంచి దించేయాలని కాంగ్రెస్ మంత్రులు, నాయకులు కుట్రలు చేస్తున్నారని, తగిన సమయం కోసం ఎదురు చూస్తున్నారని కొద్దిరోజుల క్రితం కొత్త చర్చకు తెరలేపారు కేంద్ర మంత్రి బండి సంజయ్.. రేవంత్ రెడ్డిపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, ఆ వ్యతిరేకత ఇంకా పెరగాలని కొందరు మంత్రులు భావిస్తున్నట్లు చెప్పారు. ఆ తర్వాత రేవంత్‌ను సీఎం పదవి నుంచి తొలగిస్తారంటూ చెప్పుకొచ్చారు..బండి సంజయ్ తర్వాత లేటెస్ట్‌గా బీజేపీఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి కూడా ఇదే రకమైన వ్యాఖ్యలు చేశారు. 2025 డిసెంబర్ నాటికి తెలంగాణలో కొత్త సీఎం రాబోతున్నారని జోస్యం చెప్పారు. సీఎం రేసులో ముగ్గురు మంత్రులు ఉన్నారని, వారిలో ఎవరైనా సీఎం కావొచ్చని అభిప్రాయపడ్డారు. గత 7 నెలలుగా సీఎం రేవంత్ రెడ్డికి ఆ పార్టీ ముఖ్యనేతలు అపాయింట్ మెంట్ ఇవ్వడం లేదని తెలిపారు.బండి సంజయ్ కామెంట్స్, ఆ తర్వాత మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ గట్టిగానే రియాక్ట్ అయ్యారు. సీఎం ఉండగా కొత్త సీఎం ప్రస్తావన ఎందుకు వస్తోందంటూ పేర్కొన్నారు టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్. సీఎం రేవంత్, మంత్రులు కలిసి ప్రజాపాలన అందిస్తున్నారన్నారు. సీఎం, మంత్రులు స్వేచ్ఛగా పని చేస్తున్నారని.. మహేశ్వర్ రెడ్డికే బీజేపీలో పెద్దగా ప్రాధాన్యత లేదంటూ కౌంటర్ ఇచ్చారు.ఇదే విషయంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా స్పందించారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com